అక్టోబర్ - 2024

DECCAN LAND, HYDERABAD


146

OCTOBER - 2024

₹30

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక



UNESCO Site Inscription : 2004 - GREAT LIVING CHOLO TEMPLES

VOL 13వ వసంతంలో

146 ISSUES నూట నలభై ఆరవ సంచిక

పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్



- అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ
- నదులు నాగరిక సోపానాలు
- బీటలు బారిన నేల-వనరుల వినియోగం
- ఇంద్రదేశం ఒక పురా చారిత్రక సందేశం



# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు



10 పుస్తకాల సెట్ ధర రూ.330 • తగ్గింపు ధర రూ. 300

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో గతంలో వెలువరించింది. అవి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందాయి.

అలాగే ఇప్పుడు పిల్లలకోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన **"పెద్దలు రాసిన పిల్లల కథలు"** పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. చిన్నారులు, పెద్దలు, సాహితీ వేత్తలు ఎప్పటివలె ఈ పుస్తకాలను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

**-మణికొండ వేదకుమార్**

చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



**ప్రతులకు**

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు

'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,

హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029


ఫోన్ : 9030 6262 88

*email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com*



## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు






## UNESCO SITE

**Great Living Chola Temples :** TamilaNadu, India
Date of Inscription: 2004 Category : Cultural (Group of Monuments)

## చోళ ఆలయాలు

11-12వ శతాబ్ది కాలానికి చెందిన, చోళ సామ్రాజ్యపు మూడు గొప్ప ఆలయాలను కలిగి ఉంది. గంగైకొండచోళీశ్వరమ్ వద్ద బృహదీశ్వరాలయం ఉంది. ఇది 53 మీటర్ల ఎత్తయిన గాలిగోపురాన్ని కలిగి ఉంది. గోపురానికి గల మూలలు, పై దిశగా చెక్కి ఉండే నిర్మాణం ఈ గోపురం ప్రత్యేకతలుగా ఉన్నాయి. తంజావూరు లోని బృహదీశ్వరాలయం గోపురంతో పోలిస్తే నిర్మాణంలో, ఎత్తులో, దానికి కాస్తంత భిన్నంగా ఉంటుంది. దారాసురం లోని ఐరావతేశ్వర ఆలయం 24 మీటర్ల గాలిగోపురం, శివుడి రాతి విగ్రహాన్ని కలిగిఉంటుంది. కళ, ఆర్కిటెక్చర్ రంగాల్లో చోళులు సాధించిన అద్భుత విజయాలకు ఈ ఆలయాలు నిదర్శనాలుగా ఉంటాయి.

ఈ కల్చరల్ మాన్యుమెంటు UNESCO చే 2004లో గుర్తించబడింది.

*ప్రత్యేక వ్యాసం : 29 పేజీలో*

TELANGANA
RESOURCE CENTRE

**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com







## అహెూం రాజుల సమాధుల చరిత్ర

యునెస్కో వరల్డ్ హెరిటేజ్ జాబితాలో భారతదేశంలోని అస్సాంలో ఉన్న అహెూం రాజుల సమాధులు మొయిడామ్స్‌కు అంతర్జాతీయ గుర్తింపు లభించిన సందర్భంగా, రచయిత సువేగా మొయిడామ్స్ చరిత్రను చాలా చక్కగా వివరించారు. తూర్పు అస్సాంలోని చరాయ్ దేవ్ ప్రాంతంలో అహెూం రాజుల నిర్దిష్ట ఎత్తయిన సమాధుల ఆచారానికి సంబంధించి అత్యంత ముఖ్యమైంది. బ్రహ్మపుత్ర లోయ అంతటా మొయిడామ్స్ ఉన్నప్పటికీ, నామినేట్ అయిన ప్రాంతంలో ఉన్నవి మాత్రం మరింతగా ఉన్నతమైనవి. 600 వందల ఏళ్ల కాలానికి చెందిన సమాధులు, నేలపై ఇటుకలు, రాళ్లతో లేదా మట్టితో నిర్మించిన హాలో వాల్ట్‌ను మట్టితో కవర్ చేసేలా నిర్మితమైన విధానాన్ని తెలియజేశారు. 43 ప్రాచీన కట్టడాల్ని వరల్డ్ హెరిటేజ్ జాబితాలో చేర్చే సందర్భంగా వరల్డ్ హరిటేజ్ కమిటీ 46వ సెషన్ భారతదేశంలో మొట్ట మొదటిసారి జరిగింది. ఢిల్లీలో జరిగిన ప్రోగ్రామ్స్, మరియు అహెూం రాజుల సమాధులు మొయిడామ్స్ చరిత్రను చాలా వివరంగా తెలియజేశారు. చారిత్రక కట్టడాలను కాపాడుకొని భావి తరాలకు తెలియ జేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. దక్కన్‌ల్యాండ్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు.

– డి. సాయి బాబా, మహబూబ్‌నగర్

❖ ❖ ❖

## గద్దర్‌కు గుర్తింపు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ మెమోరియల్ గార్డెన్‌కు నెక్లస్ రోడ్డులో ఒక ఎకరం స్థలాన్ని కేటాయించడం చాలా సంతోషం. అలాగే గద్దర్ ఫౌండేషన్‌కు రూ. 3 కోట్లు నిధులు మంజూరు చేయడం అభినందనీయం. గద్దర్ ఫౌండేషన్ ఆగస్టు 6న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన గద్దర్ ప్రథమ వర్ధంతి వేడుకలకు ప్రజాప్రతినిధులు, మేధావులు, కవులు, కళాకారులు, వివిధ సంఘాలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని గద్దర్‌తో తమకున్న అనుభవాలను, అభిప్రాయాలను వ్యక్తపరచడం చాలా సంతోషం. సభలో మాట్లాడిన ప్రముఖుల కొందరి అభిప్రాయాలను రిపోర్టింగ్ చేసిన రచయిత ఎసికె. శ్రీహరికి, మరియు దక్కన్‌ల్యాండ్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– భాస్కర్ మాదిగ, నల్లగొండ

❖ ❖ ❖

## కష్ట జీవులు చీమలు

రచయిత లచ్చయ్య సర్ సెప్టెంబర్ మాసంలో 'శ్రమైకజీవన సౌందర్యానికి ఖరీదులేదోయి!' అనే వ్యాసంలో చీమల శ్రమను తెలియజేశారు. చీమలు కూడా కీటకాల జాతికే చెందుతాయని, మగ చీమలు కేవలం సంతానోత్పత్తికి మాత్రమే జీవించి తనువు చాలిస్తాయని, అందు వల్ల చీమలది మాతృస్వామ్య వ్యవస్థ అని తెలిపారు. చీమలకు కూడా భాష వుందని పేర్కొన్నారు. చీమలు అత్యధికంగా శాఖాహారులని, చీమలు పర్యావరణ ఇంజనీర్లు అని, మానవులకు నాగరికతను నేర్పింది చీమలే అని చీమల యొక్క విశిష్టతను తెలియజేశారు. భూమిపై 15,000 రకాల చీమలు ఉన్నాయని, చీమల తెలివి తేటలు, చీమల ఆకారం, చేసే పనులు, జీవించే విధానం, క్రమశిక్షణ, సృజనాత్మకత ఇలా తెలియని అనేక విషయాల గురించి లచ్చయ్య సార్ ద్వారా తెలుసుకున్నాం. వారికి ప్రత్యేక ధన్యవాదాలు.

– బి.ఆర్. వెంకట కృష్ణ, హైదరాబాద్

❖ ❖ ❖

## షడ్రుచుల పత్రిక దక్కన్‌ల్యాండ్

పర్యావరణం, వారసత్వం, విపత్తుల నివారణ, గ్రామీణ, పట్టణ ప్రణాళిక, వ్యవసాయ రంగం, వైద్య, విద్య, జీవ వైవిధ్యం, జీవన విధానంపై, సహజ వనరుల పరిరక్షణ ఇలా అనేక అంశాలు అందిస్తున్న దక్కన్‌ల్యాండ్ దాచుకో దగిన పత్రిక. వివిధ రంగాల నిపుణులతో, ప్రముఖులతో వ్యాసాలు వ్రాయించడం, వారి అభిప్రాయాలు, ఇంటర్వ్యూలు తీసుకొని ఎంతో సమాచారాన్ని అందించి మా లాంటి కాంపిటీటివ్ విద్యార్థులకు ఎంతో దోహదపడుతుంది.

– బి. మురళీ, వరంగల్

## పరిశోధకులకు శుభవార్త

### దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

దక్కన్ ల్యాండ్ మాసపత్రిక ISSN (International Standard Serial Number) ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా ISSN 2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.

రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :
"చంద్రం" 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029 Telangana.
సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

- ఎడిటర్

ISSN 2581-3188

విషయసూచిక


# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 13 సంచిక : 2 పేజీలు : 60

అక్టోబర్ - 2024



సంపాదకులు
**మణికొండ వేదకుమార్**
9848044713
edit.deccan@gmail.com

సహాయ సంపాదకులు
**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్
**హెచ్. మోహన్‌లాల్**

వాణిజ్య ప్రకటనలు
**సయ్యద్ ఖైజర్ భాషా**
9030626288

ఫొటోగ్రాఫర్
**టి.స్వామి**


కవర్‌పేజీ
**చోళ ఆలయాలు**


layout & composing @
CHARITHA IMPRESSIONS

printed @ DECCAN PRESS
ఆజామాబాద్, హైదరాబాద్-500 020



కార్యాలయ చిరునామా


TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND
"CHANDRAM" 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029
TELANGANA
Mobile: 9030626288
Fax: 040-27635644
E-mail: desk.deccan@gmail.com
website : www.deccanland.com



**కృతజ్ఞతలు**

దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు సలహాలు, సూచనలు అందించిన వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.





కవర్ స్టోరీ
29వ పేజీలో

# లోపలి పేజీల్లో...

అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ





అలనాడు మామంచి సర్కారీ దవాఖానాలు


ఎం.ఎస్. ఆచార్య ........ డా॥ రామా చంద్రమౌళి ........ 6
దామ గుండంను కాపాడుకుందాం!.... (ఎడిటోరియల్) ........ వేదకుమార్. యం ........ 7
ప్రాకృతిక బసాల్ట్ స్తంభాలు ........ చకిలం వేణుగోపాల్‌రావు ........ 9
చేయిచాచి ఎదురు చూస్తున్న ఏకవీరాలయం ........ ఈమని శివనాగిరెడ్డి-స్థపతి ........ 12
అలనాడు మామంచి సర్కారీ దవాఖానాలు ........ పరవస్తు లోకేశ్వర్ ........ 13
జలాశయాల సంరక్షణ అందరి బాధ్యత ........ కట్టా ప్రభాకర్ ........ 16
సుస్థిర ప్రగతికి ఊతం... రెన్యువబుల్ ఎనర్జీ ........ పుట్టా పెద్దఓబులేసు ........ 17
బీటలు బారిన నేల.. వనరుల వినియోగం ........ డా॥ ఆర్. సీతారామారావు ........ 21
అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ ........ ఎసికె. శ్రీహరి ........ 23
ఉమ్మడి విశాఖపట్నం: శిలా మరియు ఖనిజ సంపద ........ కమతం మహేందర్‌రెడ్డి ........ 25
హరప్పా సంస్కృతి శతాబ్ది ఆవిష్కరణ ........ దక్కన్ న్యూస్ ........ 28
చోళ ఆలయాలు ........ జాహ్నవీజ్ శర్మ ........ 29
ముడమాల మెగాలిథిక్ మెన్హిర్స్ సైట్ ........ జి. సూర్యనారాయణ మూర్తి ........ 31
చింతచెట్టు కింద పాఠాలతో హైదరాబాద్ అభివృద్ధి ........ వేదకుమార్ మణికొండ ........ 33
నదులు - నాగరిక సోపానాలు ........ ద్యావనపల్లి సత్యనారాయణ ........ 35
అప్రతిహతంగా నడుస్తున్న మాసపత్రిక దక్కన్‌ల్యాండ్ ........ సంగీతపు రాజలింగం ........ 39
గాలీబ్ కోర్టు ప్రస్థానం ........ మంగారి రాజేందర్ (జింబో) ........ 41
ఇంద్రదేశం ఒక పురా చారిత్రక సందేశం ........ శ్రీరామోజు హరగోపాల్ ........ 43
బహుజనుల ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ ........ దక్కన్ న్యూస్ ........ 46
సింగరేణి కార్మికులకు దసరా కానుకగా లాభాల బోనస్ ........ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ........ 47
మొదటితరం భూచరాలం! మానవులకు ముత్తాతలం!! ........ డా॥ లచ్చయ్య గాండ్ల ........ 49
సులభతరం వ్యాపారంకు సింగిల్ విండో కీలకం ........ దక్కన్ న్యూస్ ........ 53
మా ఎల్లమ్మ ఆకాశంలో - మా మాతంగి అగాథంలో ........ కృపాకర్ మాదిగ ........ 55
సామలు - ఆరోగ్య ప్రయోజనాలు ........ దక్కన్ న్యూస్ ........ 57
మార్పు (కథ) ........ యాడవరం సహస్ర గౌడ్ ........ 58



**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, సంస్కృతి, జీవవైవిధ్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# ఎం.ఎస్. ఆచార్య

మాడభూషణం శ్రీనివాసాచార్య అనే పేరు చాలా మందికి పూర్తిగా తెలియదు. అందరికీ ఆయన ఎం.ఎస్.ఆచార్యగా మాత్రమే తెలుసు. ఆయన వరంగల్లు పత్రికారంగపు కురు వృద్ధులు. 'మాట కటువు మనసు వెన్న' అని చాలమంది విజ్ఞులచేత ప్రశంసించబడ్డ ఆచారిగారితో మాట్లాడుతున్నప్పుడు కాస్త ఒళ్ళూ మనసూ దగ్గరపెట్టుకుని స్పృహతో మాట్లాడ్తే మంచిది అని ఎవరికి వారు తడుముకునేట్టు చేస్తూనే ఎన్నడూ ఎవరినీ భయపెట్టకనే భయపెట్టిన అమృత హృదయుడు. నాకు తెలిసి ఆయన అచ్చమైన మహా మానవుడు. నా వెంటబడి అద్భుతమైన కవిత్వాన్ని రాయించి, దాన్ని 'జనధర్మ' పత్రికలో సీరియలైజ్ చేసినారు.

'ఇదేమిటి సార్.. కవిత్వాన్ని సీరియలైజ్!'... అనంటే... 'ఔను!... నవలలనే చేయల్నా... మనం కవిత్వాన్ని కూడా సీరియలైజ్ చేసి... కవిత్వ సౌందర్యాన్ని కూడా చాటి చెబుదాం" అని చేసి చూపి... దాన్ని 'శిలలు వికసిస్తున్నాయి' అన్న మార్మిక మకుటంతో పుస్తకంగా వెలువరించారు. ఎం.ఎస్.ఆచార్య సాహసి. ప్రయోగశీలి, శ్రమజీవి. దేనికోసమూ వెంపర్లాడని నిరాడంబరుడు. నిరామయుడు.



కె.పి.ఎస్.రోడ్‌లో 'జనధర్మ' ఆఫీస్... అంటే... ముందు గది దర్వాజా దగ్గరే ఒక టేబుల్ ముందు కూర్చుని చెవుల్లో వినికిడి యంత్రంతో నిరంతరం అక్షరాలతో కుస్తీపడ్తూ ఒక యోగిలా కనిపించే ఆచార్య. వెనుక శృతిలా శబ్దిస్తూ అచ్చు యంత్రం... దాంతో కుస్తీ పడ్తూ ఇద్దరు వర్కర్స్... మా యెల్లండి రమేషో... (ఇప్పుడు ఆంధ్రజ్యోతి విలేకరి) లేక మా శ్రీధరో... (ఇప్పుడు భారత ప్రభుత్వ సమాచార హక్కు కమీషనర్)... అప్పుడప్పుడు మా రాజగోపాలాచారో (ఇప్పుడు విశ్రాంత ప్రొఫెసర్) కనిపించేవారు. ఎందుకో నాకు అక్కడికి వెళ్ళినప్పుడల్లా సర్వసతీ పాదమంజీరాల మృదుమధుర ధ్వని వినిపిస్తున్నట్టనిపించేది. ఎప్పుడూ ఎవరో ఒకరు సాహిత్య కారుల సందర్శనమే అక్కడ... కోవెల సంపత్కుమార గారో, సుప్రసన్నగారో, కొండబత్తిని జగదీశ్వరరావుగారో, కొండొకచో కాళోజీగారో... అది అక్షర క్షేత్రం. ఎం.ఎస్.ఆచార్య అంతటా జ్ఞాన పరిమళం. 'జనధర్మ' వారపత్రిక నడుస్తూ నడుస్తూ... 'జనధర్మ సాహిత్య ప్రత్యేక సంచికగా' ముస్తాబవుతూండడం... దానికి మహామహులు తమ తమ రచనల్ని పంపుతూండడం... నాలాంటి నూనూగు మీసాల యువ కవులు తాజా వ్యాసాలనూ, రచనలనూ అప్పటికప్పుడు చదివే భాగ్యానికి మురిసిపోవడం... ఆచారిగారి అనుగ్రహంతో నేనుకూడా ఆ పెద్దలతో సమంగా అక్షర పంక్తిలో చేరిపోవడం... "మౌళీ... నీ కథ... నీ కవిత వీళ్ళకంటే ఏం తక్కువగా ఉందిరా... విజృంభించు..." అని ఆచారిగారు వెన్ను తట్టడం జరిగేది. ఆయన ఏ కొద్ది ప్రతిభ ఉన్న ఏ అక్షరకారునికైనా చేయందించి ప్రోత్సహించాడు. పరిష్కులైన రచయితలెందరో కె. జగదీశ్వరరావు... దేవులపల్లి సుదర్శనరావు, బి. నాగేశ్వరరావు, తురగా కృష్ణమోహనరావు, వరవరరావు, అంపశయ్య నవీన్, కోవెల సంపత్కుమార, కోవెల సుప్రసన్న, పేర్వారం జగన్నాథం, డా. ఇందుర్తి ప్రభాకరరావు, సురమౌళి, హీరాలాల్ మోరియా, తురగా జానకీరాణి, డా. మాదిరాజు రంగారావు, ప్రముఖ జర్నలిస్టులు డి. సాయిబాబా, టంకశాల అశోక్, యం. శ్రీధర్ రచనలు విరివిగా వచ్చేవి. ప్రతి రెండు నెలకొకసారి వెలువడే 'జనధర్మ ద్వైమాసిక సాహిత్య పత్రిక' నొకదాన్ని ఆచార్యగారు సుప్రసన్న గారి సంపాదకత్వంలో తెచ్చేవారు. అది రాష్ట్ర స్థాయిలో ఎంతో ప్రామాణికంగా వెలుగొందేది. దాంట్లో ఒక రచన వచ్చిందంటే... అప్పటి ప్రామాణిక పత్రిక "భారతి"లో వచ్చినంత పొంగిపోయేవారు రచయితలు.

సాహిత్యంలో అనేకానేక ప్రయోగాలు కూడా చేశారు ఆచార్యగారు. ప్రముఖ రచయితలైన కె.ఎల్.నరసింహారావు, సింగరాజు లింగమూర్తి, గోపాలశాస్త్రి, మునిమాణిక్యం, నరసింహారావు, రావూరి భరద్వాజ గార్లతో గొలుసుకట్టుగా 'పెళ్లి ముచ్చట్లు, పేచీలు, ఐన్నకాపురం, మరికొన్ని పేచీలు, స్వగ్రామానికి' అన్న ఉపశీర్షికలతో రచించిన సమగ్ర నాటకాన్ని ప్రచురించి, ఒక కథా వస్తువును తీసుకుని వివిధ రచయితలు ఏ విధంగా విచిత్రమైన మలుపులు త్రిప్పి సమగ్రపరుస్తారనేదానికి నిదర్శనంగా ప్రయోగాత్మక జమిలి రచనను వెలువరించారు. ఐతే ఈ మొత్తం నాటకం పేరు 'గిలిగింతలు'. (27-7-1961 నుండి 7-9-1961 దాకా ప్రచురితం). ఇది బహుళ జనాదరణ పొందింది.


ఎం.ఎస్. ఆచార్య గారి జీవితంలోకి తొంగి చూస్తే కొన్ని పరమ సత్యాలు గోచరిస్తాయి మనకు. అవి 1) మనిషికి జీవితం జన్మతః ఒక ఘటనగా సంభవించినా 'ఎరుక', 'స్పృహ' ఉన్న మనిషి తన జీవితాన్ని తనే నిర్మించుకోవచ్చని. 2) తన మనస్తత్వాన్ని బట్టి చిత్తశుద్ధితో, క్రమశిక్షణతో, ఒక కార్యాచరణ ప్రణాళికతో గనుక మనిషి ప్రయత్నిస్తూ పోతే తప్పక లక్ష్యించిన జీవితాన్ని మనిషి తప్పక పొందగలుగుతాడని. 3) జీవితంలో మనిషి ఎక్కడా రాజీ పడకుండా కూడా అద్భుతంగా జీవించవచ్చని 4) అంతిమంగా మనిషి జీవితాన్ని ఒక 'ఉత్సవ' సదృశంగా జీవించవచ్చని.

(తరువాయి 8వ పేజీలో)

# దామగుండంను కాపాడుకుందాం!

ఈ మధ్య బాగా వినిపిస్తున్న పదం పర్యావరణం. మేధావులనుంచి సామాన్య ప్రజల దాకా, అంతర్జాతీయ సంస్థల నుంచి గ్రామీణ యూనిట్స్ దాకా ఏనోట విన్నా ఈ పర్యావరణం అన్న పదమే. ఇది విషాదకరమూ, ఆనందకరమూనూ. రోజురోజుకీ విధ్వంసమవుతున్న పర్యావరణ సమతుల్యత గురించి నిరంతరం ఆందోళన చెందవలసిరావటం విషాదకరం. అన్ని విపత్తులకీ ఈ విధ్వంసమే కారణమనే స్పృహ సామాన్య ప్రజలలో కూడా పెరిగి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం ఆనందకరం.

ప్రజల జీవన వికాసానికి వివిధ రంగాలలో సమగ్రాభివృద్ధి కీలకమైన అంశం. అయితే ఈ అభివృద్ధి సుదీర్ఘ ప్రయోజనాల పునాదిగా సమగ్ర ప్రణాళికలతో సాగవలసి వుంటుంది. మనిషి మనుగడకి, మనిషి సంక్షేమానికి ఉపయోగపడని అభివృద్ధి, హాని కలిగించే అభివృద్ధి, విధ్వంసకర అభివృద్ధి అవుతుంది. ఈ అవాంఛనీయ అభివృద్ధిని నిరాకరించడం అభివృద్ధిని నిరాకరించడం కాదు.



హైద్రాబాద్ విశ్వనగరంగా రూపొందుతున్న దశలో హైద్రాబాద్‌కి, తెలంగాణాకు పెను ప్రమాదం దామగుండం అటవీ విధ్వంసం రూపంలో పొంచివుంది. వికారాబాద్ సహజ అటవీ ప్రాంతంలో ఈ దామగుండం వుంది. ఇక్కడ ఏడెనిమిది శతాబ్దాల చరిత్ర వున్న రామలింగేశ్వరస్వామి ఆలయం వుంది. దీనికి 2,713 ఎకరాల ఎండోమెంట్ భూమి వుంది. దానిలో 12 లక్షల వృక్షాలున్నాయి. 150 రకాల ఔషధీ మొక్కలు విస్తారంగా ఉన్నాయి. ఇక్కడున్న గుండం 365 రోజులూ పుష్కలమైన, స్వచ్ఛమైన నీటితో కలకల లాడుతుంది. ఇక్కడ చుట్టుపక్కల వున్న 20 పల్లెల్లో 60వేల మంది ప్రజలు, వారి పశువులుతో ఈ అడవిని ఆసరా చేసుకుని జీవిస్తున్నారు. ఇప్పుడు ఈ భూమి ఎండోమెంట్ నుంచి అటవీ శాఖకు అప్పగించబడి రాడార్ కేంద్ర నిర్మాణం కోసం నేవీకి యివ్వడం జరిగింది. రాడార్ నిర్మాణం కోసం 12 లక్షల చెట్లను నరకబోతున్నారు. దీనివల్ల జరిగే పర్యావరణ అసమతుల్యతను, నష్టాలను, భవిష్యత్ ప్రమాదాలను అంచనా వేయడం సాధ్యంకాదు. ఇక్కడే పుట్టిన మూసీనది, ఇక్కడ ప్రవహించే ఈసా, కార్నా నదులు ధ్వంసమవుతాయి. వరదలు, పొల్యూషన్, ప్రకృతి విపత్తులకు, నీటికొరతకు హైద్రాబాద్ నగరం, తెలంగాణా గురవుతాయి.

ఒక వైపున అడవుల పెంపుకోసం, మూసీనది ప్రక్షాళన కోసం కృషి జరుగుతున్న సమయంలో దామగుండం అడవులను నరికవేత, రాడార్ కేంద్ర నిర్మాణం అభిషణీయం కాదు.

హైద్రాబాద్ రక్షణ కోసం, తెలంగాణా రక్షణ కోసం దామ'గుండం'ను కాపాడుకుందాం.


వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

(6వ పేజీ తరువాయి)

బయట బాగా డబ్బున్న పెట్టుబడిదారుల ఆధిపత్యంలో దినపత్రికలు నడుస్తున్న 1980లలో.. సరియైన అర్థబలమూ, అంగబలమూ లేని ఆచార్య గారు తనకు అత్యంత అంతరంగికులైన ఎం. వీరాస్వామి గారిని, వసతి కోసం బేతి నర్సయ్య గారినీ, ఆలోచనా లోచనంగా, అక్షయ తూణీరంగా కొండబత్తిని జగదీశ్వరరావు గారినీ నమ్ముకుని వరంగల్లు జన జీవనంతో పెనవేసుకున్న తన అర్రద ప్రేమతో, అనుబంధంతో వరంగల్లు నగరంలో వెలవరించిన మొట్టమొదటి దినపత్రికగా 'జనధర్మ' ద్వై వారపత్రిక. అది 'వరంగల్లు వాణీ'గా అవతరించింది. అప్పుడు ఆ అడుగు ఎంతో సాహసోపేతమైనదే కాకుండా ఆశ్చర్యకమైంది కూడా.

ఒక వ్యక్తి గురించిన విజయాలగురించి తెలుసుకోవడం కంటే ముందు ఆ వ్యక్తి అసలు బతకడమెలా నేర్చుకున్నాడో తెలుసుకోవడం అత్యంత స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. మా భూషణం శ్రీనివాసాచార్య సూర్యాపేటలో 3 అక్టోబర్ 1924న జన్మించారు. బాల్యమంతా వెల్లికుదురులో గడిచింది. వారిది పండితుల కుటుంబం. లక్ష్మీకటాక్షం లేదుగాని అందరూ సరస్వతీ పుత్రులే. తన నాన్నగారి దగ్గరే చిన్ననాడు సంస్కృతం నేర్చుకున్నారు. శబ్ద మంజరి, బాల రామాయణం, ధాతు మంజరి, రఘువంశం, కుమార సంభవం, మేఘ సందేశం, పంచోపనిషత్తులు, తిరుప్పావై వంటి ఆధ్యాత్మిక విద్యలన్నీ కంఠోపాఠమైపోయిన తర్వాత ఇక వాస్తవ జీవిత పఠనంలోకి ప్రవేశించారు. అప్పుడు సూర్యపేట కేంద్రంగా ఉవ్వెత్తున సాగుతున్న 'తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటానికి' రాష్ట్ర నాయకులైన దేవులపల్లి వెంకటేశ్వరరావుతో పరిచయం ఏర్పడి. . యువకుడైన ఆచార్య గారిలో ఉద్యమ స్ఫూర్తి రగిలి 'సంఘం' పని మీద నల్గొండ జిల్లాలోని



చందుపట్ల, రేపాల, టేకుమట్ల, వల్లభాపురం, నకిరేకల్ మొదలైన పలు గ్రామాల్లో పర్యటించేవారు. మనసునిండా అట్టుడుకుతున్న రజాకార్ల దేశ్ ముఖ్‌ల దౌర్జన్యాల ప్రతిఘటనేచ్ఛ.. మరోవైపు కేన్సర్ వ్యాధితో తల్లిగారి మరణం. ఆ కారణాలవల్ల కుటుంబమంతా ఉదర పోషణార్థం వరంగల్లుకు చేరుకుని... ఇక జీవికాన్వేషణ.

మొదట డాక్టర్ లక్ష్మణ్ సా పవార్ వద్ద నెలకు 12 రూపాయల జీతంపై కాంపౌండర్ ఉద్యోగం. తర్వాత బ్రైవాలా శ్రీ రాజన్ సా గారితో పరిచయమేర్పడి సికిందరాబాద్ ప్రయాణం. నెలకు 15 రూపాయల జీతం. దూరప్రాంతాలకు వ్యాపార నిమిత్తం పర్యటనలు.. చివరికి మళ్ళీ ఉమర్జీకర్ యొక్క 'హిందూ సేవా సంఘం'ను వరంగల్లులో స్థాపించటానికి తిరిగి వరంగల్‌కు ప్రయాణం. యువజన ఆర్గనైజేషన్స్ నిర్వహణోల 'ప్రతాప రుద్ర దళం' ఏర్పాటు. ఖత్రీల పాఠశాలలో అధ్యాపక వృత్తి. నెలకు 25 రూపాయల జీతం... ఇలా.. 'రోలింగ్ స్టోనే' కాని గ్యాథరింగ్ సం మాస్.. చివరికి విధి ఆయన్ను పత్రికా రంగం వైపు తరిమింది. ముస్త్యాల శంకర్‌రావు రూపంలో వచ్చి, అప్పుడు ప్రాచుర్యమున్న 'ఆంధ్ర పత్రిక' ఏజంట్‌గా 1948లో... అటు తర్వాత అదే 'ఆంధ్ర పత్రిక'కు విలేఖరి. అప్పుడు రోజూ 23 కాపీలు అమ్మే పత్రికను 1450 కాపీలు అమ్మే పత్రికగా తీర్చి దిద్ది... విజృంభించారు. అప్పుడు మదరాసు నుండి వచ్చే 'ఆంధ్రపత్రిక' కట్టల్లో నిజాంకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి మద్దతుగా.. రహస్యంగా కొన్ని కరపత్రాల కట్టలను ఉద్యమకారులకు అందజేయుట.. ఇక్కడ వృత్తికీ, ప్రవృత్తికీ మధ్య ఘర్షణ... అప్పుడప్పుడు పోలీసులకు పట్టుబడటం. మళ్లీ బయటకు రావడం ఈ లోగా 'ఆపరేషన్ పోలో' పోలీస్ చర్య.. నిజాం లొంగుబాటు.. అప్పటికి పి.వి.నరసింహారావు, పాలములపర్తి సదాశివరావు గారలు నడుపుతున్న 'కాకతీయ పత్రిక'లో కొన్నాళ్లు పని చేయడం... ఈ పరంపరలో 1958 నవంబర్‌లో ముస్త్యాల శంకరరావు, యాదగిరి ఆర్య, దివ్వెల హనుమంతరావు, ఎం.ఎస్.ఆచార్య... నలుగురూ కలిసి 'జనధర్మ' వారపత్రికను ప్రారంభించారు. తర్వాత క్రమంగా ఒక్కరొక్కరు వాళ్ళ వ్యక్తిగత కారణాలవల్ల విడిపోవడంతో ఆచార్య గారొక్కరే 1971లో బాలాజీ ప్రింటింగ్ ప్రెస్‌ను ఆరంభించి.. ఒంటరి ప్రయాణం.

సర్వస్వతంత్ర, స్వావలంబన అన్న అతి మూలమైన స్వేచ్ఛకు సంబంధించిన అంశాల స్వాధీనతతో ఇక ఆచార్యగారు తనదైన పద్ధతిలో పత్రికను నడిపి అనతికాలంలోనే వరంగల్లు పౌరుల్లో 'జనధర్మ' అంటే మన పత్రిక అన్న ఆత్మీయ భావనను పాదుకొల్పగలిగి తన పదునైన సంపాదకీయాలతో రాష్ట్ర స్థాయి సంపాదకులకు ధీటుగా వెలువరిస్తూ వరంగల్లు పేరునూ, కీర్తినీ, ప్రతిష్ఠనూ ఇనుమడింపజేశారు.

ఆ తర్వాత 1971లో 'వరంగల్లు వాణి' ఆవిర్భావం' ఆచార్యగారి స్వప్న సాక్షాత్కరమే.

ముందే చెప్పినట్టు... ఆయన కలం పదునైనది. వాక్కు దారుణా ఖండల శస్త్ర తుల్యమైనది. అందుకే పచ్చి నిజాలను బహిర్గత పరిచే ఆయన నిజాయితీ కొందరికి నచ్చేది కాదు. ఐనా నిప్పు తన దహించే గుణాన్ని మార్చుకోదుగదా.

వ్యక్తి ప్రతిభ ఎప్పుడూ తను పనిచేస్తున్న కార్యస్థానాన్నిబట్టి ప్రాచుర్యంలోకి వస్తుంది. వజ్రం కిరీటంలో ఉన్నదా, ముంజేతి కంకణంలో ఒదిగి ఉన్నదా... పాదరక్షను అంటిపెట్టుకుని భాసిస్తున్నదా అన్నది ప్రధానమైన అంశమే. కలంను కరవాలంగా ఝుళిపించిన ఆచార్య ఢిల్లీలో ఉంటే జాతీయ స్థాయి జర్నలిస్ట్, హైదరాబాద్‌లో ఉంటే రాష్ట్ర స్థాయి జర్నలిస్ట్. కాని ఆయన వరంగల్లులోనే ఉన్నారు. తన జనజీవితంతో పౌరుల ఆత్మను ముడివేసుకుని.

ఎం.ఎస్.ఆచార్య ప్రజా హృదయ పీఠాన్ని అధిష్టించిన 'హ్యూమన్ జర్నలిస్ట్'... హృదయ లేఖకుడు.

*(తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన 'తెలంగాణ తేజోమూర్తులు' నుంచి)*

–డా॥ రామా చంద్రమౌళి


పొచ్చెర, బోథ్ మండలం - ఆదిలాబాద్


గౌరి, ఆసిఫాబాద్ - కొమరంభీం జిల్లా

# ప్రాకృతిక బసాల్ట్ స్తంభాలు

దక్కన్ పీఠభూమిలో పశ్చిమదిశగా మహారాష్ట్ర కేంద్రంగా చుట్టు పక్కల రాష్ట్రాలలో దాదాపు 5 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్న బసాల్ట్ పొరలు ఉంటాయి. ఇవి తక్కువ ఎత్తులో ఉన్న చదునైన గుట్టలరూపంలో ఉంటాయి. వీటి ఆకారం మెట్లవలె ఉన్నందున ఇంకా అవి దేశంలో దక్షిణం వైపు ఉన్నందున వీటిని "దక్కన్ ట్రాప్"లు అంటారు. తెలంగాణ రాష్ట్రంలో ఆదిలాబాద్ నిజామాబాద్ కరీంనగర్ మెదక్ రంగారెడ్డి మరియు మహబూబునగర్ జిల్లాలో ఈ దక్కన్ ట్రాపులు వ్యాపించి ఉన్నాయి.

ఇవి భూమిలో ఏర్పడిన ఛిద్రాల నుండి 6.5కోట్ల సంవత్సరాల క్రితం బయటకు వచ్చిన లావా ప్రవాహాలు ఘనీభవించి ఏర్పడ్డ బసాల్ట్ అనే అగ్నిశిల. ఈ బసాల్ట్ పొరలలో అక్కడక్కడ ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన స్తంభాలు ఉన్నాయి. వీటిని కాలమ్నార్ బసాల్ట్ /జాయింట్లు అంటారు. ఈ బసాల్ట్ ప్రవాహాల సమూహాలను భూవైజ్ఞానిక పరిభాషలో Deccan Volcanic Province (DVP) అంటారు.

**ఎలా ఏర్పడతాయి?**

స్తంభాకార బసాల్ట్ ఎలా ఏర్పడతాయి అనే విషయం లో స్పష్టత లేదు. సాధారణంగా వీటిని ఎండిపోయిన బురదలో ఏర్పడే పగుళ్ళతో పోల్చవచ్చు. లావా ప్రవాహాలు పరుచుకుని ప్రవహించే క్రమంలో చల్లబడి,సంకోచం చెంది, బహుభుజ ఆకారం పగుళ్ల ఏర్పడి, అవి నిలువుగా క్రింది వైపు విస్తరించి స్తంభాలుగా ఏర్పడుతాయి. "శీతలీకరణ బిందువు"చుట్టూ లావా తన్యత వల్ల సంకోచం చెంది, ఒకే నిడివి గల పగుళ్ళు ఏర్పడ్డాక అవి నిలువుగా అధోముఖంగా విస్తరించి, ఏకరూప స్తంభాల సమూహాలు ఏర్పడుతాయి. ఇలా ఒక క్రమపద్ధతిలో సమానదూరాలతో ఈ ప్రక్రియ పునరావృతం కావడం వల్ల బసాల్ట్ పొరలో స్తంభాకార బసాల్ట్ నిర్మాణం ఏర్పడుతుంది. వీటిని "కాలమ్నార్ జాయింట్"లు అని కూడా అంటారు. ఈవిధంగా ఒకే విధమైన ఆకారం ఉన్న బహుభుజ పగుళ్ళు లావాపొరను అనేక స్తంభాలుగా చీలుస్తుంది. ఈ సంకోచంవల్ల ఏర్పడిన చీలిక ఎల్లప్పుడూ ఉపరితలానికి లంబంగా కిందివైపు విస్తరించి స్తంభాల నిర్మాణంలో పాత్ర వహిస్తుంది.

ఈ స్తంభాలు లావాప్రవాహం కూర్పు, స్నిగ్ధత, స్వభావం, చల్లబడేవిధానం మొదలైన పరిస్థితులను బట్టి స్తంభాలు వివిధ ఆకారాలలో ఏర్పడతాయి, ఇవి షట్కోణాకారంలో పంచ కోణాకారంలో చతుర్ముఖ ఆకారంలో ఒకోసారి అసమాన ఆకారంలో కూడా ఏర్పడుతాయి.

**బసాల్ట్ స్తంభాల ఉద్భవం:**


లావా కూర్పు: దక్కన్ పీఠభూమిపైన ఏర్పాడ్డ లావా ప్రవాహాలు థూలైటిక్ బసాల్ట్ రకం, (Tholeiitic Basalt) వీటిలో ఇనుము మెగ్నీషియం సమృద్ధిగా ఉంటాయి. ఇవి అధిక స్నిగ్ధత కలిగి వాయువు శాతం తక్కువగా ఉంటుంది. వీటిలో ఏర్పడే స్తంభాలు షట్కోణాకారంలో ఎక్కువగా ఉంటాయి. ఈ భౌతికశాస్త్ర నియమాలను అనుసరించి ఏర్పడ్డ షడ్భుజాకారాలవల్ల రాతి పొరలలోని ఒత్తిడిని విడుదల చేయబడటమే కాకుండ కనిష్ఠ ఉపరితల వైశాల్యంలో గరిష్ఠ పరిమాణంగల ద్రవ్యరాశి ఇమడటానికి కారణం అవుతాయి. ఈ కారణంగా బసాల్ట్ స్తంభాలు ప్రాకృతిక సౌష్టవాన్ని సంతరించుకుని అందమైన ఆకారాలుగా కనిపిస్తాయి.

లావాలో ఉన్న ప్లాజియోక్లేజ్, పైరాగ్జిన్ మరియు ఆలివిన్ వంటి ఖనిజాలు లావా చల్లబడే క్రమంలో బసాల్ట్ స్తంభాలలో ఒక క్రమపద్ధతిలో స్ఫటికీకరణ చెందుతాయి. మొదట ప్లాజియోక్లేజ్ దాని తర్వాత పైరాగ్జిన్ దాని తర్వాత తక్కువ పరిమాణంలో ఉండే ఆలివిన్ స్ఫటికీకరణ జరుగుతుంది. లావా చల్లబడే క్రమంలో

ఈ స్తంభాలలో ఇతర ఖనిజాల స్ఫటికీకరణ కూడా జరగటంవల్ల ఇవి నిలువుగా మరింత పెరుగుతాయి.

బసాల్ట్ స్తంభాల ఆకార పరిమాణం మరియు ఇతర లక్షణాలు అనేక అంశాల ద్వారా ప్రభావితమవుతాయి.

లావా ప్రవాహంలో వేగవంతమైన శీతలీకరణరేటు చిన్న స్తంభాలను ఏర్పరుస్తుంది. నెమ్మదిగా శీతలీకరణ జరగటంవల్ల పెద్ద స్తంభాలు ఏర్పడటానికి దారి తీస్తుంది. లావా యొక్క కూర్పు స్తంభాల పరిమాణాన్ని ప్రభావితం చేస్తుంది, అధిక ఇనుము మరియు మెగ్నీషియం సమృద్ధిగా ఉంటే స్తంభాలు పెద్దగా ఏర్పడటానికి అవకాశం ఉంది. ఎక్కువ స్నిగ్ధత గల లావా పెద్ద స్తంభాలకు దారి తీస్తుంది. మరియు తక్కువ స్నిగ్ధత గల లావా స్తంభాలను చిన్నవిగా చేస్తుంది. అధికవాయుశాతం ఉన్న లావా ఎక్కువగా క్రమరహిత ఆకారంలో ఉండే స్తంభాలు ఏర్పడటానికి అవకాశం ఉంటుంది. లావా అధికపీడనం వద్ద ఘనీభవించినట్లైతే పెద్ద పరిమాణంగల స్తంభాల పుట్టుకకు దారితీస్తుంది. వేగవంతమైన స్ఫటికీకరణ చిన్నసైజు స్తంభాల పుట్టుకకు దారి తీస్తుంది. పైన పేర్కొన్న వాటితో పాటు మొత్తం టెక్టోనిక్ సెట్టింగ్‌లు మరియు ఇతర భౌమపరిస్థితులు బసాల్ట్‌లోని స్తంభాల పుట్టుకను ప్రభావితం చేస్తాయి.



కొలమార్ బసాల్ట్ మార్స్

**బసాల్ట్ స్తంభాలు - రకాలు:**

1. చతుర్ముఖ ఆకారంలో నిటారుగా ఉండే స్తంభాలు
2. షట్కోణాకారంలో ఉన్న స్తంభాలు
3. బహుముఖ స్తంభాలు

ఇంకా ఈ స్తంభాలు సాధారణమైన ఏకాండిగా, శాఖారహితం గాను, శాఖలుగా విభజన చెందినవిగా కాని ఉండవచ్చు. ఒకోసారి ఇవి వంపు తిరిగి కూడా ఉంటాయి.

స్తంభాల వ్యాసం ఒక మీటరు కన్నా తక్కువగా ఉంటే చిన్నవిగా, ఒకటి నుంచి ఐదు మీటర్ల వ్యాసం వరకు ఉన్న వాటిని మధ్యమమైనవిగా, ఐదు మీటర్ల వ్యాసం పైన ఉన్న వాటిని పెద్దవిగా వర్గీకరించారు. వీటి ధోరణి (Orientation) నిలువుగా లేదా కొంచెం పక్కకు ఒరిగి కాని ఉండవచ్చు కొన్ని స్తంభాలు పూర్తిగా అడ్డంగా ఉండవచ్చు.

**బసాల్ట్ స్తంభాల విభజన:**

1. జెయింట్ కాజ్‌వే రకం (పెద్ద షట్కోణాకారం స్తంభాలు)
2. ఫింగల్ కేవ్ రకం (చిన్న షట్కోణాకారం కలవి)
3. కాలమ్నార్ జాయింట్ రకం (చతుర్ముఖ బహుముఖ ఆకారం కలిగినవి)
4. బ్లాకీ రకం (చిన్న చిన్న సమాన పరిమాణంలో ఉండే స్తంభాలు)
5. డైక్ రకం (దగ్గర దగ్గరగా ఉన్న నిలువు స్తంభాలు)

ఇవే కాకుండా అతి సూక్ష్మమైన బసాల్ట్ స్తంభాలు కూడా తెలంగాణ రాష్ట్రంలో ఉన్నట్లు తెలుస్తోంది.

బసాల్ట్‌ల స్తంభాల పొడవు గరిష్టంగా 30 మీటర్లు ఉన్నట్లు గుర్తించబడ్డది, కాని 10 నుండి 15 మీటర్ల పొడవు కలిగినవి అరుదుగానే ఉంటాయి. చిన్నస్తంభాల పరిమాణం 1-2 సెంటీమీటర్ల వరకు ఉండవచ్చు. అయితే 10 సె.మీ నుండి 20 సెంటీమీటర్ల కంటే తక్కువ పొడవు ఉండే స్తంభాలు చాలా అరుదుగా ఉంటాయి. సాధారణ స్తంభాలు ఒకటి నుండి అయిదు మీటర్ల పొడవు ఉంటాయి. రెండు నుండి మూడు మీటర్ల పొడవులలో ఉన్న స్తంభాలు చాలా ఎక్కువగా ఉండటం గమనించారు.

**తెలంగాణా రాష్ట్రంలో బసాల్ట్ స్తంభాలు:**

తెలంగాణ రాష్ట్రంలో ప్రకృతి సిద్ధంగా ఉన్న బసాల్ట్ స్తంభాలు చాలా చోట్ల ఇటీవలే కనుగొనబడ్డాయి.

ఇవి ఎక్కువగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నాయి. వీటిపై ప్రభుత్వం దృష్టి ఇంకా పడలేదు కానీ ఔత్సాహికులైన అన్వేషకులు వీటి గురించి ప్రపంచానికి తెలియజేశారు.

**ఆ వివరాలు ఇలా ఉన్నాయి:**

మన్నె ఏరియా-ఆదిలాబాద్ జిల్లా, గుడిహత్నూర్ మండలం, శాంతపూర్. డా.కటకం మురళి - పొచ్చెర, బోథ్ మండలం, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా మామడ మండలం వాస్తవపూర్ గ్రామం. తిరుపతి గిత్తే -ఆసిఫాబాద్-కొమరంభీం జిల్లా, కెరిమెరి మండలం, బోరెలాల్ గూడ, ఆసిఫాబాద్-కొమరంభీం జిల్లా, కెరిమెరి మండలం, రాంనగర్, ఆసిఫాబాద్-కొమరంభీం జిల్లా, కెరిమెరి మండలం, గౌరి, ఆసిఫాబాద్-కొమరంభీం జిల్లా, కెరిమెరి మండలం, కేలి(బి)లలో ఇంకా తోడిశెట్టి ప్రణయ్ మరియు డా. M.A వాసు, గిన్నెదారి గ్రామం వద్ద చిన్నసైజులో ఉన్న అరుదైన మినియేచర్ బసాల్ట్ స్తంభాల ఉనికిని గుర్తించించారు. వీటన్నింటి పై సమగ్రంగా అధ్యయనం జరగవలసి ఉంది.

**అనంతగిరి కొండల్లో బసాల్ట్ స్తంభాలు:**

హైదరాబాద్‌కు పశ్చిమదిశగా వికారాబాద్ వద్ద ఉన్న అనంతగిరి కొండలలో కనిపించే బసాల్ట్ స్తంభాలు NGRIకి చెందిన అర్చన, బి. కోటేశ్వార్ ప్రభృతులచే (2014) అధ్యయనం చేయబడ్డాయి. ఈ ప్రాంతంలో 9 లావా ప్రవాహాలు ఉన్నాయి. ఒకటవ ప్రవాహం అన్నిటికన్నా దిగువన ఉంది మరియు 9వ ప్రవాహం అన్నిటికి ఎగువన ఉంది. ఎగువన ఉన్న 3 ప్రవాహాలు లేటరైట్‌గా మారాయి. ఈ లేటరైట్ పొర మందం 5 మీటర్లు ఉంటుంది.

**అనంతగిరి కొలొనేడ్ నిర్మాణక్రమం:**

సాధారణ, సక్రమంగా మరియు పెద్ద వ్యాసం కలిగిన నిలువు వరుసల శ్రేణిలో ఉన్న స్తంభాలను "కొలొనేడ్" అంటారు. సక్రమంగా

లేని తక్కువ సరళ మరియు చిన్న వ్యాసం కలిగిన స్తంభాల శ్రేణిని "ఎంటాబులేచర్ "అంటారు. వీటిలో స్తంభం యొక్క భుజాల సంఖ్య 3 నుండి 8. మధ్య ఉండవచ్చు 6 ముఖాలతో ఉండటం సర్వ సాధారణం.

అన్నిటికన్నా మీద ఎగువ (అప్పర్) కొలొనేడ్ జోన్ (UCZ), మధ్యలో మిడిల్ ఎంటాబ్యులేచర్ జోన్ (MEZ) దాని కింద దిగువ కొలొనేడ్ జోన్ (LCZ) ఉన్నట్లు గుర్తించారు.

ఎగువ కోలనేడ్ జోన్ (UCZ) క్రమంగా క్రిందికి ఎంటాబులేచర్ జోన్ (MEZ) గా మారుతుంది. ఇది క్రింద ఉన్న LCZను UCZ నుండి వేరు చేస్తూ మధ్యలో ఉంటుంది. UCZ లో స్తంభాలు 5 ముఖాలతో ఉన్నాయి, వీటి సగటు ఎత్తు 2 మీటర్లు మరియు వెడల్పు 1 మీటర్లు. స్తంభాల దొంతరలు 5 మీటర్ల మందంతో ఉంటాయి. స్తంభాలు నిలువుగా ఉండి అక్కడక్కడ కొద్దిగా శాఖలుగా చీలి ఉన్నాయి.



కర్నాటక జిల్లా ఉడిపిలోని సెయింట్ మేరీస్ ఐలాండ్

MEZలో స్తంభాలు చతుర్ముఖంగా, వొంపుగా ఉండి ఇవి ఒకదానిని ఒకటి ఖండిస్తూ విసనకర్ర ఆకారంలో విస్తరించాయి. ఈ స్తంభాల ఎత్తు 3 మీటర్లు, వెడల్పు 0.5 మీటర్లు ఉంది. ఈ స్తంభాల దొంతర 15 మీటర్ల మందంలో ఉంది.

అట్టడుగున ఉన్న LEZ ఉపరితలం వైపు రంధ్రాలు కలిగి (వేస్కులర్ గా) ఉండి, చతుర్ముఖ/ పంచముఖ నిలువు స్తంభాలు కలిగి ఉంది. వీటి సరాసరి పొడుగు 1 మీటర్, వెడల్పు 0.9మీటర్ లుగా ఉంది. స్తంభాల దొంతర మందం 10 మీటర్లు గా ఉంది. ఈ స్తంభాల శ్రేణిని కచ్ లో ఉన్న బసాల్ట్ స్తంభాల శ్రేణితో పోల్చవచ్చు ఈ వరద బసాల్ట్ స్తరాలు (Flood basalt)ఏ విధంగా చల్లబడినవి వాటి భౌమచరిత్ర మొత్తం ఈ అధ్యయనంలో మొదటిసారిగా బయటపడింది.

తెలంగాణలోని ఇతర ప్రకృతి సిద్ధంగా ఉన్న స్తంభాకార (Columnar) బసాల్ట్స్ ప్రదేశాలపై ఇలాంటి అధ్యయనాలు జరుగవలసి ఉన్నాయి. వీటిలో కొన్ని జియో హెరిటేజ్ సైట్/ జియో పార్క్‌లుగా గుర్తింపుకు అర్హతలు కలిగి ఉండవచ్చు. ఆదిలాబాద్ జిల్లా అడవులకు జలపాతాలకు ప్రకృతి అందాలకు ప్రసిద్ధి చెందింది. అనంతగిరి కొండ కూడా గుర్తింపు పొందిన పర్యాటక ప్రదేశం.

**ప్రపంచ వ్యాప్తంగా బసాల్ట్ స్తంభాలు:**

ప్రపంచ వ్యాప్తంగా ఈ స్తంభాకార బసాల్ట్‌లు ప్రజలను ఆకర్షిస్తున్నాయి. చాలా దేశాల్లో వీటిని పర్యాటక ప్రదేశాలుగా జాతీయ స్మారక చిహ్నాలుగా ప్రకటించారు. వాటిలో కొన్ని:

జైంట్ కాజ్ వే గా ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఉత్తర ఐర్లాండ్‌లో ఉన్న బసాల్ట్ స్తంభాలు. వీటిలో 40 000 ఇంటర్ లాకింగ్ కలిగి ఉన్న బసాల్ట్ స్తంభాలు ఉన్నాయి. దీనిని "వరల్డ్ హెరిటేజ్ సైట్" గా పరిరక్షణ చేస్తున్నారు. డెవిల్స్ టవర్ వయోమింలో ఉన్న స్తంభాలు 380 మీటర్ల ఎత్తులో చాలా అందంగా ఉంటాయి. ఇక్కడ Close encounters of the third kind అనే చిత్రం తెరకెక్కింది. ఇది ఒక అద్భుతమైన పర్యాటక ప్రదేశం గా ప్రసిద్ధి చెందింది.

**ఆర్గాన్ పైప్ అరిజోనా:**

ఇది గ్రాండ్ కానయన్ లో ఉంది. బసాల్ట్ స్తంభాలు ఆర్గాన్ పైప్ ఆకారంలో ఉండటం వల్ల ఈ పేరు వచ్చింది. విక్టోరియా ఆస్ట్రేలియాలో ఉన్న బసాల్ట్ స్తంభాలు, లండన్ బ్రిడ్జి అనే పేరుగల రాతి స్తంభాలు ప్రఖ్యాతి చెందినవి. సైచిలిస్ దీవులలో ఉన్న బసాల్ట్ స్తంభాలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఇంకా ఐస్లాండ్,ఇథియోపియా, మెక్సికో, తైవాన్ మొదలైన దేశాల్లో కూడా బసాల్ట్ స్తంభాలు చూడవచ్చు.

**భారత దేశంలో బసాల్ట్ స్తంభాలు:**

సెయింట్ మేరీస్ ఐలాండ్ కర్నాటకలో ఉడిపి జిల్లా లో మాల్పె పట్టణం సమీపంలో ఉంది. దీన్ని కోకోనట్ ఐలాండ్ అని కూడా అంటారు. ఈ ద్వీపంలో ఉన్న బసాల్ట్ స్తంభాలు దాదాపు 5.26 ఎకరాలలో విస్తరించి ఉన్నాయి. ఈ స్తంభాలు 10 నుండి 20 మీటర్ల పొడవులో షణ్ముఖ, పంచముఖ ఆకారాలు కలిగి అందంగా తంతెలుగా ఉంటాయి. ఈ నిర్మాణాలను 2020లో యునెస్కో ప్రపంచవారసత్వ ప్రదేశం (Geoheritage Site)గా గుర్తించింది. భారతప్రభుత్వం కూడా నేషనల్ జియోలాజికల్ మాన్యుమెంట్‌గా గుర్తించి అభివృద్ధి చేస్తున్నారు.

ప్రకృతి సిద్ధంగా ఉన్న స్తంభాకార బసాల్ట్ నిర్మాణాలు భారత దేశంలో చాలా చోట్ల ఉన్నాయి. ఇటీవలే యవత్మాల్ దగ్గర, కొల్హాపూర్ దగ్గర కూడా కనుగొనబడ్డాయి. అనేక ఇతర ప్రదేశాల్లో ఇప్పటికే వీటి ఉనికి గురించి సమాచారం ఉంది. కానీ ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి పరిరక్షణ చర్యలు తీసుకోబడలేదు. ఇలాంటి బసాల్ట్ స్తంభాలు ఇంకా అనేక ప్రాంతాల్లో కొత్తగా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. వీటన్నింటి గుర్తించి వాటిని అభివృద్ధి చేసి భావితరాలకు వారసత్వంగా అందించడం అవసరం.

**–చకిలం వేణుగోపాలరావు**
డిప్యూటి డైరెక్టర్ జనరల్ జిఎస్ఐ(రి)
m: 9866449348
e : venugopal.chakilam1@gmail.com

**– శ్రీరామోజు హరగోపాల్,**
m : 99494 98698
e: akshara25@gmail.com

# నాడు రాచమర్యాదలందుకొన్న ఏకవీరాలయం నేడు చేయిచాచి ఎదురుచూస్తున్న శిథిలాలయం





'కాకతమ్మ సైదోడు ఏకవీర' అన్న క్రీడాభిరామం పద్యపాదం, ఓరుగల్లులో గానీ, సమీపంలో గానీ ఈ ఇద్దరు దేవతలను పక్కపక్కనే ప్రతిష్ఠించారన్న సమాచారాన్నందిస్తుంది. కాకతమ్మ విగ్రహం, దేవతాలయం ఉనికి ఇంకా వెలుగు చూడాల్సి ఉంది. అయితే, ఏకవీర దేవాలయం మాత్రం, వరంగ ల్లుకు కూతవేటు దూరంలో ఉన్న మొగిలచర్ల (మొగలి పొదలున్న చెరువుల)లో ఉంది. క్రీ.శ.12వ శతాబ్ది తొలినాళ్లలో అంటే కాక తీయులు స్వతంత్రులుగా అప్పుడే కుదురుకుంటున్న రోజుల్లో తమ ఇలవేలుపుగా ప్రతిష్ఠించుకొని, ఆలయాన్ని నిర్మించుకొన్నారు. కాకతీయ ప్రభువులందరూ రోజూ ఏకవీర ఆలయాన్ని సందర్శించేవారని సమకాలీన సాహిత్యం స్థానిక కథనాలు చెబుతున్నాయి. రుద్రమదేవి అనునిత్యం అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందేదట!

రాచమర్యాదలతో నిత్య ధూపదీప నైవేద్యాలందుకొన్న అలనాటి అపురూప ఏకవీర ఆలయం, నేడు కళతప్పి వెలవెల బోయింది. దీపం తరువాత, కనీసం ఆలయాన్ని శుభ్రం చేసే వారు లేక, సరైన నిర్వహణ లేక, మండపస్థంభాలు కుంగుతూ, దూలాలు పక్కకు తప్పుకుంటూ, గోడలు వంగుతూ, నేడోరేపో నేల రాలుతుందా అన్నట్లుంది. ముందువరుసల స్థంభాలు కూలకుండా ఇసుక బస్తాలు నింపి ఎవరో పుణ్యం కట్టుకొన్నారు.

తొలినాళ్లలో కట్టిన ఈ ఆలయం ఒకే ఒక రాతి వరుస గోడతో గర్భాలయ, అర్థమండపాలు, చుట్టూ ప్రదక్షిణాపథం, దాని చుట్టూ ఉపపీఠం, దానిమీద స్థంభాలు, ఆలయం ముందు మహామండపం, కాకతీయుల కాలపు తొలి ఆలయ వాస్తు శిల్పానికి అద్దంపడుతుంది. అర్థ మండపం ద్వారశాఖలకు రాతి కిటికీలు, మహా మండపం మధ్యలో రంగశిల, ముందు రాతి బండలను గుహాలయాలుగా మలచిన తీరు ప్రశంసనీయం.

ఇన్ని ప్రత్యేకతలున్న ఏకవీరాలయం, శిథిలమై, మళ్లీ కాకతీయు లెప్పుడొస్తారో, తనకు మునుపటి వైభవం ఎప్పుడొస్తుందోనని ఎదురు చూస్తుంది. మహామండప ముందు స్థంభాలు పంటి బిగువున అలాగే వంగి ఉన్నాయి. పై బరువు మోయలేక కాడి కిందపడేయటానికి సిద్ధమౌతున్న ముసలి ఎద్దుల్ని గుర్తుకు తెస్తున్నాయి. ప్రభుత్వ సాయం కోసం చూడకుండా, గ్రామస్తులంతా చేయీ, చేయి కదిపితే, ఆ శిథిలాలయ ఆశ నెరవేరుతుంది.

–ఈమని శివనాగిరెడ్డి–స్థపతి,
m : 9848598446
e : nagireddy@malaxmi.in





# అలనాడు మామంచి సర్కారీ దవాఖానాలు

**మా** చిన్నప్పుడు మాకు ఊం అంటే రోగాలు, ఆం అంటే రోగాలు.

మా అమ్మ మొత్తం తొమ్మిది మందిని కన్నది. పోయినోళ్లు పోంగ చివరకు మిగిలింది ఆరుగురం. మొదటి ముగ్గురు ఆడపిల్లలు. తర్వాత ముగ్గురం మొగ నలుసులం. మా అమ్మ మాటలలో మేం ముగ్గురం "పోంగ జిక్కినోళ్లం".

ఇంట్లో ఎప్పుడూ ఎవరికో ఒకరికి జ్వరాలు, రోగాలు. ప్రతి ఇంట్లో ఒక టి.బి. పేషంటు. మలేరియా, టైఫాయిడ్, పోలియో, న్యుమోనియా, కక్కుడు – కాళ్లకు పెట్టటం సర్వసాధారణం. అరవై, డెబ్బై ఏండ్ల క్రింద బడిలోని ప్రతి క్లాసులో ఎవరో ఒక పోలియో బాధిత కుంటి విద్యార్థి, మశూచి మిగిల్చిన స్ఫోటకం మచ్చల విద్యార్థి లేక మశూచితో ఒక కన్ను పోయిన గుడ్డి విద్యార్థో కనబడేవాడు. పోరలంతా బక్కపీనుగుల్లాగ ఉండేవారు. చాలా మంది పిల్లల కాళ్లు చేతులకు గజ్జి పుండ్లు ఉండేవి. వాటిని నశ్మీర్ పుండ్లు అనేవారు. టీకాల పద్ధతి వచ్చినంక ఇప్పుడు బడులల్ల అటువంటి పిల్లలు కనబడటం లేదు.



ఈ రోగాల కన్నింటికీ మూల కారణం పేదరికం. సరిఐన, బలమైన పోషకాహారం లేకపోవటం. మరొకటి ఇంటా బయటా పరిసరాలు ఆ పరిశుభ్రంగా ఉండటం. ఇండ్లల్ల ఈగలు, దోమలు, నల్లులు పుష్కలంగా ఉండేవి. దానికి తోడు పట్నాలల్ల ఇరుకిరుకు ఇండ్లల్లనే పైఖానాలు. ఫ్లష్ టాయెలెట్లు ఇంకా రానందున మేతర్లు చీపుర్లు, చేతులతో ఎత్తి బకెట్లలో ఆ మురికిని ఎత్తుకపోయేవారు. వాళ్లు ఒక రెండు రోజులు రాకపోతే, పరిస్థితి ఘోరంగా ఉండేది. ఇల్లంతా దుర్వాసనే. ఇక వర్షాకాలమైతే మరీ అన్యాయంగా ఉండేది. ఆధునిక వాష్ రూంలు ఇంకా వాడుకలోకి రానందున ఇండ్లల్ల ఈగలు పుష్కలంగా తిరుగుతుండేవి. పగటిపూట ఈగలు జోపటం, రాత్రుళ్లు నల్లులను చంపటం నిత్యకృత్యంగా ఉండేది.

మరి అట్లాంటి అపరిశుభ్రపరిస్థితులలో పిల్లలకు, పెద్దలకు జ్వరాలు, రోగాలు రాకుండా ఉంటాయా? ప్రజాకవి కాళోజీ తన ఆత్మకథలో పైఖానాలలో ఊదుబత్తీలు వెలిగించుకుని కూచునేవాళ్లం అని రాసారు. బల్దియా (మున్సిపల్ శాఖ) ఉండేది. దాని కౌన్సిలర్లు వుండేవాళ్లు. కాని క్యా ఫాయిదా? వారి పని నామమాత్రం కావున "పాంచ్ సాల్ కా బల్దియా, ఖాయా పీయా చల్దియా" అన్న సామెత చెలామణీలో ఉండేది.

ఇంకా మా కాలంలో నయం. మా పెద్దల కాలంలోనైతే గత్తర, దొబ్బరోగం, ప్లేగు లాంటి రోగాలు వచ్చి జనం కుప్పలు, కుప్పలుగా చచ్చేటోళ్లు. ప్లేగు రోగంల ముందు ఎలుకలు చచ్చి తర్వాత మనుషులు పుటుక్కు, పుటుక్కు మని రాలిపోయ్యేటోళ్లు. సర్కారు వాళ్లు పుంగీలల్ల టముకు వేసి ఇండ్లు ఖాళీ చేయించి ఊరవతల మైదానాలల్ల గుడిసెలు వేయించి ప్రజలను అండ్లకు తరలించేవారు.

ఇగ మాకు జ్వరాలు రాంగనే మా అమ్మా, బాపు ఇప్పటిలాగ మొదటి రోజే డాక్టరు వద్దకు తీసుకుపోయ్యేవాళ్లు కాదు. "శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు" పిల్లగాడికి ఎవరిదో దిష్టి తగిలిందని అంగలార్చుకుంట చీపురు పుల్లలకు దూది లేదా పాతబట్ట చుట్టి దాన్ని నూనెలో ముంచి, అగ్గిపుల్లతో వెలిగించి అది భగభగ మండుతుంటె, చెక్కపీట మీద చక్లముక్లం కూచున్న పిల్లవాడి తల చుట్టూ వెలుగుతున్న ఆ పుల్లల్ని తిప్పేవారు. దానితో దృష్టి దోషం తొలిగిపోతుందని ఒక మూడవిశ్వాసం.

తెల్లారి కూడా తగ్గకపోతే అమ్మ మా ఇలవేల్పు బుగులు వెంకటేశ్వరస్వామికి దండం పెట్టి ఒక పాత గుడ్డల చారానా బిళ్ల ముడుపు కట్టి పెరుమాళ్ల గూడుల ఒక మూలకు పెట్టేది. "హర్ దర్ద్ కా దవా జిందా తిలిస్మాత్". ఇంట్ల ఎప్పుడూ సిద్దంగా ఉండేది. నాలుగు చుక్కలు మంచి నీళ్లల్ల కలిపి త్రాగించి, నుదుటికి నాలుగు చుక్కలు రాసి మర్దన చేసి ఒక పాత గుడ్డను తలకు గట్టిగా బిగించి కట్టేవారు. తలనొప్పి తగ్గాలని. వాంతులు మొదలు కాగానే మాదిఫల రసాయనం, దగ్గు తగ్గడానికి పుక్కిట ఒక కరక్కాయను, పడిశం పోవటానికి బాగా నల్లగా కాల్చిన ఓమను గుడ్డలో బిగించి కట్టి ముక్కుతో పీల్పించటం, బాగా బేదులు జరిగి "ఆసనం" పచ్చిపుండుగా నొప్పి అయ్యేసరికి కాల్చిన ఇటుక రాయిపై ఒక బట్టవేసి దాని మీద కూచోబెట్టటం చేసేవారు. పిల్లలు దాని మీద కూచోడానికి లబోదిబోమని మొత్తుకునేవారు. "గోరు చుట్టు మీద రోకటి పోటు బాధ" అంటే అదే! పిల్లలకు మలబద్దకం ఉంటే చింతపండు వేసి బాగా మరిగించిన సోనా ముఖి ఆకు కషాయాన్ని ముక్కు మూసి, నోరు తెరిపించి

బలవంతాన తాగించేవారు. అమ్మమ్మలు, నాయినమ్మలు అందరూ కల్సి "వంటింటి చిట్కాలన్నీ" పిల్లల మీద ప్రయోగించే వారు. పోలీసులు చేసే థర్డ్ డిగ్రీలాగ" ఆయుర్వేద వైద్యబిషక్కులు ఇచ్చే మాత్రలు ఒక్కోసారి వికటించి "నీ చేతి మాత్ర వైకుంఠ యాత్రగా" పరిణమించేది.

ఒక్కోసారి కొంచెం నలతగా ఉన్నా, లోజ్వరం వస్తున్నా అలియాబాద్ దర్వాజా దగ్గరున్న మౌల్వీసాబ్ దగ్గరికి తీసుకపోయేవారు. ఆయన పండు ముసలి. తెల్లటి పొడుగైన గడ్డంతో "ముల్లా నసీరుద్దీన్‌లా ఉండేవాడు. ఆయన్ని మేం "పూల తుర్కాయన" అనేవారం. శాలిబండా ఉతార్‌లో ఆయనకు ఒక పూల దుకాణం ఉండేది. సాయంకాలం అక్కడ కాలక్షేపానికి ఒక గంటసేపు కూచునేవాడు. అలియాబాద్‌లో ఆయన ఇంటి ముందు తడ్కలు వేసిన పందిరి క్రింద ప్రొద్దుప్రొద్దునే చాలా మంది జమ అయ్యేవారు. వారందరు రోగాలు – నొప్పులతో నవిసి నవిసి బాధపడుతున్న వారే. ఆయన ముందు ఒక పెద్ద ఇత్తడి తాంబాళం ఉండేది. అందులో సున్నం కలిపిన నీళ్లు. వచ్చిన వారి రెండు చేతుల్ని అందులో ముంచి, తన దగ్గరున్న వేప మండలతో రోగుల శరీరాలను దులిపి, లోలోపల ఏదో ఒక దువా చదివి ఎర్ర దారంతో వున్న ఒక తావీజును మెడలో కట్టేవాడు. ఒక్క పైసా కూడా వసూలు చేయకపోయేది. అదంతా ఉచిత సేవనే. ఆయన ఒక సూఫీ సాధువు అని మాకు పెద్దగయిన తర్వాత తెలిసింది. అట్లా చాలా మంది ప్లిలల మెడలలో ఆ ఎర్రదారం తాయెత్తులు వ్రేలాడుతుండేవి. ఆ తాయెత్తులు పిల్లల మెడలో ఉంటే "దుష్ట శక్తులు" దగ్గరికి రావని పెద్దల నమ్మకం.

ఆ రోజుల్లో కండ్లు పచ్చబడి "పస్కల రోగం" (జాండీస్) వచ్చేది. పచ్చ కామెర్ల రోగం అని కూడా అనేవారు. దానికి అలోపతీ మందుల కంటె జడీబుట్టీ మందులే బాగా పనిచేసేవి. బార్కాస్‌లో ఒక ముస్లిం కుటుంబం పొద్దున్నే రోగులకు ఆకుపచ్చ పసరు తాగించేవారు. ఇక ఆ దినమంతా ఉత్త పచ్చి పాలతోనే అన్నం తినే పత్యం. ఉప్పు, శక్కరా వేసుకోవద్దు. తెల్లారి మాంసంతో, లేదా కూరగాయలతో చేసిన బిర్యానీ తినాలి. మూడోరోజు కండ్ల పచ్చదనం పోయేది. లోపల కాలేయం పరిశుద్ధ మయ్యేది. ఇది కూడా ఉచిత వైద్యమే. వారు కూడా ఒక పైసా తీసుకోరు. కాని ఆ పసరు రహస్యం చెప్పరు. పాత నగరం సైదాబాదు. జగత్ టాకీసు సందులో ఉండే శ్రీరాములు అనే నాయీ బ్రాహ్మణుడు, ముర్గీకా చౌక్‌లో వుండే ఒక హకీమ్‌సాబ్ మందులు పస్కలకు బాగా పనిచేసేవి. మా అమ్మకూడా "సొమ్మ రోగానికి" (ఫిట్స్) ఒక మందు తయారుచేసి ఇచ్చేది. దానితో చాలా మందికి ఆ రోగం తగ్గేది. కాని ఆ మందు రహస్యమేందో ఆమె మాకు కూడా చెప్పకుండానే కాలం చేసింది. ఎవరికైనా ఆ రహస్యం చెప్తే ఆ మందు మహాత్మ్యం పోతదట. మందు ఇక పని చేయదు. ఇప్పటికీ హైద్రాబాద్‌లో "మృగశిర" నాడు ఉబ్బసం జబ్బుకు "చేప మందు" ఇస్తారన్న సంగతి మనందరికీ తెలిసిందే కదా! ఈ దేశీయ చిట్కాలన్నీ "డాక్టర్ సాబ్ కీ దవా ఔర్ ఊపర్ వాలేకీ దువా" అనే విశ్వాసానికి సంబంధించినవే.

జ్వరం తగ్గనప్పుడు, రోగం వికటించినపుడు మాత్రమే అలోపతి డాక్టరు దగ్గరికి తీసుకపోయేవారు. మాకు సుస్తీ చేసినపుడు డాక్టర్ క్లినిక్ చాలా దూరం, రిక్షాల పోతే పైసల సమస్య. పైసలకు చాలా "కట్‌పిట్" అయ్యే కాలం అది. ఒకటో తారీఖు వచ్చేవకు అందరి పరిస్థితి "టన్‌టన్ గోపాల"నే. మా బాపుకు సైకిలు కూడా లేదు. అమ్మా, బాపు వంతుల వారిగా మమ్మల్ని ఎత్తుకుని మోసుకుంటూ క్లినిక్‌కు తీసుకపోయేవారు. మా బాపు ఒకోసారి డాక్టరు ఫీజు కూడా "బాకీ" పెట్టేది. ఆనాడు మానవత్వం ఉన్న డాక్టర్లు కావున పైసల కోసం పట్టుబట్టక పోయేది. ఆఖరికి మిగిలిన, మర్చిపోయిన ఒక బాకీని నేను చాలా కాలం తర్వాత చెల్లించాను. అదొక కత.

అప్పటికింకా ప్రైవేటు దవాఖాన్‌లు హైద్రాబాద్ నగరంలో పుట్టనేలేదు. అన్నీ, సర్కారీ దవాఖానాలే. డాక్టర్లు రూపాయిని మాత్రమే చూడకుండా రోగిని చూసి ప్రేమా, దయతో "మరీజులకు" "ఇలాజ్" చేసేవారు. అంటే డాక్టర్లకు పచ్చనోట్లపై పిచ్చి ప్రేమ ఇంకా పుట్టలేదు. ఆ రోజులలో ఇంటింటికీ "క్షయ" (టి.బి) ఉండేది. వికారాబాదులోని అనంతగిరి కొండలలో ఒక శానిటోరియం ఉండేది. అందుకే "వికారాబాద్ కీ హవా ఏక్‌లాఖ్ కీ దవా" అన్న సామెత ప్రచారంలోకి వచ్చింది. అట్లనే ఎర్రగడ్డల ఉన్న టి.బి. దవఖానా కూడా చాలా మశూరు. ఈ రెండు దవాఖానాలు 1920లలోనే స్థాపించబడినాయి. ఎర్రగడ్డ మెంటల్ దవాఖానా 1897, జజ్గిఖానా (విక్టోరియా మెమొరియల్ ప్రసూతి దవాఖానా 1905), చార్మినార్‌దగ్గరి యునానీ, ఆయుర్వేదిక్ దవాఖానాలు 1927, ఉస్మానియా దవాఖానా 1925 అదే సంవత్సరంల గాంధీ దవాఖానా, క్యాన్సర్ దవాఖానా, కోరంటి, నిజాం బొక్కల దవాఖాన్‌లు స్థాపించబడినాయి. ఈ బొక్కల దవాఖానా ఎన్.టి.ఆర్. టైంలో "నిమ్స్"గా మారింది. నైజాం ఇంకా అధికారంలో ఉండంగనే చివరలో 1945ల చిన్న పిల్లల నిలోఫర్ ఆసుపత్రిని స్థాపించారు.

మా చిన్నతనంల చక్కర బీమారీలు, కీళ్లనొప్పులతో కుంటుకుంటూ నడిచేవారు, దిల్‌కీ బీమారీలతో హఠాత్తుగా "హరీ" మనే వారు ఎవరూ లేరు. ఎక్సర్‌సైజులు, ఎయిరోబిక్స్‌లు, ఏమీ లేవు. యోగా అనేవి సన్యాసులు ముక్కుమూసుకుని చేసుకునే "జపతపాలు" అనుకునేది. డైటింగ్ అన్న పదం ప్రజల నోళ్లల ఇంకా పుట్టలేదు. రసాయనాలు లేని కల్తీలు లేని, పురుగుల మందులు లేని ఆహారాన్ని అందరూ కడుపు నిండా మెక్కి ఒళ్లు వంచి శారీరక శ్రమ చేసేవారు. "బానిసోలె తినాలె, బంటు లాగా పని చేయాలని" ఆ రోజుల్లో ఒక సామెత. ఎంత దూరమైనా అందరూ "బారా నంబర్" బస్ ఎక్కేవాళ్లు. "కంటికి దూరమైతే కాలికి దూరమా" అన్న ధీమాతో బరి కాళ్లతోనే బిరబిరా నడుచుకుంటూ ఎంత దూరమైనా పోయేవారు. జర ఉన్నోళ్లైతే సైకిల్లు కొనుక్కుని "డబుల్ సవారీలు" తొక్కేవాళ్లు. రిక్షా ఎక్కటం ఒక అపురూప విలాసం. అందుకే నడిమంత్రపు కొత్తకొత్త రోగాలు అప్పటికింకా పుట్టలేదు.

ఎవ్వైనా కాన్పులకో లేదా రోగాలతో దవాఖానాలల్ల షరీకైనారంటే మా పిల్లలందరికి పండగేపండగ. ఇన్‌పేషంట్లు ముఖం మొత్తి తినకుండా వదిలేసిన పెద్దపెద్ద డబుల్ రొట్టెలు, మోసంబీ పండ్లు, ఎర్రటి సేపులు, అప్పుడప్పుడు సీసాలల్ల పాలు – వాళ్లను చూడటానికి వెళ్లిన పెద్దవాళ్లు సంచులల్ల వాటిని రహస్యంగా దాచి ఇంటికి తెచ్చేవారు. ఆకలి గొట్టు పిల్లలం ఆవురావురుమని, పెద్దలు ఇంట్లకు రాకముందే గద్మలల్ల వాటిమీద దాడి చేసి, పులిసిపోయిన ఆ డబుల్ రొట్టెలను చాయ్‌ల ముంచుకుని తినేవారం. మోసంబీ, సేపులను చాకులతో

ముక్కలు చేసి అందరం సమానంగా పంచుకుని తినేవారం. ఇంట్లకు తినే పదార్థాల్లో, పండ్లో ఏమి వచ్చినా క్షణాలలో మా "బకాసుర కడుపుల్లోకి "" మాయమయ్యేవి కాని నేటి పిల్లల్లా తర్వాత తింటాంలే అని నిర్లక్ష్యంగా ఫ్రిజ్జుల్లో పెట్టి మరచిపోయే వారం కాదు.

బాల్యంలో నేను ''బక్క పీనును''. గట్టిగా గాలివాస్తే ఎగిరిపోయేటంత బలహీనుణ్ణి. బొక్కలన్నీ ఇవతలికే కనబడేటట్టు ఉండెటోణ్ణి. కాబట్టి ఇస్కూళ్ల పిల్లలు నాకు "బొక్కలయ్యా" అని నిక్ నేం పెట్టినారు. వీడికి ఏమైనా టి.బి.రోగం ఉందేమోనన్న అనుమానంతో మా బాపు నన్ను చందులాల్ బేలా చౌరాస్తాల ఉన్న డా. వాగ్రే దగ్గరికి తీసుకపోయిండు. ఇక్కడ కొంచెం ఆ డాక్టరు గురించి చెప్పుకోవాలి. పాతనగరంలో అప్పటికే ఆయన బాగా పేరున్న డాక్టరు. ఆయన చిన్నప్పుడు కటిక పేదరికంలో ఉండి వీధి దీపాల క్రింద ఉండే అరుగులపై కూచుని చదువుకునే వాడట. మెడిసిన్ చదువుతున్నప్పుడు ఆ ఖరీదైన పుస్తకాలను కొనే తాహత్ లేక తోటి విద్యార్థులను బ్రతిమిలాడి వారిచ్చినవి చదివి మళ్లీ అన్న ప్రకారం గడువులోపల వారికి వాపస్ చేసేవాడట. ఆయన తన పేదరికాన్ని జీవితాంతం మరచి పోలేదు. కావున పేదలకు బీదలకు చాలా దయతో వైద్యం చేయటమే గాక అవసరమైన అతి తక్కువ మందులు రాసిచ్చేవాడు. మనిషి చాలా మెత్తన. రోగికి త్వరలో కోలు కుంటావని ధైర్యం చెప్పేవాడు.



ఈ రోజుల్లో కార్పొరేట్ కాలేజీలలో లక్షలు లక్షలు డొనేషన్లు కట్టి, మళ్లీ అవే కార్పొరేట్ హాస్పిటల్స్‌లో డాక్టర్లుగా పని చేస్తూ రోగిని ఒక ఏటీఎం మెషిన్‌గా చూస్తూ, చనిపోయిన వారిని ''వెంటిలేటర్లపైకి ఎక్కించి" లక్షలు లక్షలు పిండుకునే డాక్టర్లను మనం చూస్తున్నప్పుడు డా. వాగ్రే లాంటి వారు మనకు "దేవుళ్లలాగే" కనబడటం సహజమే కదా!

ఆయన దయతో నన్ను పరీక్షించి ఈ పిల్లవాడికీ ఏమీ లేదు. బలమైన తిండి పెట్టాలి. పాలు, పెరుగు, నెయ్యి, రోజు ఒక గుడ్డు, గాజర్ గడ్డ (క్యారట్), రత్నపురి గడ్డ (బీట్‌రూట్) రసం ఇవ్వాలి. ఆకు కూరలు. మందులేమీ అక్కరలేదు అన్నాడు. ఆ తర్వాత నా ఒక్కడికే ఒక వారంపాటు రాజభోజనాలు జరిగేయి. మా ఆఖరి అక్క మా తమ్ముడు నన్ను "వర్గ శత్రువు"గా చూడటం మొదలుపెట్టారు. ఆ వారం తర్వాత అన్నీ మళ్లీ షరా మామూలే. ఒక్క ఉడకబెట్టిన గుడ్డును నాలుగు భాగాలుగా కత్తితో కట్ చేసి నలుగురు పిల్లలకూ సమానంగా పెట్టే మా ఇంట్లో ఒక్కరికికే "పౌష్ఠికాహారం" ఇవ్వటం సాధ్యమా?

పెళ్లయిన మా పెద్దక్కకు ఒకసారి ఏదో జబ్బు చేసింది. అమ్మ ఆమెను చార్మినార్‌కు ఎదురుంగ ఉన్న ఆయుర్వేదం దవాఖానాకు తీసుకపోయింది. ఆవు వెంబడి దూడలా అమ్మ వెంబడి నేనూ వెళ్లాను. అక్కడ "మరియమ్మ" అనే కిరస్తానీ డాక్టరమ్మ అక్కను క్షుణంగా పరిశీలించి ఈమెను ఒక నెలరోజుల పాటు ఈ దవాఖానలో షరీకు చేసుకుంటాం సరిఐన ఆరాం, "ఖువ్వత్ వచ్చే ఖురాక్" (బలమైన ఆహారం) ఇవ్వాలె. మందులు సరేసరి అన్నది. ఇప్పుడే అత్తవారింటికి తోలితే పిల్ల చాకిరీతో మూలపడతదన్న భయంతో అమ్మ సరే అని ఒప్పుకుంది.

ఆ తర్వాత దయగల్ల ఆ "మేరీమాత" దృష్టి నా మీద పడింది. నన్ను కిందికీ మీదికి "తీక్షణంగా" పరిశీలించి "ఎవరీ పిల్లగాడు" అని అడిగింది. నా కొడుకే నమ్మా అన్నది అమ్మ ఏదో తప్పుచేసిన దానిలా. ఆమె నన్ను దగ్గరకి పిలిచి "హాలా"తో (సెతస్కోపు) నా ఎండిపోయిన ఎదను పరీక్షించింది. క్రింది కన్రెప్పలను తెరిపించి, నాలికను బాగా చాపించి, చివరికి గోర్లనుకూడా పరిశీలించి అమ్మతో " పిల్లగాన్కి రక్తహీనత (ఎనిమియా) జబ్బు ఉంది. ఆలస్యం చేస్తే టి.బి. అట్టాక్ అయితది. వీడిని కూడా ఈమెతో పాటే ఇప్పుడే షరీక్ చేసుకుని, అక్క పక్కలే ఇంకో మంచం ఏర్పాటు చేస్తా. చిన్న పిల్లాడే కద. జనానా ఖానాలో (స్త్రీల వార్డు) చేర్చు కోవచ్చు అన్నది.

అక్క కూడా తనకు తోడు దొరుకుతదని ఖుష్ అయ్యింది. కమ్మటి తిండి దొరుకుతదని అమ్మ సరే అన్నది. ఐడి బాధ ఉండదని నాకు కూడా "కుంటోనికి ఏనుగు ఎక్కినంత" సంతోషమయ్యింది.

ఇక ఆ నెలరోజులు నా రాజవైభోగం చెప్పతరం కాదు. చూసి అనుభవించితే గాని సమజ్ కాదు.

ఎత్తైన మంచం. దాని మీద తెల్లటి, మెత్తటి దూది పరుపు. తెల్లటి చాదర్. పొద్దున్నే గరం గరం చాయ్. ఎనిమిది గంటలకు నాస్తా. నూనె పెట్టిన మడత గోధుమ రొట్టెలల్లకు ఆలుగడ్డల కూర. ఒక గ్లాసు బర్రెపాలు. పదకొండు గంటలకు క్యారట్ సూపు, ఒక సేపు లేదా మోసంబీ పండు. ఒంటి గంటకు భోజనం. అన్నం, పప్పు ఉడకబెట్టిన గుడ్డు. సాయంత్రం నాల్గు గంటలకు టమాట సూపు. రాత్రి నిమిది గంటలకు గోదుమ పూల్కాలు. అంచుకు ఆకు కూరలు.

నా మంచం మీద కూర్చుని కిడ్కీ తెరిస్తే ఎదురుంగ మక్కమసీదు, కొంచెం అటుపక్క చార్మినార్. కన్రెప్పలు వాల్చకుండ తదేకంగా చార్మినార్‌ను పట్టిపట్టి చూస్తుంటే ఒక మహాకాయుడు తనకున్న నాలుగు చేతులు ఎత్తి అందర్నీ రారామ్మని పిలుస్తున్నట్లు చిత్తభ్రమ కలిగేది. అట్ల చార్మినార్‌తో నా "పహెలీ నజర్, పహెలా ప్యార్" ఖాయం ఐపోయింది.

నిజంగానే ఒక నెలరోజుల తర్వాత నేను "నిండు పున్నమి చందురుడిలా" ఒక వెలుగువెలిగాను.

జరుగుబాటు ఉంటే జ్వరం అంత సుఖం మరొకటి లేదు కదా!

రోజులు మారాయి. వైద్యం వ్యాపారంగ మారి శవాలమీది పేలాలు ఏరుకుని తినే పంచనక్షత్రాల కార్పొరేట్ ఆసుపత్రుల్నిచూస్తుంటే అలనాటి "మా మంచి సర్కారీ దవాఖానాలు" జ్ఞాపకం రాకుండా ఉండవు కదా!

–పరవస్తు లోకేశ్వర్,
m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com

# జలాశయాల సంరక్షణ అందరి బాధ్యత

## మన నదులను కాపాడుకోవడానికి చేయి చేయి కలుపుదాం





ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్, Mark Angilo World Rivers Day కెనడా, సివిల్ సొసైటీ గ్రూపులు, హైదరాబాద్ ప్రభుత్వ సిటీ కళాశాల, దక్కన్ హెరిటేజ్ అకాడమీ, జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాల, సెయింట్ పాట్రిక్స్ హైస్కూల్, హిమాయత్‌నగర్ ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ హైదరాబాద్, శ్రీసాయి విద్యా నికేతన్ హైదరాబాద్, తెలంగాణ సంయుక్తంగా ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ జిల్లా శామీర్‌పేట లేక్ అవుట్ ఫ్లో సదరన్ బండ్ ఒడ్డున సెప్టెంబర్ 22న నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంటాక్ జాతీయ పాలకమండలి సభ్యుడు ప్రొఫెసర్ Er.వేదకుమార్ మణికొండ అధ్యక్షత వహించారు. తెలంగాణ ట్రైబల్ మ్యూజియం డైరెక్టర్ డా॥ ద్యావనపల్లి సత్యనారాయణ, శామీర్‌పేట పరిరక్షణ కమిటీ కన్వీనర్ రవీంద్రారెడ్డి, వాటర్ హార్వెస్టింగ్ నిపుణుడు సుభాష్ రెడ్డి, ఎఫ్ బీహెచ్ సభ్యుడు నరహరి, పర్యావరణవేత్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

భారతదేశంలోని తెలంగాణలో ఎఫ్‌బిహెచ్ (ఫోరం ఫర్ బెటర్ ఎ హైదరాబాద్) మూడు సంవత్సరాలుగా ప్రపంచ నదుల దినోత్సవాన్ని జరుపుకుంటోందని సంస్థ చైర్మన్ మరియు ఇంటాక్, న్యూఢిల్లీ జాతీయ పాలక మండలి సభ్యుడు Er. వేదకుమార్ మణికొండ వారికి వివరించారు. ఈసారి శామీర్‌పేట చెరువు వద్ద ఏర్పాటు చేసామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నదుల పరిరక్షణ, పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. ప్రపంచంలో కాలుష్యం నుంచి నదులు, జలవనరులను పరిరక్షించే బాధ్యతను ప్రభుత్వం మాత్రమే కాదని, పౌరసమాజం, సంస్థలు, యువత బాధ్యత తీసుకోవాలని ఆయన ఉద్ఘాటించారు. శామీర్‌పేట సరస్సు ప్రాముఖ్యతను వివరిస్తూ, 6వ నిజాం మెహబూబ్ అలీ పాషా హైదరాబాద్ చుట్టుపక్కల ఉత్తమ సూర్యాస్తమయం ప్రదేశంగా ఈ సరస్సును ఎంపిక చేశారని, హైదరాబాద్ పర్యటనలో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన తన అతిథుల మధ్య ఈ సరస్సును ప్రాచుర్యం పెంపొందించారని, శామీర్‌పేట సరస్సు చుట్టూ ఉన్న అందమైన రాతి నిర్మాణాన్ని ఆయన ప్రశంసించారు.

ద్యావనపల్లి సత్యనారాయణ కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంత సంస్కృతి గురించి వివరిస్తూ.. ప్రజల జీవితంలో తాగు, సాగుకు నదీజలాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కాలువ వెంబడి మరియు సరస్సు చుట్టూ రాతి షెల్టర్లు మరియు పెయింటింగ్‌ల యొక్క ప్రాముఖ్యతను వివరించాడు. ఇవి దానిపై శిల్పాలు మరియు శాసనాల ద్వారా ప్రదేశం చుట్టూ నాగరికత ఉనికిని రుజువు చేస్తుంది అన్నారు. శామీర్‌పేట సరస్సును కాలుష్యం నుండి రక్షించి దిగువన వ్యవసాయానికి సేవలందించిన రవీంద్రా రెడ్డి, గోదావరి నదీ జలాలను శామీర్ పేట సరస్సులోకి తీసుకురావాలని వాదించడంలో కీలక పాత్ర పోషించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాల ప్రాముఖ్యతను నొక్కిచెప్పిన సుభాష్ రెడ్డి వర్షపునీటి సంరక్షణకు కృషి చేయడంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణవేత్త నరహరి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ గురించి మాట్లాడుతూ విద్యార్థులు ప్రకృతి పట్ల ప్రేమను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనిల్ (ఎన్జీవో) నదీ వ్యర్థాలను, ప్లాస్టిక్‌ను తొలగించాలని విద్యార్థులను కోరారు.

కార్యక్రమంలో ఫొటో ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుంది. ఎఫ్ బీహెచ్ ప్రధాన కార్యదర్శి శోభా సింగ్ స్వాగతం పలికారు. FBH కో–ఆర్డినేటర్ కట్టా ప్రభాకర్ సమన్వయం చేసాడు. దక్కన్ హెరిటేజ్ ట్రస్ట్ అకాడమీ (DHAT) ప్రతినిధి ఖైజర్ బాషా కృతజ్ఞతలు తెలియజేయడంతో కార్యక్రమం ముగిసింది.

World Rivers Day
Celebrated on the fourth Sunday of September

– కట్టా ప్రభాకర్, m : 8106721111
e: akumarkatta@gmail.com






## సుస్థిర ప్రగతికి ఊతం... బంగరు భవితకు మార్గం...!!

# @ రెన్యువబుల్ ఎనర్జీ

నింగినేల ఏకమైందా అన్న రీతిలో కుండపోత వానలూ, వరదలూ ఇటీవలి కాలంలో బాగా పెరుగుతున్నాయి. మండుతున్న ఎండలూ, ఉప్పెనలా విరుచుకుపడుతున్న వడగాలుల ధాటికి జీవరాశి చిగురుటాకులా వణుకుతోంది. ఓవైపు ధ్రువ ప్రాంతాలలో మంచుగడ్డలు తరిగిపోతోంటే మరోవైపు సముద్రమట్టాలు పెరగడమే కాదు, సాగరజలాలు వేడెక్కిపోతున్నాయి. ఇలా, విశ్వ మానవాళిపై మూకుమ్మడిగా దాడిచేస్తున్న ప్రకృతి విపత్తులకు ప్రధానకారణం శిలాజ ఇంధనాల వినియోగమేనన్నది నిష్ఠుర సత్యం. బొగ్గు, పెట్రోలియం లాంటి శిలాజ ఇంధనాల వినియోగం ఎంత పెరిగితే కర్బన ఉద్గారాలు అంతగా వాతా వరణంలోకి వచ్చి చేరుతున్నాయి. అవి భూతాపానికి కోరలు తొడుగుతూ ప్రమాదకర పర్యావరణ మార్పులకు ఆజ్యం పోస్తున్నాయి. మనదేశం కూడా పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచడంలో గణనీయ ప్రగతిని సాధించింది. గత సెప్టెంబర్ 16న గుజరాత్‌లోని గాంధీనగర్‌లో దేశీయంగా పునరుత్పాదక ఇంధనరంగ విస్తరణ, పెట్టుబడుల సమీకరణ కోసం "గ్లోబల్ ఆర్‌ఈ-ఇన్వెస్ట్" సదస్సును కేంద్రప్రభుత్వం నిర్వహించింది. ఈ నేపథ్యంలో పునరుత్పాదక ఇంధన వనరుల (రెన్యువబుల్ ఎనర్జీ) ప్రాధాన్యాన్ని మనం కూడా తెలుసుకుందాం.




**పునరుత్పాదక ఇంధన శక్తి (రెన్యువబుల్ ఎనర్జీ) అంటే:** ఎన్నిసార్లు, ఎంతమొత్తంలో వినియోగించినప్పటికీ ప్రకృతిలో లభించే విభిన్న వనరుల నుండి సహజ ప్రక్రియల ద్వారా ఉత్పత్తి అవుతూ, నిరంతరాయంగా పునరుద్ధరించబడే ఇంధన శక్తిని పునరుత్పాదక ఇంధనశక్తి అంటారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం వల్ల కాలుష్యం గణనీయంగా తగ్గుతుంది. ఇంధన ధరల్లో అస్థిరతలు తొలగి ఆయాదేశాలు ఇంధన రంగంలో భద్రతను, స్వావలంబనను సాధించేందుకు వీలవుతుంది.

**పునరుత్పాదక ఇంధన వనరులు – రకాలు:** పునరుత్పాదక ఇంధన వనరులను ఎన్నటికీ క్షీణించని శక్తి వనరులుగా పేర్కొనవచ్చు. అందువల్ల వీటికి అధిక ప్రాధాన్యత ఉంది. చమురు, సహజవాయువు, బొగ్గు లాంటి శిలాజ ఇంధనాలతో పోల్చితే వీటి పనితీరు భిన్నంగా ఉంటుంది. పురుత్పాదక ఇంధన వనరులను ఈ క్రింది విధంగా వర్గీకరించవచ్చు. అవి: 1. సౌరశక్తి 2. పవనశక్తి 3. జలవిద్యుత్ శక్తి 4. జియో థర్మల్ ఎనర్జీ 5. హైడ్రోజన్ శక్తి 6. సముద్ర అలలశక్తి 7. అణుశక్తి 8. జీవ ఇంధనాలు.

**i. సౌరశక్తి:** సూర్యుని నుండి వెలువడే కాంతి, ఉష్ణశక్తి రూపంలో కొంత భాగము భూమిని చేరడాన్ని "సౌరపుటం" (in-solation) అంటారు. ఈ సౌరశక్తిని మానవాళి వినియోగించేందుకు గానూ 2 రకాలుగా ఉత్పత్తి చేస్తారు. అవి: సోలార్ ఫోటో ఓల్టాయిక్ పద్ధతి 2. సోలార్ థర్మల్ పద్ధతి

**1. సోలార్ ఫోటో వోల్టాయిక్ పద్ధతి:** సిలికాన్‌చే నిర్మించబడిన సౌరఫలకాలపై సూర్య కాంతిపడినట్లయితే, ఎలక్ట్రాన్లు ఉద్భవించి, చివరకి విద్యుత్‌శక్తి ఉత్పత్తి అవుతుంది. ఉదా: సోలార్ లాంతర్లు, సోలార్ కాలిక్యులేటర్లు, సోలార్ వీధిలైట్లు, సోలార్ రిఫ్రిజిరేటర్లు మొదగునవి.

భారత పునరుత్పాదక ఇంధన వనరుల మంత్రిత్వశాఖ నివేదిక ననుసరించి ఆగస్ట్ 31, 2024 నాటికి సోలార్ ఎనర్జీ ఉత్పత్తిలో కర్నాటక (1284.73మె.వా.), హిమాచల్‌ప్రదేశ్ (993.71 మె.వా.), మహారాష్ట్ర (384.28 మె.వా.)లు తొలి 3 స్థానంల్లో ఉన్నాయి.

**2. సోలార్ థర్మల్ పద్ధతి:** ఈ పద్ధతిలో ఒకే ప్రదేశం వద్ద కాంతిపుంజాన్ని కేంద్రీకరించి, ఉష్ణశక్తిని ఉత్పత్తి చేసి వివిధ కార్యకాలపాలకు వాడతారు. ఉదా: సోలార్ బాయిలర్స్, సోలార్ వాటర్ హీటర్స్ మరియు సోలార్ గీజర్స్.

**ii. పవన శక్తి:** గాలి నుండి ఉద్భవించే శక్తిని పవనశక్తి అంటారు. ఈ పవన శక్తిని వినియోగించి ఎత్తైన గాలిటర్బైన్లద్వారా విద్యుత్ శక్తి ఉత్పత్తి కావడానికి గాలివేగం 18Km/H ఉండాలి. కేంద్రప్రభుత్వం "National wind energy mission"ను 2014లో ఏర్పాటు చేసింది. 2022 నాటికి 60వేల మెగావాట్లు లేదా 60 గిగావాట్ల పవన విద్యుత్ శక్తిని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. భారత పునరుత్పాదక ఇంధన వనరుల మంత్రిత్వశాఖ నివేదిక ప్రకారం ఆగస్ట్ 31, 2021 నాటికి గుజరాత్ (12163.28 మె.వా), తమిళనాడు (10930.24మె.వా), కర్నాటక (6553.97మె.వా)లు పవన విద్యుత్‌శక్తి ఉత్పత్తిలో తొలి 3 స్థానాల్లో ఉన్నాయి.

**iii. జలవిద్యుత్ శక్తి:**


ప్రవహించే నీటిపై ఆనకట్టలు మరియు రిజర్వాయర్లు నిర్మించడం ద్వారా జలవిద్యుత్ శక్తిని ఉత్పత్తి చేస్తారు. ప్రవహించే

నీటికి గతిశక్తి ఉంటుంది. ఈ నీటిని వేగంగా విద్యుత్ టర్బైన్ల పైకి పంపి వాటిని తిరిగేలా చేయడం ద్వారా జలవిద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు. ప్రపంచ ఇంధన వనరులలో 16.6% మరియు మొత్తం పునరుత్పాదక విద్యుత్‌లో 70% వాటాను జలవిద్యుత్ శక్తి కలిగి ఉంది.

మనదేశంలో జలవిద్యుత్ ఉత్పత్తిలో హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్నాటక తొలి 3 స్థానాలలో ఉన్నాయి. (ఆగస్ట్31, 2024 నాటికి)

iv. **జియోథర్మల్ ఎనర్జీ:** వేడి నీటి బుగ్గలు గల ప్రదేశంలో 1000 నుండి 2000 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత ఉండును. ఈ పొరలలోకి ట్యూబ్‌ను పంపి, ఉష్ణోగ్రతను నీటి ఆవిరి రూపంలోకి మార్చి, దానితో టర్బైన్లను తిప్పి విద్యుత్‌శక్తిని ఉత్పత్తి చేస్తారు. ప్రపంచంలో ఈ శక్తిని అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న ప్రాంతం కాలిఫోర్నియా (40%), మనదేశంలో పూగా లోయ (లడఖ్), సూరజ్‌కుండ్ (జార్ఖండ్), అలకనంద, తపోవన్ (ఉత్తరాఖండ్), మణికరన్, పార్వతీలోయ (హిమాచల్‌ప్రదేశ్)లలో జియోథర్మల్ ఎనర్జీద్వారా విద్యుత్‌శక్తిని ఉత్పత్తి చేస్తున్నారు.

v. **హైడ్రోజన్ ఎనర్జీ:** దీనినే 21వ శతాబ్ది ఇంధనంగా పరిగణిస్తారు. నీరు జలవిశ్లేషణ చెందినపుడు విడుదలయ్యే హైడ్రోజన్ అయాన్ల నుండి విద్యుత్ శక్తిని ఉత్పత్తి చేయవచ్చని శాస్త్రవేత్తల అభిప్రాయం. స్వాతంత్ర్యం వచ్చి 75 సం॥రాలు పూర్తైన సందర్భంగా హైడ్రోజన్ ఎనర్జీ ఉత్పత్తిని గణనీయంగా మెరుగుపరచాలన్న ఉద్దేశ్యంతో, ప్రధానిమోదీ, **నేషనల్ హైడ్రోజన్ మిషన్‌**ను ప్రారంభించారు. అదేవిధంగా స్వచ్ఛమైన హైడ్రోజన్ కోసం మిషన్ ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లో ఇండియా పాల్గొంటోంది. 2050 నాటికి భారతదేశ పునరుత్పాదక ఇంధన వనరుల విభాగంలో 3 వంతుల హైడ్రోజన్ శక్తిని ఉత్పత్తి చేయాలని ఇండియా లక్ష్యంగా నిర్దేశించుకుంది.




vi. **సముద్ర అలలు శక్తి:** సముద్ర అలలు ఎగసిపడే ప్రాంతాలలో విద్యుత్ టర్బైన్లు అమర్చి, వాటిని తిరిగేలా చేయడం ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు. ఈ విధానం ద్వారా మనదేశంలో విద్యుత్‌శక్తిని ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉన్న ప్రాంతాలు 1. ట్యుటికోరిన్ (తమిళనాడు), 2.విజింజం (కేరళ), 3. అండమాన్ మరియు నికోబార్‌దీవులు 4. లక్షద్వీప్ 5. సుందర్‌బన్స్ (పశ్చిమబెంగాల్)

vii. **అణుశక్తి:** ఈ విధానంలో థోరియం, యురేనియం లాంటి ఖనిజాలతో కేంద్రక విచ్ఛిత్తి ప్రక్రియద్వారా అణురియాక్టర్లతో విద్యుత్‌శక్తిని ఉత్పత్తి చేస్తారు. మనదేశంలో ప్రస్తుతం 22 అణురియాక్టర్లు పనిచేస్తున్నాయి. ప్రస్తుతం మనదేశంలో ఉత్పత్తి అవుతున్న అణువిద్యుత్ సామర్థ్యం 6780 మె.వా. ఇది మొత్తం శక్తి ఉత్పత్తిలో 2.1%గా ఉంది.

viii. **జీవ ఇంధనాలు:** జీవుల చేత తయారయ్యే ఇంధనాలను జీవ ఇంధనాలు అంటారు. అవి 1. బయోడీజిల్ 2. బయో ఇథనాల్ 3. బయోగ్యాస్ 4. బయోమాస్. మనదేశంలో మొదటి జీవ ఇంధన విధానం 2008లో ప్రకటించగా, తిరిగి 2018లో కొత్త జీవ ఇంధన విధానాన్ని ప్రకటించారు. దీనిని తిరిగి 2022లో సవరించారు. ప్రతి ఏటా ప్రపంచ జీవ ఇంధన దినోత్సవాన్ని ఆగస్ట్ 10న నిర్వహిస్తారు.

**పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు:**

పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధికి ప్రభుత్వం కింది చర్యలు చేపట్టింది.

**1. పీఎల్ఐ స్కీమ్:** దీనినే ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక విధానం (ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్) అంటారు. మనదేశంలో తయారీరంగ పనితీరును మెరుగుపరచడానికి ప్రభుత్వం తీసుకువచ్చిన మెరుగైన పథకంగా దీనిని చెప్పవచ్చు. తయారీరంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడానికి, తగిన ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించడానికి ఈ పథకం సహాయ సహకారాలు అందిస్తుంది.

**2. పీఎమ్- కుసుమ్** (PM-KUSUM): దీనినే ప్రధానమంత్రి -కిసాన్ ఊర్జా సురక్షాఏవం ఉత్థాన్ మహాభియాన్‌గా పిలుస్తారు. ఈ పథకం ద్వారా 2022 నాటికి 25,750 మెగావాట్ల సౌరశక్తిని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రైతుల యొక్క నీటి పంపులను సోలారైజేషన్ చేసి రైతులకు ఆర్థిక మరియు నీటి భద్రతను అందించాలని ప్రభుత్వం లక్ష్య నిర్దేశం చేసుకున్నది.

**3. IRIX:** మనదేశానికి చెందిన మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ తన వెబ్‌సైట్ ద్వారా అక్షయ్ ఊర్జాపోర్టల్, మరియు **ఇండియా రెన్యువబుల్ ఐడియా ఎక్స్ఛేంజ్ (IRIX)** పోర్టల్‌లను నిర్వహిస్తోంది. IRIX అనేది ఇండియా మరియు గ్లోబల్ కమ్యూనిటీ మధ్య ఆలోచనల మార్పిడిని ప్రోత్సహించడానికి, ఇంధన సహకారాన్ని పెంపొందించడానికి తోడ్పడుతుంది.

**4. నేషనల్ సోలార్ మిషన్:** ఇది 2010లో ప్రారంభించబడింది. ఇది గ్రిడ్ కనెక్ట్ మరియు ఆఫ్ గ్రిడ్ సోలార్ పవర్ ప్రాజెక్ట్‌లతో కలిపి సోలార్ పవర్ ప్రాజెక్ట్‌లను స్థాపించడం ద్వారా సోలార్ ఎనర్జీ ఉత్పత్తిని మెరుగు పరిచేలా లక్ష్య నిర్దేశం చేసుకుంది.

**5. గ్రీన్ ఎనర్జీ కారిడార్లు:** గ్రీన్ ఎనర్జీ కారిడార్ ప్రాజెక్టు జాతీయ గ్రిడ్‌లో పునరుత్పాదక ఇంధనాన్ని ఏకీకృతం చేయడానికి, ట్రాన్స్‌మిషన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్‌ను మెరుగు పరచడంపై దృష్టి పెడుతుంది.

**6. నేషనల్ విండ్ ఎనర్జీ మిషన్:** భారతదేశంలో పవనశక్తి అభివృద్ధి మరియు విస్తరణపై దృష్టి సారిస్తుంది. 2030 నాటికి

పవనశక్తి సామర్థ్యం 140 గిగావాట్లకు చేరాలని లక్ష్య నిర్దేశం చేసుకోవడం జరిగింది.

**7. నేషనల్ క్లీన్ ఎనర్జీ ఫండ్:** గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడంలో సహాయపడే క్లీన్ ఎనర్జీ టెక్నాలజీలు మరియు ప్రాజెక్టులలో పరిశోధన మరియు ఆవిష్కరణలకు మద్దతు ఇవ్వడానికి దీనిని ప్రవేశపెట్టారు.

**8. రెన్యువబుల్ పర్చేజ్ ఆబ్లిగేషన్ (RPO):** ఈ విధానం ద్వారా విద్యుత్ పంపిణీ సంస్థలు మరియు పెద్ద విద్యుత్ వినియోగదారులు తమ శక్తిలో కొంత శాతాన్ని పునరుత్పాదక ఇంధన వనరుల నుండి స్వీకరించాల్సి ఉంటుంది. తద్వారా ఈ పథకం పునరుత్పాదక ఇంధన రంగంలో డిమాండ్‌ను ప్రోత్సహిస్తుంది.

**9. ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ (ISA):** సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా తమ ఇంధన అవసరాలు తీర్చుకోవడానికి, సౌర వనరులు అధికంగా ఉన్న దేశాల కూటమి అయిన ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్‌ను స్థాపించడంలో భారతదేశం కీలక పాత్ర పోషించింది.

**పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధికి రాబోయే 5 సం॥రాలకు ఇండియా నిర్దేశించుకున్న లక్ష్యాలు:**




**1. ట్విన్ ఛాలెంజ్:** ప్రస్తుతం మనదేశ అవసరాలకు లభిస్తున్న ఇంధనం కన్నా అధికంగా ఇంధన వనరులను సమకూర్చడంతో పాటు, స్వచ్ఛమైన ఇంధనాన్ని సమకూర్చడం అన్న అంశాలు మనదేశానికి జంట సవాళ్ళుగా మారాయి. నిరుద్యోగ నిర్మూలనతో పాటు, మనదేశంలోని గృహ సముదాయాలకు వికేంద్రీకృత ఇంధనాన్ని సమకూర్చేందుకు గాను మనదేశం **ఆత్మ నిర్భర్ భారత్** కింద సోలార్ ప్యానెల్స్ తయారీపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. తయారీ రంగ పురోగతినే కాకుండా మొత్తం సరఫరా గొలుసుల వ్యవస్థను కూడా సంస్కరించాల్సిన అవసరం ఉంది.

**2. మిథనాల్ అండ్ బయోమాస్:** శిలాజ ఇంధనాల వాడకం నుండి ఇంధన రంగాన్ని బయోమాస్ వంటి జీవ ఇంధనాల వైపు పరివర్తన చెందించేదిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తద్వారా మన నగరాలు కాలుష్య రహితంగా మారడంతో పాటు, ఇంధన రంగంలో స్వావలంబన సాధించవచ్చు. జీవ ఇంధనాలనేవి అధిక కెలోరిఫిక్ విలువను కలిగిఉండి శిలాజ ఇంధనాలతో పోల్చితే అధిక స్వచ్ఛతను కలిగి ఉంటాయి. 2025-26 నాటికి పెట్రోల్‌లో 20% ఇథనాల్ కలపాలని బయోఫ్యూయల్ పాలసీ-2018 లక్ష్య నిర్దేశంగా ఉంది. అదేవిధంగా మిథనాల్‌ను కూడా భవిష్యత్ ఇంధనంగా వినియోగించాలని ఇండియా సంకల్పిస్తోంది. 2030 నాటికి 10% క్రూడ్ ఆయిల్ దిగుమతులను మిథనాల్‌తో భర్తీ చేయాలని నీతి ఆయోగ్ రోడ్‌మ్యాప్ రూపొందించింది.

**3. హైడ్రోజన్ ఆధారిత ఫ్యూయల్ సెల్స్ వెహికల్స్:** హైడ్రోజన్ ఆధారిత ఇంధనాల సృష్టి అనేది పునరుత్పాదక ఇంధన వనరుల ముఖ చిత్రాన్నే సమూలంగా మార్చే అవకాశం ఉంది. ఇందులో భాగంగా హైడ్రోజన్ ఆధారిత బ్యాటరీలు తయారు చేసి వాటిని వాహనాలలో వినియోగించే దిశగా పరిశోధనలు జరుగుతున్నాయి.

**గ్రిడ్ ఇంటిగ్రేషన్:**

దీనిని గ్రిడ్‌కు విభిన్న రకాల పునరుత్పాదక ఇంధన వనరులను అందించడానికి అవసరమైన సమర్థవంతమైన మార్గాలను అభివృద్ధి చేసే పద్ధతిగా చెప్పవచ్చు.

**పునరుత్పాదక ఇంధన వనరులు-ప్రయోజనాలు:**

**i. తక్కువ నిర్వహణ ఖర్చు:** పవనశక్తి, జీవశక్తి లేదా సౌరశక్తి వంటి పునరుత్పాదక ఇంధన వనరుల నిర్వహణ ఖర్చు దాదాపు శూన్యమని చెప్పవచ్చు. తద్వారా పనిగంటలు పెంచుకొని కార్మిక వ్యయాన్ని తగ్గించుకోవచ్చు.

**ii. సుస్థిరం మరియు పర్యావరణ అనుకూలం:** ఈ రకమైన ఇంధనాలు పీఎం 2.5 లేదా పీఎం 10 లాంటి కార్బన్ ఆధారిత హానికర ఉద్గారాలను మరియు కార్బన్‌డైఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ లాంటి గ్రీన్‌హౌస్ వాయువులను వెలువరించవు. అందువల్ల ఇవి పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించవు. తద్వారా సుస్థిరాభివృద్ధికి తోడ్పడతాయి.

**iii. బహుళ లక్ష్యాలను చేరుకునే అవకాశం:** పునరుత్పాక ఇంధన వనరులు ఉద్యోగసృష్టికి తోడ్పడడంతోపాటు పంచామృత లక్ష్యాలు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, మేక్ ఇన్ ఇండియా పారిస్ ఒప్పందం వంటి జాతీయ, అంతర్జాతీయ లక్ష్యాల కనుగుణంగా మెరుగైన పనితీరును ప్రదర్శించేందుకు ప్రభుత్వానికి తోడ్పాటునందిస్తాయి.

**iv. వికేంద్రీకరణ:** ఇంధన డిమాండ్ ఎక్కడ ఎక్కువగా ఉంటుందో, అక్కడే పునరుత్పాదక ఇంధన వనరుల ప్లాంట్లను స్థాపించవచ్చు. ఉదా॥ కేంద్రపాలిత ప్రాంతమైన డామన్ తన ఇంధన అవసరాల న్నింటిని ఆ నగరంలోని సోలార్ ఎనర్జీ ప్లాంట్ల ద్వారా తీర్చుకుంటూ, నేషనల్ గ్రిడ్‌పై ఆధారపడడాన్ని వీలైనంత తగ్గిస్తోంది.

**v. ప్రైవేటు రంగానికి ప్రోత్సాహకం:** 2030 నాటికి పునరుత్పాదన ఇంధన వనరుల ద్వారా 500 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని సాధించాలని లక్షిస్తోంది. ఇది కేవలం ప్రభుత్వం ద్వారానే సాధ్యం కాదు. డిజైన్ మరియు తయారీలో ప్రైవేటు రంగానికి ఇది విస్తృతమైన అవకాశాలను కల్పించడంతో పాటు పెద్ద ఎత్తున లాభాలను కూడా అందిస్తుంది.

**సవాళ్ళు:**

**i. అధిక ప్రారంభ సంస్థాపన వ్యయం:** బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్లతో పోలిస్తే గాలి ఆధారిత విద్యుత్ ప్లాంట్లకు అధిక ప్రారంభ పెట్టుబడులు అవసరమవుతాయి. 25% సామర్థ్య వినియోగంతో 1 మెగావాట్ ఇంధన ఉత్పత్తికి రమారమి 6కోట్లు

**RE-INVEST-2024 అంటే:**

భారత న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ మంత్రిత్వశాఖ ననుసరించి పునరుత్పాదక ఇంధన వనరుల రంగంలో కీలక పాత్ర పోషించే వారందరినీ ఒకచోట కలిపేందుకు ఉపయోగపడే వేదికగా RE-INVESTను పిలుస్తారు. ఈ సమావేశంలో పునరుత్పాదక ఇంధన రంగం యొక్క భవిష్యత్, ఆ రంగంలోని నూతన ధోరణులు, సాంకేతికతలు, విధానాలపై లోతుగా చర్చిస్తారు, పరిష్కారాలను అన్వేషిస్తారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో 7 మరియు 13వ లక్ష్యాలను సాధించేందుకు ఈ సమావేశం ఒక చుక్కానిలా తోడ్పడుతుంది. అదేవిధంగా పునరుత్పాదక ఇంధనరంగంలో సహకారం, జ్ఞానాన్ని పంచుకోవడం, మరియు పెట్టుబడి అవకాశాలను ప్రోత్సహించే ప్లాట్‌ఫాంగా ఇది తోడ్పడుతుంది.

ఖర్చువుతుందని అంచనా.

**ii. స్టోరేజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్:** పునరుత్పాదక ఇంధన వనరుల సరఫరాలో అంతరాయాన్ని అధిగమించడానికి సరసమైన, అధిక సామర్థ్యం గల బ్యాటరీల ఉత్పత్తికి పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉంది.

**iii. సామాజిక వినియోగంలో పరిమితులు:** సోలార్ వాటర్ హీటర్లు, లైటింగ్ సిస్టమ్స్ లాంటి పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం భారీగా సబ్సిడీలు ఇస్తున్నప్పటికీ, మనదేశ సామాజిక వ్యవస్థ పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగానికి ఇంకా అలవాటు పడలేదు.

**iv. బలహీనమైన దేశీయ తయారీ సామర్థ్యం:** దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడానికి, ఇంధన రంగంలో స్వావలంబన సాధించడానికి, మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనకు బలహీనంగా ఉన్న దేశీయ తయారీ సామర్థ్యాన్ని మెరుగుపరచడం ఎంతైనా అవసరం.

**భారతదేశంలో రెన్యువబుల్ ఎనర్జీ స్థాపిత సామర్థ్యం:**

ఆగస్ట్, 2024 నాటికి మనదేశం యొక్క పునరుత్పాదక ఇంధన వనరుల (పెద్ద తరహా జలవిద్యుత్‌శక్తితో కలిపి) స్థాపిత సామర్థ్యం 199.52 గిగావాట్లుగా నమోదు అయింది.

భిన్న రంగాల వారీగా వాటి వివరాలు కింది విధంగా ఉన్నాయి.

విండ్ పవర్–47.19 గి.వా, సోలార్ పవర్–89.43గి.వా బయోమాస్/ కోజనరేషన్–10.35గి.వా., స్మాల్ హైడ్రోపవర్–5.07 గి.వా., లార్జ్ హైడ్రోపవర్–46.92గి.వా., వ్యర్థ పదార్థాల ఇంధనశక్తి–0.60గి.వా.

రెన్యువబుల్స్ గ్లోబల్ స్టేటస్ రిపోర్ట్–2024 ప్రకారం, పునరుత్పాదక ఇంధన స్థాపిత సామర్థ్యంలో ఇండియా ప్రపంచంలో 4వ స్థానంలోనూ, పవన విద్యుత్‌లో 4వ స్థానం, సోలార్ విద్యుత్‌లో 5వ స్థానంలో నిలిచింది.

**భారతదేశంలో రెన్యువబుల్ ఎనర్జీ స్థాపిత సామర్థ్యంలో పెరుగుదల:**

భారతదేశం యొక్క శిలాజేతర ఇంధన సామర్థ్యం గత 8.5 సం॥రాలలో 396% పెరిగింది. అణు మరియు పెద్ద తరహా జలవిద్యుత్‌తో కలిపి ఉత్పత్తి 207.76 గి.వా. కంటే ఎక్కువగా ఉంది. ఇది దేశం యొక్క మొత్తం సామర్థ్యంలో 46%గా ఉన్నట్లు అంచనా. UNFCC వారి COP26 (గ్లాస్గో 2021) సమావేశాన్ననుసరించి మనదేశం 2030 నాటికి 500 గి.వా. పునరుత్పాదక ఇంధన వనరులను ఉత్పత్తి చేయాలని లక్షిస్తోంది. పంచామృత్ ప్రతిజ్ఞ ననుసరించి పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తిలో ప్రపంచంలోనే అతిపెద్ద విస్తరణ ప్రణాళికను మనదేశం అనుసరిస్తోంది.

**రెన్యువబుల్ ఎనర్జీలో పరుగులు పెడుతున్న భారత్– ప్రధానిమోదీ**


రెన్యువబుల్ ఎనర్జీలో మనదేశం వడివడిగా ముందడుగు వేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఇందులో భాగంగా హై ఫెర్మామెన్స్ బయోమాన్యుఫాక్చరింగ్‌ని ప్రోత్సహించడానికి "కొత్త బయో E3" (బయోటెక్నాలజీ ఫర్ ఎకానమీ, ఎన్విరాన్‌మెంట్, ఎంప్లాయ్‌మెంట్) విధానం ఆమోదించామని తెలిపారు. ఇంకా ఆఫ్ షోర్‌విండ్ ఎనర్జీ ప్రాజెక్ట్‌ల కోసం వయబులిటీగ్యాక్ ఫండింగ్ పథకం కింద 7000 కోట్ల రూ॥లు కేటాయించారు. ఎలక్ట్రిక్ మొబిలిటీ మరియు హైఫెర్ఫామెన్స్ బయోమాన్యుఫాక్చరింగ్ కొరకు 1 ట్రిలియన్ రూ॥ల పరిశోధన నిధి ఏర్పాటు చేశారు. **పారిస్ ఒప్పందం నిర్దేశించిన పునరుత్పాదక ఇంధన లక్ష్యాలను నిర్దేశించిన గడువుకన్నా 9సం॥రాల ముందుగానే లక్ష్యాన్ని చేరుకున్న తొలి జీ20 దేశంగా భారత్ నిలిచిందని ప్రధాని శ్లాఘించారు.**

**చివరిగా:** పదేళ్ళుగా రెన్యువబుల్ ఎనర్జీలో దూకుడుగా ముందుకెళుతున్న చైనా ప్రధానంగా సౌర విద్యుదుత్పాదనలో మిగిలిన దేశాలకు అందనంత ఎత్తులో నిలుస్తోంది. ఏడాదిలో 300 రోజులు సౌరశక్తి అధికంగా ప్రసరించే ఇండియాలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి అపార అవకాశాలున్నాయి. రకరకాల నిబంధనలు, ఖరీదైన ఉపకరణాల కారణంగా గ్రామీణ ప్రాంతాలలో సౌర విద్యుత్ ఫలకాల ఏర్పాటు ఆశించినంత వేగంగా సాగడంలేదు. సరఫరా వ్యవస్థల నిర్మాణంలోని ఇబ్బందులు పవనవిద్యుత్‌కు ఆటంకాలవుతున్నాయి. వాటిని పరిష్కరించడంతో పాటు పట్టణ భారతంలో పోగు పడుతున్న చెత్తను సద్వినియోగం చేసుకోవడం, జీవ ఇంధన తయారీని జోరెత్తించడం తదితరాలపై ప్రభుత్వాలు నిశితంగా దృష్టి సారించాలి. తద్వారా మనదేశం ఇంధన రంగంలో స్వావలంబన సాధించడంతో పాటు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు సిద్ధించి, ప్రజారోగ్యం కూడా మెరుగుపడుతుంది.

–పుట్టా పెద్ద ఓబులేసు,
స్కూల్ అసిస్టెంట్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
రావులకొలను, సింహాద్రిపురం, కడప
m : 9550290047

# బీటలు బారిన నేల- వనరుల వినియోగం

మానవ సమాజాలకు సహజ లేదా ప్రకృతి ప్రపంచానికి మధ్య ఉండాల్సిన సంబంధాలు ఎటువంటివి? అనే విషయంగా పర్యావరణ వేత్తలు తరుచుగా చర్చిస్తుంటారు. వాటికి ఒక సిద్ధాంత భూమికను, అవగాహన చేసుకోవలసిన దారులనూ చూపుతూ ఉంటారు. చాలాకాలం వరకు భారతీయ సామాజిక శాస్త్రవేత్తలు, చరిత్రకారులు మానవ జీవితాలకు సంబంధించి ఆవరణ వ్యవస్థల కోణాన్ని విస్మరించటం జరిగిందని పర్యావరణ అధ్యయన పరులు తరచుగా చెప్పేమాట భూస్వాములకు, రైతాంగ వర్గాలకు ఉన్న సంబంధం గురించి పలు అధ్యయనాలు కనిపిస్తాయి కానీ, వ్యావసాయిక జీవనం ఆయా కాలాల్లో అడవులు, నీరు, ఖనిజాలు మాత్రమే కాకుండా సహజ సందర్భాల చేత నియంత్రింపబడి ఉంటుందని చెప్పటం మరచిపోతుంటారు. సహజ ప్రపంచంలో మానవాళికి ఉండే పరస్పర చర్యలను సామాజిక సంస్థలు అదుపులో పెడుతూ ఉంటాయి. అయితే ఆయా సామాజిక సంస్థలు సహజవనరుల వినియోగం గురించి వివేకవంతమైన విషయాలను చెపుతాయా? లేదా దుష్ప్రచారాలకు వొడిగడతాయా అనేది అంత త్వరగా తేల్చటం కష్టతరమైన పని. పర్యావరణ హితాన్ని కోరటం, ఆకాంక్షించటం అందరూ సమానంగా చేస్తారని చెప్పటం కుదరదు. వనరులను వినియోగించే పద్ధతులు అనుసరించిన విధానాలకు ప్రకృతికి మధ్య భిన్న చారిత్రక కాలాల్లో విభిన్నమైన వైషమ్యాలు, సంఘర్షణలు, చర్యాప్రతిచర్యలు పర్యావరణ సుస్థిరత మీద ఎటువంటి ప్రభావం చూపాయనేది కూడా అందరూ తెలుసుకోవలసిన విషయం. ఆధునిక కాలంలో కంటే పూర్వాధునిక కాలాల్లోనే మానవ వ్యవస్థలకు, ప్రకృతి, పర్యావరణాల మధ్య సామరస్య పూర్వక సంబంధాలు కొనసాగాయనేది వాస్తవం. వనరులను వినియోగించుకోవటంలో అక్షరాస్యత లేని గ్రామీణ సమూహాలు ఆధునికులకంటే మెరుగ్గానూ, పర్యావరణ హితంగానూ ఒక మెలకువను ప్రదర్శించారని చెప్పటంలో సందేహించాల్సిందేమీ లేదు. ఎందుకంటే ప్రకృతి అంటే ఏమిటో వారు అర్థం చేసుకున్నారు. తాము ప్రకృతి మీద ఆధారపడి ఉన్నమనే సత్యాన్ని గ్రహించారు. తాము ప్రకృతిపై ఆధిపత్యం వహించాలన్న భావన కూడా వారికి ఉండి ఉండదనేది ఒక వాస్తవం.





బ్రిటీష్ పాలకుల కాలంలో అనేక కొత్త చట్టాలు, సాంకేతికతలు, అడవుల నిర్వహణకు సంబంధించి అమలులోకి వచ్చాయని మనకు తెలిసిందే. సాంకేతికతలు, చట్టాలు ఉత్పన్నం చేసిన ఘర్షణలు ఉద్రిక్తలు ఎటువంటివో, అటవీ సంపదపై ఆధారపడి జీవించిన భిన్న సమూహాలపై అవి ఎటువంటి ప్రభావాన్ని చూపాయో కూడా మన ఎరుకలోని విషయమే. ఆ చట్టాలను ఏదో ఒక మేరకు కొనసాగిస్తూనే అడవుల ఉత్పాదనలను తీవ్ర తరం చేసింది స్వాతంత్ర్యానంతర భారత ప్రభుత్వాలు. ఫలితంగా రైతులు, గిరిజనులు అంచులకు నెట్టివేయబడ్డారు. పర్యావరణ పరిరక్షలుగా ఉన్న పలు గిరిజన, ఆదివాస తెగల, సమూహాలు ఇలా అంచులకు నెట్టివేయబడటం వల్ల జీవ వైవిధ్యం కూడా దెబ్బతిన్నదనేది పలు అధ్యయనాలు తెలిపే కటువైన వాస్తవం.

1980ల నాటికి మనకు సామాజిక చరిత్ర, సాంస్కృతిక చరిత్ర, ఆర్థిక చరిత్ర, మహిళా చరిత్రల్లాంటివి వృద్ధిపొంది ఇవి ఉప అనుశాసనాలుగా కొనసాగుతూ ఉన్నాయి.

కానీ పర్యావరణ చరిత్ర యింకా శైశవదశలోనే ఉందనీ విషయాన్ని 'This Fissured Land: An Ecological History of India' అనే గ్రంథ రచన ద్వారా చర్చకు తెచ్చారు. మాధవ్ గాడ్గిల్, రామచంద్రగుహలు ఈ గ్రంథం 1991లో వెలుగు చూసింది. 1991 అనేది భారతదేశ ఆర్థిక చరిత్రలో ఒక మలుపు. సమస్తమూ మార్కెట్ శక్తులకు అప్పగించబడిన కాలమది. తాము ఈ దేశపు పౌరులుగా, పర్యావరణ పరంగా స్పృహ, చైతన్యం గల పౌరులం కావటం చేత మా వృత్తి గత అనుభవాల విశ్లేషణ, స్వీయానుభవాల వివరణ ఫలితంగా ఈ గ్రంథం వెలువడిందని చెప్పుకున్నారు. భారతదేశంలో ఎన్నో పర్యావరణ చైతన్య ఉద్యమాలు గీత దశాబ్దాలలో నడిచాయి. వాటిల్లో చిప్కో ఉద్యమం ఒకటి. తమ

అనేక పరిశోధనా ప్రయాణాలలో భారతదేశంలోని బహుప్రాంతాలలో పర్యావరణ క్షీణతలను స్వయంగా వీక్షించామని అంటారు. అడవులు తరిగిపోవటం, భూసారం క్షీణించటం, నదులు కలుషితం కావటం తదితరమైనవన్నీ గ్రామీణ, గిరిజన తెగలు, సమూహాల మీద ప్రతికూల ప్రభావాలను చూపాయని పేర్కొన్నారు. పర్యావరణం ఇంతగా దెబ్బతినడానికి, క్షీణించడానికి మూలాలు ఎక్కడున్నాయో వీరు గుర్తించారు. పట్టణ, పారిశ్రామిక ఆసక్తులను బట్టి వాటికి అనుకూలంగా ఉండే అభివృద్ధి వ్యూహాలు రూపొందింప జేసుకోవటం లోనే అసలు సమస్య ఉందని నిర్ద్వంద్వంగా ప్రకటించారు. పట్టణ, పారిశ్రామిక ఆసక్తులకు అనుకూలంగా ఉండే అభివృద్ధి నమూనాలకు రూపొందించుకోవటం వలన ప్రకృతిని వినియోగించుకోవటంలో వివేక, విజ్ఞతల కంటే వంచనా పూరిత వినియోగమే జరిగిందని భావించారు.




సృజనాత్మక పెట్టుబడికంటే క్రోనీ కాపిటలిజం దురాక్రమించిందని నిర్ధారించారు. సృజనాత్మక ఆలోచనలున్న పారిశ్రామిక వేత్తల కంటే సత్సంబంధాలు కలిగి ఉన్న పారిశ్రామిక వేత్తలు త్వరిత గతిన సస్సంపన్నులయ్యారని సూచించారు. ప్రభుత్వాలతో ఇటువంటి వారికంటే పలుకుబడి వారి సమృద్ధతకు కారణం. భూమి, ఖనిజాలు, ఇతర సహజవనరుల కీలక నియంత్రణ ప్రభుత్వాల చేతుల్లో ఉంటుంది. క్రోనీ కాపిటలిస్టులు ప్రభుత్వాలను సులభంగానే ప్రభావిత పరచగల వెసులుబాటును కలిగి ఉంటారు. సమాజహితమో, పర్యావరణ సుస్థిరతో వీరికి ప్రాథమ్యాంశాలుగా ఉండవు. వ్యక్తులు పెట్టుబడిదారులుగా రాజకీయ నేతలతో ఒప్పందాలు కుదుర్చుకోగలుగుతారు. ప్రజాధనం పై భారం పడినా పర్యావరణంపై భారం పడినా, సామాజిక హితానికి భంగం కలిగినా వారికేమీ పెద్దగా పట్టింపు ఉండదు.

ఆర్థిక సరళీకరణల క్రమం ఒకటి మొదలయ్యాక వనరుల వినియోగంలో వివేకంలేని లజ్జరహిత పద్ధతులను అనుసరిస్తున్నామని అంటారు. మాధవ్‌గాడ్గిల్, రామచంద్రగుహలు. 1980లలో ప్రవేశపెట్టిన న్యాయ పరిరక్షణ చట్టాలు గాలికి వదిలేయబడ్డాయి. జలసంరక్షణ, సుస్థిర ఇంధనం లాంటి కార్యక్రమాలు నిర్లక్ష్యం చివరకు తరిమివేయబడ్డాయి. కంటి తుడుపుగా ఏవైనాకార్యక్రమాలు జరిగినా అవి జనావళిని వంచించటానికే తప్ప మరొకటి కాదు. వీటితో పాటుగా ప్రజల జీవన విధాన శైలీ, సంస్కృతులలో పలు తీవ్ర మార్పులు సంభవించాయి. ఈ సరికొత్త జీవనశైలి సహజ వనరుల మరింత వినియోగాన్ని ఎప్పటి కప్పుడు కోరుతూ ఉంటాయి. సరళత, నిరాడంబరత లాంటివి అదృశ్యం అయ్యాయి. బుద్ధుడు, గాంధీలు ప్రవచించిన విలువలు ఒకప్పుడు గౌరవం పొందినట్లుగా ఇప్పుడు పొందటంలేదు.

వినిమయ వర్గాల కార్పోరేట్ల అవసరాలను తీర్చడానికి ప్రభుత్వాలు హడావిడిగా ఒక క్రమమంటూ, పద్ధతంటూ లేకుండా మధ్యభారత, ఉత్తర, ఈశాన్యరాష్ట్రాల గిరిజన ప్రాంతాలలో వనరుల అన్వేషణకు ప్రోత్సహిస్తున్నాయి. ఈ ప్రాంతాలు ఇప్పుడు కొత్త కాలనీలుగా మారాయి. మైనింగ్ హైడ్రోఎలక్ట్రిక్ పథకాలు స్థానిక ఆవరణ వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. స్థానిక ప్రజలు విస్థాపితులవుతూ ఉన్నారు. విస్తృత స్థాయిలో అసంతృప్తులు రగులుతూ ఉన్నాయి. పర్యావరణం-వనరులు వినియోగంలో బాధ్యతాయుత పౌరులందరూ వివేకవంతంగా ఆలోచించవలసి ఉంది. గణతంత్ర భారతం బీటలు బారిన నేల అని అది 1992లో కంటే మరింత నెర్రెలిచ్చిందని అంటున్న మాధవ్‌గాడ్గిల్, రామచంద్రగుహలు చెపుతున్న దేమిటో ఆలకించాలి. వయనాడ్ విషాదాలు మరింత ఉధృతంగా ముమ్ముందు సంభవించక ముందే మేల్కొనవలసి ఉంది. వివేకవంతంగా ప్రవర్తించవలసి ఉంది.

- డా॥ ఆర్. సీతారామారావు
m : 9866563519
e: sitametaphor@gmail.com



# అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ

దేవుళ్లను పూలతో పూజించడం మనకు తెలుసు. పూలనే దేవుళ్లుగా కొలిచి పూజించే సంస్కృతి బహుషా ప్రపంచంలో ఎక్కడా ఉండకపోవచ్చు. అలాంటి పండుగ తెలంగాణలో ఉండటం గర్వకారణం. మరికొద్ది రోజుల్లో తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ సంబరాలు షురూ కానున్నాయి. తెలంగాణ ఉద్యమ కాలంలో పాటకు ఎంత ప్రాధాన్యత ఉండేదో.. బతుకమ్మ కూడా అంతే. మిలియన్ మార్చ్ నుంచి వంటావార్పు వరకు ఇలా చరిత్రలో ఎన్నో తెలంగాణ ఉద్యమాలకు బతుకమ్మ కేరాఫ్‌గా నిలిచింది. తెలంగాణ అస్తిత్వ పోరాట చిహ్నంగా 'బతుకమ్మ' మారిందనడంలో అతిశయోక్తి లేదు.



### విశిష్టత..

ప్రకృతితో మమేకమై ఆటపాటలతో, ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకోవాలనేదే బతుకమ్మ ప్రధాన ఉద్దేశం. ఏటా ఈ పండుగ సమీపించే సమయానికి ప్రకృతి అంతా పూలవనంగా మారిపోతుంది. ప్రకృతిలో సేకరించిన పూలను ప్రకృతికే సమర్పించుకోవాలనే బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేసి విడిచిపెడతారు. నిత్యనూతనమై తెలంగాణ వాకిట్లో సిరులొలికించే ప్రకృతి పండుగ బతుకమ్మను మహిళలు భక్తి పారవశ్యంతో జరుపుకోవడం ఆనవాయితీ. వర్షాకాలపు చివర్లో, శీతాకాలపు తొలిరోజుల్లో వచ్చే ఈ పండుగ వేళ వర్షాలతో జలాశయాలు కళకళ లాడుతుంటాయి. రకరకాల పువ్వులు, రంగురంగులతో ఆరుబయళ్లలో వికసించి ప్రకృతికే కనువిందు చేస్తుంటాయి. గునుగుపూలు, తంగేడు పూలు ఎక్కడ చూసినా విరబూసే ఉంటాయి. బంతి, చేమంతి, నందివర్ధనం లాంటి పూలకు కూడా ఇదే సీజన్. సీతాఫలాలు కూడా ఈ సమయంలోనే ఒక ప్రత్యేక ఆకర్షణ. గుమ్మడి, కట్లాయి, అల్లీపూలు ఇదే సమయంలో బాగా విరబూస్తాయి.



### పిత్రు అమవాస్యతో ప్రారంభమై..

అశ్వయుజ మాసం పెత్రమాస (మహాలయ అమావాస్య, పిత్రు అమావాస్య)తో బతుకమ్మ వేడుకలు ఆరంభమవుతా యి. అష్టమి వరకు కొనసాగే ఈ పండుగలో కేవలం ఆచారమే కాదు.. శాస్త్రీయత దాగి ఉంది. కొత్త బట్టలు ధరించి, ఇత్తడి తాంబూలంలో గుమ్మడి ఆకులు పరిచి, వాటిమీద తంగేడు పూలు పేరుస్తారు. కాస్తఎత్తులో పూలను పేర్చిన తర్వాత గునుగు, బంతి, చామంతి, అడవి చామంతి, ముత్యాలపువ్వు, రుద్రాక్ష, నీల గోరింట, పట్టుకుచ్చులు, కట్ల, బీర ఇలా బతుకమ్మలను పేర్చడంలో రకరకాల పూలను వినియోగిస్తారు.

### ఔషధ గుణాలు..

బతుకమ్మకు వాడే పూలన్నీ ఎన్నో ఔషధగుణాలు కలిగి ఉంటాయి. తంగేడు పూలు గొంతు, మూత్ర సంబంధిత సమస్యలకు ఔషధం. గునుగు పువ్వు యాంటీ డయేరియా, యాంటీ డయోబెటిక్ లక్షణాలు కలిగి ఉంటుంది. బంతిపువ్వు క్రిమిసంహారిణి, దోమలను నివారించే శక్తికలిగి ఉంటుంది. చామంతిని కాలిన గాయాలకు, దెబ్బలకు, కంటి సంబంధిత రోగాలకు, జీర్ణానికి ఔషధంగా వాడతారు. ఇది యాంటీ బ్యాక్టీరియా లక్షణాలు కలిగి కాలుష్య కారకాలను బెంజిన్, అమ్మోనియా వాయువులను పీల్చుకుని గాలిని శుద్ధి చేస్తుంది. ఇలా బతుకమ్మ పేరిట వాడే ప్రతీ పువ్వుకు అనేక ఔషధ గుణాలున్నాయి. ఈ పూలన్నింటినీ గోపురంలా పేర్చాక పైన గుమ్మడి పువ్వుగొడుగు పెడతారు. తమల పాకులో పసుపుతో చేసిన గౌరమ్మను ఉంచి పక్కనే దీపం వెలిగిస్తారు. పసుపు శుభసూచకం. అంతేకాదు క్రిమి సంహారిణి కూడా. ఇక దీపం జ్ఞానానికి సంకేతం. అది గాలిని శుద్ధి చేస్తుంది. క్రిములను హరిస్తుంది. బతుకమ్మల్లోని పూలకున్న ఔషధగుణాలు నిమజ్జనం సందర్భంగా నీటిని శుద్ధి చేసి, నీటి ద్వారా వచ్చే రోగాలను హరిస్తాయి.

### విశిష్టత..

తొమ్మిది రోజులు జరుపుకునే బతుకమ్మ పండుగలో ఎన్నో విశిష్టతలు దాగి ఉన్నాయి. అడపడుచులు తమ మనోభావాలను పాటల ద్వారా వెల్లడిస్తారు. సంతోషాన్ని అడుగులు, చప్పట్ల ద్వారా ప్రదర్శిస్తూ పారవశత్వం చెందుతారు. స్త్రీల సౌందర్య ఆరాధనం, అలంకార నైపుణ్యం, కళాత్మక దృష్టి, బతుకమ్మను పేర్చడంలో ఉట్టిపడుతుంది. పండుగలో తల్లి బతుకమ్మ, పిల్ల బతుకమ్మలు పేర్చడం ద్వారా





తల్లి పక్కనే పిల్ల ఉండాలనే స్త్రీమాతృ హృదయం ఎలాంటిదో అవగతమవుతుంది. త్రికోణం స్త్రీకి సంకేతం. త్రికోణం (పిరమిడ్ ఆకారం)లోని పసుపుముద్ద సంతాన, సౌభాగ్య ప్రదాయిని అయిన గౌరీదేవికి చిహ్నమని పూర్వీకులు ఆడపడుచులకు అర్థమయ్యే రీతిలో చెబుతుంటారు. 'బతుకమ్మ బ తుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో' అంటూ సాయంత్రం ఇంటి ముందు కానీ, వీధిలో కానీ, దేవాలయంలో, చెరువు, వాగుల్లో ఇలా ప్రతి చోటా ఆడపడుచులంతా చేరి బతుకమ్మలను మధ్యలో ఉంచి పాటలు పాడతారు. ఒకరు పాడుతుంటే మిగతా మహిళలంతా వంతపాడుతుంటారు.

### ఏ రోజు ఏ బతుకమ్మ..

తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ, రెండోరోజు అటుకుల బతుకమ్మ, మూడోరోజు ముద్దపప్పు బతుకమ్మ, నాలుగో రోజు నాన బియ్యం బతుకమ్మ, ఐదోరోజు అట్ల బతుకమ్మ, ఆరోరోజు అలిగిన బతుకమ్మ, ఏడోరోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదో రోజు వెన్నముద్ద బతుకమ్మ, తొమ్మిదోరోజు సద్దుల బతుకమ్మ ఇలా రోజుకో పేరుతో అమ్మవారిని కొలుస్తారు. ఆరో రోజున అలిగిన బతుకమ్మకు నివేదన ఉండదు. మిగిలిన రోజుల్లో రకరకాల పదార్థాలను అమ్మకు నైవేద్యంగా సమర్పిస్తారు.


– ఎసికె. శ్రీహరి, m : 9849930145
e : ackvs08@gmail.com

# అంతరించే ప్రమాదంలో బావోబాబ్ చెట్టు



ఈ చెట్టు పేరు బావోబాబ్ (Baobab). ప్రధానంగా మడగాస్కర్‌లో కనిపించడంతో పాటు ఆస్ట్రేలియాలో కూడా కనిపిస్తుంది. ఇవి 1,000 సంవత్సరాలకు పైగా జీవించగలవు. కొన్ని చెట్లు 3,000 సంవత్సరాల వరకు బతుకుతాయి. ఈ చెట్ల భారీ కాండంలో వేల లీటర్ల నీరు నిల్వ అవుతుంది. కాబట్టి కరువులను తట్టుకుని నిలబడగలవు. బావోబాబ్ చెట్లను నివాసంగా, ఆహారంగా, మరియు ఔషధాల తయారీ కోసం ఉపయోగిస్తారు. ఈ చెట్లు అంతరించే ప్రమాదంలో ఉన్న జీవుల జాబితాలో (ఎన్‌డేంజర్డ్ లిస్ట్‌లో) ఉన్నాయి. ముఖ్యంగా అడన్‌సోనియా గ్రాండిడియరీ (Adansonia grandidieri) అనే రకం తీవ్రంగా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటోంది.

– దక్కన్‌న్యూస్
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com




# ఉమ్మడి విశాఖపట్నం జిల్లా శిలా మరియు ఖనిజ సంపద

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఉత్తర కోస్తా ప్రాంతం యొక్క ప్రముఖమైన ప్రదేశం. ఈ జిల్లా 13,140 చదరపు కిలోమీటర్లలో విస్తరించి యున్నది. ఈ జిల్లాకి ఈశాన్యంలో విజయనగరం జిల్లా, నైరుతిలో తూర్పుగోదావరి జిల్లా, ఉత్తరాన ఒడిస్సా, దక్షిణాన బంగాళాఖాత సముద్రం. విశాఖపట్నం నగరం రాష్ట్రంలోని అతిపెద్ద నగరం. ప్రముఖమైన ఓడరేవు, స్టీల్ ప్లాంట్ సింహాచల క్షేత్రం, అందమైన పర్యాటక స్థలాలు ఉండటం వల్ల, ఈ నగరం, జిల్లా ప్రాముఖ్యత సంతరించుకున్నది. చెన్నై-కోల్‌కతా రహదారి NH-7 ఈ నగరం ద్వారా వెళ్తుంది.

ఈ జిల్లా చాలా వరకు కొండ ప్రాంతంగా ఉంటుంది. అడవి ప్రాంతం కూడా ఎక్కువే. మరియు చాలా రగ్గడ్ టోపోగ్రఫితో కూడి వుంటుంది. ఈ జిల్లా కోస్తా ప్రాంతం కావడం, సముద్ర తీరాన పొడుగాటి, ఎత్తైన ఈస్టర్న్‌ఘాట్ కొండలు ఇక్కడి నుండి ఒడిస్సాలోకి విస్తరించాయి. దీని వల్ల కోస్టాల్‌ప్లేన్ చాలా తక్కువ వెడల్పుగా ఉంటుంది. అందుకే ఈ కోస్తా ప్రాంతాన్ని ఎరోశనల్ కోస్ట్‌గా గుర్తించబడినది. ఈ జిల్లాలోని ఎత్తైన ప్రాంతం 1645 మీటర్లు. తక్కువ ఎత్తుగల ప్రాంతం 29 మీటర్లు ఎం.ఎస్.ఎల్ పైన ఉండటం విశేషం. ఈ జిల్లాలోని ముఖ్య నదులు శారదా, తాండవా, గొస్తని వీటి ఉపనదులు. వీటి డ్రైనేజ్ నెట్ వర్క్ నీటి అవసరాలను పూర్తిచేస్తాయి. ఈ నదులన్ని దక్షిణానికి పారి సముద్రంలో కలిసిపోతాయి. వీటి డ్రైనేజ్ ప్యాటర్న్ సబ్ ప్యారిలెల్ నుండి సబ్ డెండ్రెటిక్‌గా ఉంటుంది.

ఈ ప్రాంతంలోని ముఖ్యమైన ల్యాండ్ ఫార్మ్స్ స్ట్రక్చరల్ రిడ్జ్స్, డెమీడేశన్‌ల హిల్స్, ప్లాటూస్, ఫ్లడ్ ప్లేన్స్, కోస్తా ప్రాంతంలో బీచ్ రిడ్జ్స్, టైడల్ ఫ్లాట్స్, లగూన్స్, ఎత్తైన స్కార్ప్స్, కేవ్స్, వేవ్‌కట్ టెర్రేసెస్ వగైరా స్ట్రక్చర్స్‌ని చూడగలము. ఈ జిల్లాలో ఉత్తర ప్రాంతంలో లోమీ సాయిల్, దక్షిణ ప్రాంతంలో సాండి సాయిల్ కోస్తా ప్రాంతంలో అల్లువియల్ మరియు సాండి సాయిల్స్‌ని చూడగలము. ఈ జిల్లాలోని ఉత్తర ప్రాంతాన్ని జోన్-Iగా మరియు దక్షిణ ప్రాంతాన్ని జోన్-IIగా నిర్ధారించారు. సీస్మోటెక్ టానిక్, స్టడీ ప్రకారం ఈ ప్రాంతం నియోటెక్ టానికల్‌గా ఏక్టివ్‌గా ఉన్నదన్న



బాక్సైట్ క్యాపింగ్స్ - చింతపల్లి, విశాఖపట్నం



కొండలైటీహిల్ - వాటా డ కొండ విశాఖపట్నంకి దక్షిణ ప్రాంతంలో



జినస్ సాండ్ స్టోన్ - తుగీదం, ఉత్తర భీమునిపట్నం, విశాఖపట్నం



వాల్కానిక్ యాశ్

విషయాన్ని కాటర్న్‌రి స్టడీస్ ద్వారా నిర్ధారించబడినది. ఈ జిల్లా యొక్క కోస్తా ప్రాంతం ప్రముఖమైన ఫాల్ట్ స్కార్ప్స్ ఉండటం ఇది అఫ్‌లిఫ్ట్ అయినట్టు ఆధారాలు సేకరించడం వల్ల ఈ ప్రాంతాన్ని ఫాల్ట్ కంట్రోల్డ్ కోస్ట్ అని నిర్ధారించబడినది.

ఈ జిల్లాలో ఈస్ట్రర్న్ ఘాట్ మొబైల్ బెల్ట్‌కు చెందిన శిలలు కొండలైట్, చార్నొకైట్ మిగ్మటైట్ గ్రూప్స్‌కు చెందిన ఈస్టర్న్ ఘాట్ సూపర్ గ్రూప్‌కు చెందినది. కొండరైట్ గ్రూప్‌లో క్వార్ట్‌జ్ ఫెల్స్‌పార్, గార్నెట్ - సిల్లిమనైట్ గ్రాఫైటీ నైస్, కాల్క్ గ్రానులైట్ వీటిలో కార్ట్‌జైట్ అక్కడ కూడా రిడ్జస్, బాండ్స్ రూపంలో ఉన్నవి. చార్నొకైట్ గ్రూప్‌లో ఏసిడి, ఇంటర్‌మీడియట్, బేసిక్ వెరైటీస్‌ని చూడగలము. మిగ్మటైట్ గ్రూప్‌లో పర్ఫిరో బ్లాస్టిక్ గ్రానైట్‌నైస్, లెప్టినైట్, గార్నెట్ బయోటైటీ హైపర్స్ తీన్ నైస్, క్వార్ట్‌జో ఫెల్స్ పాతిక్ నైస్ మరియు ఇతర హైబ్రీడ్ శిలలు కలవు. బాక్సైట్, లాటరైటీలని ఎన్నో ఫ్లాట్ టాప్ కొండలపైన చూడగలము. ఇవి చాలా వరకు కొండలైట్స్‌పైన ఏర్పడతావి. ఇవి 1000 మీటర్ల ఎత్తైన కొండలపైన చూడగలము.

గోండ్‌వానా సూపర్‌గ్రూప్‌కు చెందిన తిరుపతి సాండ్‌స్టోన్ ఆర్క్‌యన్ క్రిస్టలైన్స్‌పైన అన్ కన్ఫర్మిబుల్‌గా ఉన్నది. ఇది తీరానికి దగ్గరగా ఉన్నది.

క్వాటరనెరి సెడిమెంట్స్, ఫ్లూవియల్ మరియు మెరైన్ కోవకు చెందినవి. నదులకు ఇరు ప్రక్కన, ఫ్లువియల్ ఫ్లడ్ ప్లేన్స్‌కు చెందిన సెడిమెంట్స్, తీరానికి దగ్గరగా మెరైన్ పెడిమెంట్స్‌ని చూడగలం. భీమునిపట్నం వద్ద చాలా ప్రఖ్యాతి చెందిన ఎర్రమట్టి దిబ్బలను చూడగలము. ఇది బ్యాడ్ ల్యాండ్‌గా గుర్తించబడినది. ఇవి ఏర్పడిన విధానం గల్లి ఎరోశన్ వల్ల. ఈ దిబ్బలు రెడ్ సాండ్స్‌తో కూడి వుంటుంది. జియోలాజికల్‌గా దీనిని పేలియొడ్యూన్ అని నిర్ధారించిరి. దీని వయస్సు OSL మెదడ్ ద్వారా 55,000 సంవత్సరాలుగా నిర్ణయించబడినది. ఈ అసాధారణ ఎర్ర మట్టి దిబ్బలను 2014లో GSI ప్రతిపాదన మేరకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ జియో హెరిటేజ్ సైట్‌గా గుర్తింపబడినది.

గోస్తని నదికి ఈశాన్యంలో సముద్రతీరాన్ని ఆనుకొని 10 మీటర్ల ఎత్తుగల, 3 కి.మీ. పొడవుతో క్వాటర్‌నెరికి చెందిన ఫెరుజినస్ సాండ్‌స్టోన్ వెవ్ కట్ టెర్రెస్, నియోటెక్టానిక్ ఎక్టివిటికి నిదర్శనంగా నిలుస్తుంది. దీని వయస్సు OSL మదడ్ ద్వారా 77,000 సంవత్సరాలుగా నిర్ధారించారు. ఇది రాష్ట్రంలోని క్వార్‌నెరికి చెందిన ఓల్డెస్ట్ యూనిట్. ఇది కాకుండా నదుల చాలా పై ప్రాంతంలో వల్కానిక్ యాశ దొరుకుతుంది. దీనిని సుమాత్ర దీవిలోని తోబా వోల్కా నిజంతో కొరిలేటి చేస్తారు. దీని వయస్సు 75,000 సంవత్సరాలుగా నిర్ధారించారు.

ఈ జిల్లాలోని శిలలో రీజినల్ ఫోలియేషన్ NE-SW నుండి NW-SE ఈ దిశలలో చూడగలం. ఈ శిలలో మేజర్ ఇసోక్లైనల్ ఫోల్డ్ దానిపై క్రాస్ ఫోల్డ్‌లను చూడగలం. ఈ ప్రాంతంలో NE-SW మరియు NW-SE దిశలలో ఫాల్ట్‌లు, లినియమెంట్స్‌ను చూడగలం.

**ఖనిజ సంపద**

**బాక్సైట్ :**

బాక్సైట్ క్యాప్పింగ్స్ రకరకాల సైజ్‌లో విస్తరించి యున్నది కొండలపైన ముఖ్యమైన బాక్సైట్ నిక్షేపాలు అరకు ప్రాంతంలో గాలికొండ, చిత్తంగొండి కొండలపై, చింతపల్లి ప్రాంతంలో గూడెం, సప్పర్లలో. అల్యుమినియం ఇందులో 45% నుండి 51%లో యున్నది. ఇవి కాకుండా మినిములూరు, అనంతగిరి ప్రాంతంలో కూడా బాక్సైట్ నిక్షేపాలు కలవు.

**అపటైట్**

అపటైట్ నిక్షేపాలు కాశీపట్నం ప్రాంతంలో వీన్స్ రూపంలో కలదు. ఇవి కొండలైట్ చార్నొకైట్ కాన్‌టాక్ట్‌లో దొరుకుతుంది. కనీసం 110 వీన్స్‌ని సీతారామపురం, సీతంపేట, రెగువలస బుడి ప్రాంతాలలో గుర్తించారు. ఇందులో నుండి 30 వీన్స్ లాభదాయకం అని నిర్ధారించారు. ఈ వీన్స్ NNW-SSE నుండి NW-SE దిశలో $60^0$-$70^0$ డిప్‌తో కలవు. ఈ వీన్స్ 600 మీరట్ల పొడవు 2.5 మీటర్ల వెడల్పుగా వున్నవి. దీని రిజర్వు 0.2999 మిలియన్ టన్నులు మరియు $P_5O_5$ శాతం 35% నుండి 42.5%గా 50 మీటర్ల లోతు వరకు కలవు. దీన్ని చాలా వరకు ఫర్టిలైజర్స్‌లో ఉపయోగిస్తారు.

**గ్రాఫైట్ :**

గ్రాఫైట్ కొండలైట్ గ్రూప్ శిలల్లో వీన్స్, స్పెక్స్, స్ట్రీక్స్, లెన్సెస్ రూపంలో కలదు. దీన్ని కుప్పమెట్ట, లంకలపాలెం, పెద్దలపాలెం, మరుపాలెం, తడపాల, సివలింగాపురం, పాదికొండ ప్రాంతాలలో చూడగలం. దీన్ని క్రూసిబుల్స్ తయ్యారిలో, లూబ్రికెంట్‌గా, బ్యాటరీ సెల్స్‌లో, ఎలక్ట్రికల్ పరిశ్రమలో వాడతారు.

**జెమ్‌స్టోన్స్ :**

సిల్లిమనైట్ యొక్క జెమ్ వెరైటీ అరకు ప్రాంతంలో కొండలైటీలో, మైగ్మటైసీడ్ శిలలో దొరుకును. పాడేరు ప్రాంతంలో కొండలైటీలో చూడగలము. నిట్టిమడి, కొంటిల్ ప్రాంతాలలో మిగ్మటైస్ట్ కొండలైట్‌లో దొరుకును.

**వర్మికులైట్ :**

వర్మికులైట్ అపటైట్ వీన్స్ యొక్క మార్జిన్స్‌లో కాశీపట్నం ప్రాంతంలో దొరుకును. దీన్ని సిమెంట్ కాంక్రీట్, జిప్సం ప్లాస్టర్స్, ఎయిర్ కండిషనర్స్ మరియు ఫైర్ ప్రూఫ్‌లో ఉపయోగిస్తారు.

**మాగ్నటైట్ :**

మాగ్నటైట్ అపటైట్ వీన్స్‌తో కూడి వున్నది. కాశీపట్నం ప్రాంతంలో వీటి నిక్షేపాలు 30 మీటర్ల లోతు వరకు ఉన్నట్టు నిర్ధారించారు.

**మార్బుల్ / క్రిస్టలైన్ లైమ్‌స్టోన్ :**

మాగ్నీషియమ్ మార్బుల్ క్రిస్టలైన్ లైమ్‌స్టోన్ బ్యాండ్స్ రూపలో బొర్రా ప్రాంతంలో దొరుకును. దీన్ని ఫిల్లర్, మైల్డ్ అబ్రేసివ్‌గా, మాగ్నీషియం లైమ్ తయ్యారిలో ఉపయోగిస్తారు.

**ఫ్లాగోఫైట్ మైకా :** ఇది బొర్రా ప్రాంతంలో గ్రానైటిక్ శిలలో దొరుకును. దీన్ని హీట్ రెసిస్ టెంట్‌గా ఉపయోగిస్తారు.



బ్లాక్ సాండ్ – ఉత్తర భీమునిపట్నం, విశాఖపట్నం



చర్నో కైటీ



బొర్రా కేవ్స్ – విశాఖపట్నం



ఎర్రమట్టి దిబ్బలు – భీమునిపట్నం, వైజాగ్

**ఓఖర్:**


ఓఖర్ నిక్షేపాలు సారంగి, అరకు పరిసరాలలో నాలా సెక్షన్‌లో, కొండల దిగువ ప్రాంతప్రాంతాలలో ఉన్నవి. దీనిని డిస్టెంబర్ మరియు పేంట్‌లో ఉపయోగిస్తారు.

**బీచ్ సాండ్స్:** భీమునిపట్నం వద్ద బ్లాఖ్ సాన్డ్స్ పుష్కలంగా వున్నవి. వీటిలో ఎక్కువ మొత్తంలో టైటానీయం ఖనిజం ఇల్మనైట్, కొంత రూటైల్, తోరియం ఖనిజం మొనజైటీ మరియు ఇనుము ఖనిజం మాగ్నటైటీ కలదు. ఇక్కడ కాకుండా తుగిడం దగ్గర కూడా ఈ ఖనిజాలను చూడగలం.

– కమతం మహేందర్ రెడ్డి
m : +91 90320 12955
e : mahikam.reddy0@gmail.com

# హరప్పా సంస్కృతి శతాబ్ది ఆవిష్కరణ

సెప్టెంబర్ 20వ తేదీ ఆధునిక భారతదేశ చరిత్రలో ఒక చారిత్రాత్మక తేది. సరిగ్గా వంద సంవత్సరాల క్రితం నాటి ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ జాన్ మార్షల్ పురాతన కాలంతో పోల్చదగిన కొత్త నాగరికతను కనుగొన్నట్లు ప్రకటించారు. ఇలస్ట్రేటెడ్ లండన్ న్యూస్ 1924లో ఈజిప్ట్, మెసొపొటేమియా మరియు సౌత్-వెస్ట్ ఇరాన్ లేదా ఎలాం నాగరికతలు. హరప్పా మరియు మొహంజొదారో 20వ శతాబ్దపు రెండవ దశాబ్దపు ప్రారంభ సంవత్సరాల్లో దయా రామ్ సహానీ మరియు రఖల్ దాస్ బెనర్జీ ద్వారా త్రవ్వకాలు జరిగినప్పటికీ. 400 మైళ్ల దూరం ఉన్నప్పటికీ వాటి మధ్య ఉన్న అద్భుతమైన సారూప్యత పురావస్తు శాస్త్రజ్ఞుల దృష్టిని ఆకర్షించింది. అలాగే ఈ విశిష్టత రెండూ ఒక విశిష్ట సంస్కృతికి చెందిన స్థావరాలు అని ప్రకటించడానికి వారికి నమ్మకాన్ని కల్గచేసింది. సైట్ యొక్క మరొక ప్రత్యేక లక్షణం దాని ప్లాన్డ్ టౌన్ ప్లానింగ్ మరియు డ్రైనేజ్ సిస్టమ్. ఈ రెండు లక్షణాలు ఏ ఇతర ప్రాచీన సంస్కృతిలోనూ ఇంతవరకు గుర్తించబడలేదు.



**ఆర్ఎస్ శర్మ ఈ క్రింది మాటల్లో చాలా అందంగా వర్ణించారు:**

దీర్ఘచతురస్రాకార ఇళ్ళు ఇటుకలతో కప్పబడిన స్నానపు గదులు మరియు బావులు వాటి మెట్ల మార్గాలు అన్ని హరప్పా నగరాల్లో కనిపిస్తాయి. అయితే పశ్చిమ ఆసియాలోని ఇతర నగరాల్లో ఇటువంటి పట్టణ ప్రణాళిక స్పష్టంగా కనిపించదు. పురాతన కాలం అటువంటి అద్భుతమైన నిర్మించారు. నాసోస్ లోని క్రీట్‌లోని డ్రైనేజీ వ్యవస్థ తప్ప, లేదా పశ్చిమాసియా ప్రజలు హరప్పాన్‌ల వలె కాలిన ఇటుకలను ఉపయోగించడంలో నైపుణ్యాన్ని ప్రదర్శించలేదు (ఇండియాస్ ఏన్షియంట్ పాస్ట్, 2021, p87). అదేవిధంగా, దాని ప్రత్యేక పట్టణ స్వభావం మరియు హరప్పా సంస్కృతి యొక్క ఆవిష్కరణ చరిత్ర ఆసక్తికరంగా ఉంటుంది. ఇది హరప్పా 1829ని సందర్శించిన చార్లెస్ మాసన్ యొక్క ప్రయత్నాలతో ప్రారంభమవుతుంది. మరియు అలెగ్జాండర్ పోరస్‌లను ఓడించిన ప్రదేశాన్ని సంగాలతో గుర్తించాడు. దాని కొనసాగింపుగా అలెగ్జాండర్ బర్న్స్ మరియు అలెగ్జాండర్ కన్నింగ్‌హామ్ కూడా సందర్శించారు. కన్నింగ్‌హామ్ కనీసం మూడు సార్లు హరప్పాను సందర్శించాడు మరియు అతను దానిని ఒక ముఖ్యమైన పురాతన స్థావరంగా గుర్తించాడు. తరువాత దయా రామ్ సహాని ఈ స్థలాన్ని సందర్శించి చివరకు హరప్పాను త్రవ్వి దాని ప్రాముఖ్యతను స్థాపించాడు.

– దక్కన్‌న్యూస్, m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# వరద బాధితులకు సింగరేణి ఉద్యోగుల సాయం

తెలంగాణ వరద బాధితుల కోసం సింగరేణి కాలరీస్ అధికారులు, ఉద్యోగులు తమ ఒకరోజు బేసిక్ జీతం 10.25 కోట్లను విరాళంగా ప్రకటించారు. ఈ చెక్కును గురువారం (సెప్టెంబర్ 19) రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు సమక్షంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎనర్జీ సెక్రటరీ రోనాల్డ్ రోస్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల నాయకులు, అధికారుల సంఘం నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, జనక్ ప్రసాద్, లక్ష్మీపతి గౌడ్ తదితరులు అందజేశారు. తెలంగాణ వరద ప్రజల కోసం రాష్ట్రం ప్రభుత్వం తీసుకుంటున్న సహాయ చర్యలకు తోడ్పాటుగా ఈ వితరణ ప్రకటిం చామని, గతంలో కూడా పలు ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు విరాళాలు అందజేశామని వారు పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులు, అధికారులు తమ ఒకరోజు బేసిక్ వేతనాన్ని వరద బాధితుల కోసం విరాళంగా అందజేయడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తమ అభినందనలు తెలిపారు.



రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ కె.రాజ్ కుమార్, ఐఎన్టీయూసీ జనరల్ సెక్రటరీ సి.త్యాగరాజన్, అధికారుల సంఘం జనరల్ సెక్రటరీ నర్సింహులు, జీఎం(కో ఆర్డినేషన్) ఎస్.డి ఎం.సుభాని, జీఎం(పర్సనల్) కవితా నాయుడు పాల్గొన్నారు.

–చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్
ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్



# చోళ ఆలయాలు

**ఉనికి:** తమిళనాడు, భారత్

**ప్రకటన తేదీ:** 1987, ఎక్స్ టెన్షన్ 2004

**కేటగిరీ:** సాంస్కృతికం (గ్రూప్ ఆఫ్ మాన్యుమెంట్స్)

**సార్వత్రిక విలువ:**

ఈ సైట్ సామాన్య శకం 11-12వ శతాబ్ది కాలానికి చెందిన, చోళ సామ్రాజ్యపు మూడు గొప్ప ఆలయాలను కలిగి ఉంది. గంగైకొండచోళీశ్వరమ్ వద్ద బృహదీశ్వరాలయం ఉంది. ఇది 53 మీటర్ల ఎత్తయిన గాలిగోపురాన్ని కలిగిఉంది. గోపురానికి గల మూలలు, పై దిశగా చెక్కి ఉండే నిర్మాణం ఈ గోపురం ప్రత్యేకతలుగా ఉన్నాయి. తంజావూరు లోని బృహదీశ్వరాలయం గోపురంతో పోలిస్తే నిర్మాణంలో, ఎత్తులో, దానికి కాస్తంత భిన్నంగా ఉంటుంది. దారాసురం లోని ఐరావతేశ్వర ఆలయం 24 మీటర్ల గాలిగోపురం, శివుడి రాతి విగ్రహాన్ని కలిగిఉంటుంది. కళ, ఆర్కిటెక్చర్ రంగాల్లో చోళులు సాధించిన అద్భుత విజయాలకు ఈ ఆలయాలు నిదర్శనాలుగా ఉంటాయి.



**ప్రాథమ్యాలు:** (i), (ii), (iii), (iv)

(i): ఈ మూడు ఆలయాలు కూడా ద్రావిడ ఆలయ రకానికి చెందిన వాస్తు శిల్ప కళావైభవానికి అద్దం పడుతాయి.

(ii): తంజావూరు లోని బృహదీశ్వరాలయం చోళ ఆలయాలకు అత్యంత గొప్ప నిదర్శనంగా నిలిచింది. మిగితా రెండు ఆ తరువాతి స్థానాల్లో నిలిచాయి.

(iii): ఈ మూడు ఆలయాలు కూడా ఉత్కృష్టతకు నిదర్శనంగా నిలిచాయి. చోళ సామ్రాజ్యం వాస్తు శిల్ప కళా వైభవానికి, దక్షిణ భారతదేశంలో తమిళ



నాగరికతకు తార్కాణాలుగా ఉన్నాయి.

(iv): ఈ ఆలయాలు చోళ భావజాలానికి తిరుగులేని ప్రాతినిథ్యం వహిస్తున్నాయి.

చోళ సామ్రాజ్యం దక్షిణ భారతదేశంలో రూపుదిద్దుకుంది. సామాన్య శకం తొమ్మిదో శతాబ్దం నుంచి పదమూడో శతాబ్దం దాకా విలసిల్లింది. హిందూ మహాసముద్రం నుంచి ఆగ్నేయాసియాలోని ప్రాంతాల వరకూ తన ప్రభావాన్ని విస్తరించింది. సాహిత్యం, కళలు, ఆర్కిటెక్చర్ రంగాలను అమితంగా ఆదరించడంలో చోళ చక్రవర్తులు ప్రసిద్ధి చెందారు. చోళ చక్రవర్తులు సుమారుగా 300 దాకా ప్రసిద్ధ ఆలయాలను నిర్మించారు. చోళ ఆలయ శిల్పకళ అత్యున్నత సాంకేతిక, కళానైపుణ్యాలు కలిగిఉంది. మరీ ముఖ్యంగా ఈ మూడు ఆలయాలు వాటి తిరుగులేని సాంకేతిక, కళా నైపుణ్య విలువలకు పేరొందాయి.



ప్రసిద్ధ చోళ చక్రవర్తి రాజరాజ 1 సుప్రసిద్ధ బృహదీశ్వరాలయాన్ని నిర్మించాడు. శివుడు కొలువైన ఈ ఆలయం పదకొండో శతాబ్దం నాటిది. ఈ ఆలయంలో ఉన్న శాసనాలను బట్టి నాటి చోళ రాజులు ఆలయాలకు ఎంతో ఉదారంగా దానధర్మాలు చేసినట్లుగా తెలుస్తోంది.

తంజావూరులో ఉన్న ఆలయ కాంప్లెక్స్ కందాకాలు, ప్రవేశద్వారాలను కలిగిఉంది. ప్రధాన ఆలయం వరుసగా ఎన్నో మండపాలను కలిగిఉంది. నంది మండపం, ముఖ మండపం, మహా మండపం, అర్ధ మండపం, అంతరాలయం, గర్భగృహాలు వీటి ఉన్నాయి. వీటికి తోడుగా పొడుగాటి వసారాలు ఉన్నాయి. దీని గొప్పదనం దీన్ని భారతదేశంలో ఇప్పటి వరకూ ఉన్న ఆలయాల్లో అత్యంత గొప్పదిగా చేసింది. ఆలయ శిఖరం ఎత్తు 61 మీటర్లు. ఇది 13 అంతస్తులతో ఉంటుంది. శిఖరం పై భాగంలో 25 టన్నుల బరువైన అమల్క ఉంటుంది. ఇది 81 టన్నుల బరువైన గ్రానైట్ శిలపై ఉండడం విశేషం. ఈ శిలలను ఎక్కడో ఉన్న క్వారీలనుంచి ఏనుగుల సాయంతో దొర్లించుకుంటూ తీసుకువచ్చారని, వాటిని శిఖరంపైకి చేర్చేందుకు ఎంతో మంది కార్మికులు పని చేశారని, సుమారుగా 6.5 కిలోమీటర్ల దూరం నుంచి తాత్కాలిక ర్యాంప్ ఏర్పాటు చేసి ఉంటారని భావిస్తున్నారు. ఇది ఆనాటి ఇంజినీరింగ్ నైపుణ్యాలకు తార్కాణంగా నిలుస్తోంది. బృహదీశ్వరాలయం అక్కడ ఉన్న శిల్పాలకు, గర్భగృహ వృత్తాకార మార్గం లోని పెయింటింగ్స్‌కు కూడా బాగా పేరొందింది.

రాజరాజ1 కుమారుడైన రాజేంద్ర1 తంజావూరుకు వాయువ్యంగా 55 కిలోమీటర్ల దూరంలో మరో రాజధాని నగరాన్ని నిర్మించాడు. దాన్ని గంగైకొండ చోళేశ్వరంగా వ్యవహరించారు. గంగను జయించిన చోళుడి నగరం అని ఆ పదానికి అర్థం.

ఇక్కడ ఉన్న ఆలయం కూడా చోళ శిల్పకళకు బాగా ప్రఖ్యాతి చెందింది. ఆలయం దక్షిణ భాగంలోని చండేశ్ అనుగ్రహ విగ్రహం బాగా ప్రసిద్ధి చెందింది. నటరాజు, సరస్వతితో ఉన్న బ్రహ్మ, సావిత్రి, మహిషాసుర మర్దిని, నాట్యం చేస్తున్న గణేశుడి విగ్రహాలు కూడా ఆలయ గోడలపై ఉన్నాయి.

చోళుల పాలనకు దారాసురం కూడా మరో ప్రధాన కేంద్రంగా ఉంది. చోళులకు సంబంధించి ప్రసిద్ధి చెందిన మూడో ఆలయం కూడా ఇక్కడే ఉంది. ఇక్కడ కొలువుదీరింది ఐరావతేశ్వర. దీన్ని నిర్మించింది రెండో రాజరాజ. పన్నెండో శతాబ్ది మధ్య కాలంలో దీన్ని నిర్మించారు. మిగితా రెండింటితో పోలిస్తే, ఇది కాస్తంత చిన్నది. ఈ ఆలయం చుట్టూరా భారీ ప్రాకారం ఉంది. ఇక్కడ ఉన్న మండపం మిగితా రెండింటి మాదిరిగా గాకుండా, చెక్కిన స్తంభాలతో కూడిన మందిరంగా, రెండు భాగాలుగా ఉంటుంది. అగ్ర మండపం తరువాత అర్ధ మండపం ఉంటుంది. ఆ తరువాత అంతరాళం, గర్భగృహ ఉంటాయి. అగ్ర మండపం వద్ద గుర్రాలు లాగుతున్న రథాన్ని చెక్కారు. లింగోద్భవ శిల్పం బాగా ప్రసిద్ధి చెందింది. కైలాసాన్ని కుదిపేస్తున్న రావణుడి శిల్పం కూడా ఉంది. శివపార్వతులు, నటరాజ, యోగా భంగిమల శిల్పాలు బాగా పేరొందాయి.

ఈ మూడు చోళ ఆలయాలు కూడా ఏఎస్ఐ రక్షణ, నిర్వహణలో ఉన్నాయి.

– జాహ్నవీజ్ శర్మ

అనువాదం : ఎస్. వంశీ



## తెలంగాణా రాష్ట్ర

# "ముడమాల మెగాలిథిక్ మెన్హిర్స్ సైట్"పై

## ఢిల్లీలో UNESCO SESSION సైడ్ ఈవెంట్‌గా ICOMOS నిర్వహించింది

ICOMOS భారతదేశం "ముడమాల మెగాలిథిక్ మెన్హిర్స్ సైట్" Department of Heritage Telangana సైట్‌పై హెరిటేజ్ కన్జర్వేషన్ సెమినార్‌ని నిర్వహించింది. భారతదేశం, IGNCA, న్యూఢిల్లీలో జూలై 24, 2024 సాయంత్రం, హైదరాబాద్‌కు చెందిన డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ (DHAT) సహకారంతో ICOMOS ఇండియా నిర్వహించిన ఒక ముఖ్యమైన కార్యక్రమం కోసం న్యూ ఢిల్లీలోని ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ (IGNCA)లో హెరిటేజ్ ఔత్సాహికులు మరియు నిపుణులు సమావేశమయ్యారు. ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశంలో UNESCO 46వ సెషన్ సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమం తెలంగాణలోని ముడుమల్ మెగాలిథిక్ మెన్హిర్స్ సైట్ పరిరక్షణ ప్రయత్నాలపై దృష్టి సారించింది, ఇది అపారమైన చారిత్రక మరియు సాంస్కృతిక విలువ. శ్రీమతి A. వాణీ ప్రసాద్, IAS, తెలంగాణ ప్రభుత్వ యువజన అభ్యున్నతి, పర్యాటక, సాంస్కృతిక మరియు క్రీడల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగారిని ఆహ్వానించింది.



### హెరిటేజ్ డైలాగ్ మరియు ఎక్స్ఛేంజ్ యొక్క సాయంత్రం

ఈ సమావేశంలో ICOMOS ఇండియా, ICCROM, INTACH, UNESCO వరల్డ్ హెరిటేజ్ సెంటర్ మరియు ఇతర వారసత్వ-సంబంధిత సంస్థల ప్రతినిధులు & సభ్యులు పాల్గొన్నారు. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ASI) నుండి సీనియర్ అధికారులు, IGNCA నుండి నిపుణులు ప్రముఖంగా పాల్గొన్నారు.

### ICOMOS భారతదేశం యొక్క విజన్‌లో ఒక సంగ్రహావలోకనం

ICOMOS ఇండియా ప్రెసిడెంట్ డా. రిమా హూజా ఈ కార్యక్రమాలను ప్రారంభించారు. భారతదేశం యొక్క గొప్ప వారసత్వాన్ని పరిరక్షించడంలో సంస్థ యొక్క నిబద్ధతను ఆమె ఎత్తిచూపారు మరియు నిపుణుల మధ్య సంభాషణ మరియు సహకారాన్ని పెంపొందించడంలో ఇలాంటి సంఘట నల ప్రాముఖ్యత గురించి చర్చించారు. డాక్టర్ హూజా, ICOMOS భారతదేశం యొక్క మొట్టమొదటి ఎన్నికైన ప్రెసిడెంట్ అయిన డాక్టర్ రోహిత్ జిగ్యాసును, ICOMOS సంస్థను పునరుద్ధరించడంలో మరియు దాని మిషన్‌ను ముందుకు నడిపించడంలో అతని కీలక పాత్రను వివరించారు.

తెలంగాణ Department of Heritage Telanganaకు చెందిన "ముడుమాల్ మెగాలిథిక్ మెన్హిర్స్ సైట్" యొక్క ప్రదర్శనకు ఈ కార్యక్రమం వేదికను అందించింది, ఇది విస్తృతమైన రక్షణ, పరిశోధన & పరిరక్షణ అధ్యయనంలో ఉంది. పురాతన రాతి నిర్మాణాల ద్వారా వర్గీకరించబడిన ఈ సైట్ ఆర్కియో ఖగోళ ముఖ్యమైన & చారిత్రక విలువను కలిగి ఉంది మరియు డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ (DHAT) నేతృత్వంలోని పరిరక్షణ ప్రయత్నాలకు కేంద్రంగా ఉంది. తెలంగాణ వారసత్వ శాఖ ఆధీనంలోని సైట్. ఈ ప్రదర్శన సైట్ యొక్క ప్రాముఖ్యత, కొనసాగుతున్న పరిరక్షణ ప్రయత్నాలు మరియు UNESCO ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందే సామర్థ్యాన్ని ప్రదర్శించడం లక్ష్యంగా పెట్టుకుంది.

### జోనల్ ప్రదర్శనలు మరియు వారసత్వ పరిరక్షణ కార్యక్రమాలు

పరిచయ వ్యాఖ్యలను అనుసరించి, ఈ కార్యక్రమంలో వివిధ ICOMOS ఇండియా ప్రతినిధుల నుండి జోనల్ ప్రదర్శనలు ఉన్నాయి. ఈ ప్రదర్శనలు దేశంలోని వివిధ ప్రాంతాలలో చేపడుతున్న వారసత్వ పరిరక్షణ కార్యకలాపాలపై అంతర్దృష్టులను అందించాయి.



ICOMOS ఇండియా వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి షాలినీ దాస్‌గుప్తా మరియు IGNCA యొక్క HoD కన్జర్వేషన్ డాక్టర్ అచల్ పాండ్యా కూడా ఈ సమావేశంలో ప్రసంగించారు. వారి చర్చలు ICOMOS భారతదేశం మరియు ఇతర వారసత్వ సంస్థల మధ్య సహకార ప్రయత్నాలపై దృష్టి సారించాయి, వారసత్వ సంరక్షణ యొక్క భాగస్వామ్య లక్ష్యాన్ని సాధించడంలో భాగస్వామ్యాల ప్రాముఖ్యతను నొక్కిచెప్పాయి.

### ది ముడుమల్ మెగాలిథిక్ మెన్హిర్స్ సైట్: ఎ కేస్ స్టడీ ఇన్ కన్జర్వేషన్

ముడుమల్ మెగాలిథిక్ మెన్హిర్స్ సైట్‌పై వివరణాత్మక ప్రదర్శన సాయంత్రం హైలైట్. ఎర్ నేతృత్వంలోని ప్రదర్శన. ఈ కార్యక్రమంలో DHAT చైర్మన్ వేదకుమార్ మణికొండ, ప్రొఫెసర్ కె.పి. రావు, హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని గౌరవ ఆచార్యుడు, సైట్ యొక్క చారిత్రక ప్రాముఖ్యత మరియు దానిని పరిరక్షించడానికి జరుగుతున్న ప్రయత్నాలపై లోతైన రూపాన్ని అందించారు. తెలంగాణలో ఉన్న ఈ ప్రదేశం వేల సంవత్సరాల నాటిదని నమ్ముతున్న అనేక మెగాలిథిక్ నిర్మాణాలకు నిలయం. ఈ మెన్హిర్లు, లేదా పెద్ద నిలువు రాళ్లు, శ్మశాన వాటికలకు గుర్తులుగా సహా వివిధ ప్రయోజనాల కోసం పనిచేసినట్లు భావిస్తున్నారు.

ప్రదర్శనలో పోస్టర్లు మరియు విజువల్ మెటీరియల్‌ల ప్రదర్శన కూడా ఉంది, ఇది సైట్ యొక్క ప్రత్యేక లక్షణాలను మరియు వాటిని సంరక్షించడానికి చేస్తున్న ఖచ్చితమైన పనిని వివరించింది. ప్రొఫెసర్ GSV సూర్యనారాయణ మూర్తి, కన్జర్వేషన్ ఆర్కిటెక్ట్, UNESCO తాత్కాలిక జాబితా కోసం ప్రపంచ వారసత్వ నామినేషన్‌కు దరఖాస్తును పంపించిన తీరును తెలిపారు. ఇది మూడు సంవత్సరాలుగా తయారీలో ఉంది. ముడుమల్ మెగాలిథిక్ మెన్హిర్స్ సైట్ కోసం యునెస్కో ప్రపంచ వారసత్వ హోదాను పొందే దిశగా ఈ అప్లికేషన్ ఒక ముఖ్యమైన దశను సూచిస్తుంది, ఇది ప్రపంచ స్థాయిలో దాని రక్షణ మరియు గుర్తింపును నిర్ధారించే హోదా.

### ఇంటరాక్టివ్ చర్చలు మరియు నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్

ఈవెంట్‌లో ఇంటరాక్టివ్ సెషన్ కూడా నిర్వహించారు. హాజరైనవారు నేరుగా స్పీకర్‌లతో నిమగ్నమవ్వడానికి వీలు కల్పిస్తుంది. ఈ సెషన్ పాల్గొనేవారికి ప్రశ్నలు అడగడానికి, అంతర్దృష్టులను పంచుకోవడానికి మరియు భారతదేశంలో వారసత్వ పరిరక్షణకు సంబంధించిన సవాళ్లు మరియు అవకాశాల గురించి చర్చించడానికి అవకాశం కల్పించింది. పరిరక్షణ ప్రయత్నాలలో స్థానిక కమ్యూనిటీలకు మరింత అవగాహన మరియు ప్రమేయం అవసరం, అలాగే వారసత్వ ప్రదేశాలను సంరక్షించడంలో స్థిరమైన అభ్యాసాల యొక్క ప్రాముఖ్యతను చర్చ హైలైట్ చేసింది.

### ధన్యవాదాలు మరియు ముగింపు విందు

కార్యక్రమం ముగియడంతో, ICOMOS ఇండియా సెక్రటరీ నితిన్ R. సిన్హా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించినందుకు కార్యకర్తలు, వక్తులు, నిర్వాహకులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

### ముందుకు చూస్తున్నాను

IGNCAలో జరిగిన ఈ కార్యక్రమం కేవలం వారసత్వ నిపుణుల కలయిక మాత్రమే కాదు, భారతదేశం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించే భాగస్వామ్య బాధ్యతను పునరుద్ఘాటించింది. చర్చలు మరియు ప్రదర్శనలు వారసత్వ పరిరక్షణ లక్ష్యాలను సాధించడంలో సహకారం, పరిశోధన మరియు నిరంతర ప్రయత్నాల యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పాయి.

రాబోయే నెలల్లో, యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా కోసం ముడుమల్ మెగాలిథిక్ మెన్హిర్స్ సైట్‌ను ప్రతిపాదించడంతో పాటు, దేశవ్యాప్తంగా ఉన్న ఇతర వారసత్వ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంపై దృష్టి కేంద్రీకరించబడుతుంది. ఈ ఈవెంట్ భవిష్యత్ సహకారాలకు వేదికను ఏర్పాటు చేసింది మరియు భవిష్యత్తు తరాలకు గతాన్ని భద్రపరచడానికి పాల్గొన్న వారందరి సంకల్పాన్ని బలోపేతం చేసింది. దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఛైర్మన్ Er. వేదకుమార్ మణికొండ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు టూరిజం శాఖ ఈ అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

– జి.ఎస్వీ. సూర్యనారాయణ మూర్తి
m : 98493 47322
e: archprofsurya@gmail.com

# చింతచెట్టు కింద పాఠాలతో హైదరాబాద్ అభివృద్ధి

(ఎఫ్‌బిహెచ్, ఛైర్మన్ మణికొండ వేదకుమార్ ఆంధ్రజ్యోతి తెలుగు దినపత్రికకు రాసిన వ్యాసం యథాతంగా)

సెప్టెంబర్ 28 ఈ తేదీ రాగానే 1908లో హైదరాబాద్‌ను ముంచెత్తిన వరదలే గుర్తుకొస్తాయి. అప్పట్లో ఈ వరదలు నాటి నగరంలో అధికభాగాన్ని జలమయం చేశాయి. వేలాది మందిని నిరాశ్రయులుగా మార్చాయి. అఫ్జల్ గంజ్ పార్క్ (నేడు ఉస్మానియా ఆసుపత్రిలో భాగం)లో ఉన్న ఓ చింత చెట్టు నాటి జ్ఞాపకాలను నేటికీ గుర్తు చేస్తూనే ఉంటుంది. ఈ ఏడాది సైతం సెప్టెంబర్ 28న 10.30 గంటలకు ఈ చింతచెట్టు కింద జరిగే సమావేశం ఒకనాటి బీభత్సాన్ని గుర్తు చేసుకుంటూ, నేటి నగరాభివృద్ధికి నిపుణులు చేసే సూచనలకు వేదిక కానున్నది.

1908లో మూసీ నదికి వచ్చిన వరద కనివిని ఎరుగనిది. మరో మూడేళ్లకు చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ గద్దెనెక్కారు, సమస్యను గుర్తించారు. సిటీ ప్లాన్ రూపొందించాలని సంకల్పించారు. 1914లో సిటీ ఇంప్రూవ్‌మెంట్ బోర్డు (సిఐబి) ఏర్పాటు చేశారు. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య మార్గదర్శకత్వంలో, ఇంజనీర్ అలీ నవాజ్ జంగ్‌తో సీఐబి పని చేసింది. హైదరాబాద్ పట్టణానికి ఎగువభాగాన మూసీ ప్రవాహాన్ని అరికట్టడానికి 1920లో ఉస్మాన్ సాగర్, 1927లో హిమయత్ సాగర్ జంట జలాశయాల నిర్మాణాలు జరిగాయి. మంచినీటి సరఫరా వ్యవస్థ, కాలనీల నిర్మాణం, నూతన డ్రైనేజీ వ్యవస్థ, రివర్ ఫ్రంట్ వాల్ నిర్మాణం, రాష్ట్ర హైకోర్టు, విక్టోరియా మెటర్నిటీ హాస్పిటల్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, స్టేట్ లైబ్రరీ, ఆర్టీసీ బస్ డిపో, నయాపూల్ ఇతర పౌర సదుపాయాలపై ప్రతిపాదనలు అమలయ్యాయి. అప్పట్లో నగర ప్రణాళిక బాగ్ (ఉద్యానవనాలు), బౌలి (బావులు), తలాబ్ (చెరువులు)తో ముడిపడి ఉండింది.



గత వందేళ్లలో నగరం ఊహకు అందని విధంగా విస్తరించింది. దీంతో ఒకనాటి పరిస్థితులే తిరిగి ఏర్పడుతున్నాయన్న భయాలు కూడా కలుగుతున్నాయి. అనేక ప్రాంతాలు ఓ మోస్తరు వర్షానికే జలమయమైపోతున్నాయి. పుట్టగొడుగుల్లా మురికివాడలు వెలుస్తున్నాయి. చక్కగా ప్లాన్ చేసిన ప్రాంతాలు సైతం ఇరుకిరుగ్గా మారుతున్నాయి. అక్రమ నిర్మాణాలను చట్టబద్ధం చేస్తూ రావడం కూడా ఇందుకు ఓ కారణం. ఈ నేపథ్యంలోనే ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్, సెంటర్ ఫర్ దక్కన్ స్టడీస్ సంస్థ, చత్రి, కోవా, మూసీ పరిరక్షణ కమిటీ, తెలంగాణా రిసోర్స్ సెంటర్, R.W.As ఇతర ఎన్జీఓలతో కలిసి అర్బన్ ప్లానింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర ప్రభుత్వానికి, నగరాభివృద్ధితో ముడిపడిన సంస్థలకు అనేక సూచనలు చేసింది. 1908 నాటి వరదల పరిస్థితికి ప్రత్యక్షసాక్షిగా నిలిచిన చింతచెట్టు నీడలో ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ ఎన్నో కార్యక్రమాలను నిర్వహించింది. 2008 సెప్టెంబర్ 28 నుంచి కూడా ఏటా ఈ కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. నగరాభివృద్ధికి సూచనలు, వాటి అమలుకు కార్యాచరణ రూపకల్పన లాంటి అంశాలన్నీ ఈ సమావేశాల్లో చర్చకు వస్తుంటాయి. ఈ చింత చెట్టు అప్పట్లో కొన్ని వందలమందిని కాపాడింది. అలాంటి చెట్టు నేటికీ పచ్చగా ఉంది. ఈ చెట్టును, ఆ స్థలాన్ని నగర సహజ వారసత్వంలో భాగంగా కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. అప్పట్లో భారీ వరదలకు పెద్ద పెద్ద కట్టడాలు (మసీద్-ఎ-బర్ఖజంగ్, పేట్ల బుర్జు లాంటివి) ఎంతవరకు మునిగిపోయాయో తెలిపే సూచికలు ఇప్పటికీ ఆ వరదల తీవ్రత నేటి తరానికి తెలియచేస్తున్నాయి. అంతే కాదు, సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య, సర్ నిజామత్ జంగ్, అలీ నవాజ్ జంగ్, దాంగోరియా లాంటి ప్రముఖ ప్లానర్లు, అడ్మినిస్ట్రేటర్ల గుర్తులను భద్రపర్చుకోవాలి. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ లాంటి జలాశయాలతో పాటు, కాకతీయుల, కుతుబ్ షాహీల నాటి మరెన్నో గొలుసుకట్టు చెరువుల వ్యవస్థను కాపాడుకోవాలి. నేడు హైదరాబాద్‌లో పలు కాలనీలు కొద్దిపాటి వర్షాలకే మునిగిపోతున్నాయంటే, అవన్నీ ఒకనాటి చెరువుల్లో, నీటి ప్రవాహ మార్గాల్లో, నాలాల్లో నిర్మించినవే. చింతచెట్టు కింద జరిగిన సమావేశాల్లో ఈ విధమైన ఎన్నో అంశాలు చర్చకు వచ్చాయి. ప్లానర్లు, అడ్మినిస్ట్రేటర్లు చేసిన తప్పిదాలను గుర్తించి, వాటికి పరిష్కారాలు అన్వేషించే ప్రయత్నాలు జరిగాయి. రకరకాల కారణాలతో అవేవీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా అధికారులు ఈ విషయంపై శ్రద్ధ వహించాలి. 1908 తరువాత కూడా పలు సందర్భాల్లో మూసీ నదికి వరదలు వచ్చాయి. 1970లో ఉస్మాన్ సాగర్‌కు భారీగా వరద నీరు చేరింది. చెరువు కట్టకు ముప్పు ఉందని గేట్లు ఎత్తేయడంతో వరద నీరు నగరాన్ని ముంచెత్తింది. ఆ తరువాతి కాలంలో మూసీ వరద కాకున్నా పట్టణ వరదలు ప్రధాన సమస్యగా మారాయి. వీటిని తట్టుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలి. హైదరాబాద్ నగరం నేడు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటోంది. వర్షాకాలంలో

కాల్వలుగా మారుతున్న రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లు మునిగిపోవడం, పెరిగిపోతున్న ట్రాఫిక్, వాహన కాలుష్యం, భూగర్భ జలాల కాలుష్యం, మంచినీటి సమస్య, డ్రైనేజీ ఇక్కట్లు, ప్రజా రవాణా, మూసీ కలుషితం కావడం.. ఈ జాబితాకు అంతు ఉండదు. వీటిలో చాలా వాటిని పరిష్కరించేది చక్కటి సిటీప్లానింగ్. ఆ విషయంలో ఇప్పటికైనా శ్రద్ధ వహించాలి.

హైదరాబాద్ క్రమంగా విశ్వనగరంగా మారిపోయింది. కొన్నేళ్ల క్రితంతో పోలిస్తే తాగునీటి సదుపాయాలు, రహదారులు అభివృద్ధి చెందాయి. ఓఆర్ఆర్ వంటివి ఎన్నో వచ్చాయి, ఆర్ఆర్ఆర్ వంటివి మరెన్నో వస్తున్నాయి. ఎయిర్ పోర్ట్, మెట్రో విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. చెరువులు, నాలాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. ఏ నగరానికైనా మాస్టర్ ప్లాన్ అత్యంత కీలకం. హైదరాబాద్‌కు సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపకల్పన, అమలు విషయంలో కూడా ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. రాబోయే 50 ఏళ్లను పరిగణనలోకి తీసుకోవాలి. 1975 నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు వివిధ సంస్థల ద్వారా హైదరాబాద్‌కు ఆరు మాస్టర్ ప్లాన్లు వచ్చాయి. వాటిని కలిపి ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ అమలు చేయాలి.

నగరం ఎదుర్కొంటున్న మరో ముఖ్యమైన సమస్య డ్రైనేజీ, వరదనీళ్లు. ఎక్కడికక్కడ మురుగునీటిని శుద్ధిచేసి ఆ నీటిని స్థానికంగా వినియోగించుకునేందుకు విస్తృత ఏర్పాట్లు చేయాలి. శుద్ధి అయిన మిగులు నీటిని చెరువుల్లోకి, మూసీనదిలోకి పంపించేలా చూడాలి. వరద నీటి కాల్వల నిర్వహణ, నిర్మాణంపై దృష్టిపెట్టాలి. ఐదేళ్లలోగా ఈ పనులు పూర్తయ్యేలా చూడాలి. వాన నీటిని ఒడిసిపట్టి వినియోగించుకునేలా చేయాలి. ఈ విషయంలో భవన నిర్మాణ నిబంధనలను కఠినం చేయాలి. ఘనవ్యర్థాల సేకరణ, ప్రాంతాల వారీగా సెపరేషన్, రీసైకిల్ చేసి పూర్తి స్థాయిలో వినియోగించుకొనే వ్యవస్థను ఏర్పరుచుకోవాలి. హైదరాబాద్ జనాభా కోటి దాటింది. మొత్తం తెలంగాణ జనాభాతో పోలిస్తే నాలుగో వంతు ఈ నగరంలోనే ఉన్నట్లయింది. రాజధానికి 100 కిలోమీటర్ల వెలుపల కౌంటర్ మాగ్నెట్స్‌గా చిన్న పట్టణాల అభివృద్ధిని తీవ్రతరం చేయాలి. తద్వారా ఉపాధి, విద్యావకాశాల కోసం హైదరాబాద్‌కు ప్రజలు వలస రాకుండా చూడవచ్చు. హైదరాబాద్ యావత్ దేశపు గ్రోత్ ఇంజిన్లలో ఒకటి. దీన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్రప్రభుత్వం కూడా హైదరాబాద్ నగరానికి ఇతోధికంగా నిధులు మంజూరు చేయాలి. మరీ ముఖ్యంగా ప్రజా రవాణా వసతులు, పట్టణ డ్రైనేజ్ వ్యవస్థ, తాగునీరు, మూసీ నది ప్రక్షాళనకు ముందుకు రావాలి. శీతోష్ణస్థితి మార్పుల ప్రభావానికి హైదరాబాద్ లోనవుతోంది. అతి తక్కువ సమయంలోనే అత్యంత భారీస్థాయిలో వర్షాలు కురుస్తున్నాయి. ఇలాంటి మార్పులను తట్టుకునేందుకు నగరం సిద్ధంగా ఉన్నదా? బెంగళూరు, ముంబై లాంటి నగరాలు ఇటీవలి కాలంలో మౌలిక వసతుల కొరతకు గురయ్యాయి. అలాంటి దుస్థితి మన హైదరాబాద్‌కు రావద్దనుకుంటే తక్షణమే నడుం బిగించాలి. నగరాభివృద్ధి అనగానే కొన్నిసార్లు అధికారులు అత్యుత్సాహంతో చారిత్రక ప్రాధాన్యం ఉన్న భవనాలను కూడా కూల్చేస్తుంటారు. వందేళ్ల క్రితం నిజాం హయాంలో చారిత్రక ప్రాధాన్యం ఉన్న కట్టడాలెన్నో కనుమరుగైపోయాయి. అలాంటి పొరపాట్లే ఇప్పుడు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలి.

కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరాన్ని ఆకుపచ్చ నగరంగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడు మాత్రమే అభివృద్ధి ఫలితాలు అందుకోగలుగుతాం. అభివృద్ధి, ప్రజానివాస హక్కులు, చెరువులు, కుంటల పరిరక్షణ, ప్రజారవాణా, చారిత్రక వారసత్వ కట్టడాల సంరక్షణ లాంటివన్నీ కలసికట్టుగా కొనసాగాలి. ఆ దిశలో ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ లాంటి సంస్థలెన్నో కృషి చేస్తున్నాయి, చేస్తాయి కూడా.

– వేదకుమార్ మణికొండ
చైర్మన్, ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ ద
(ఆంధ్రజ్యోతి 28.9.2024)


## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన




**పెద్దలు రాసిన పిల్లల కథలు**

**(ఉమ్మడి పది జిల్లాలు)**

10 పుస్తకాల సెట్ ధర రూ. 350.
తగ్గింపు ధర రూ. 300

**ప్రతులకు**

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.
మరియు
'భూపతి సదన్' 3-6-716,
స్ట్రీట్ నెం. 12, హిమాయత్‌నగర్,
హైదరాబాద్-500029
**ఫోన్ : 9030 6262 88**
email: edit.chelimi@gmail.com
website : www.balachelimi.com

# నదులు - నాగరిక సోపానాలు

## సెప్టెంబరు నాల్గవ ఆదివారం (22.09.2024) "ప్రపంచ నదుల దినోత్సవం" సందర్భంగా

అనాది కాలం నుంచి ఆధునిక కాలం వరకు నదులే నాగరికత ఆలవాలంగా నిలిచాయి. నదులకు ప్రమాదం వాటిల్లితే నాగరికతకే కాదు, మానవ మనుగడతో పాటు సకల జీవరాశి ఉనికికే జీవన్మరణ సమస్యలు ఏర్పడుతాయి. కాబట్టి నదులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి విద్యుక్త ధర్మం. గడచిన వేలు, లక్షల సంవత్సరాలుగా నదులను మానవులు ఎలా ఉపయోగించుకుని అభివృద్ధి చెందారు అనేది గుర్తు చేసుకుంటే నదుల పట్ల మన భావి బాధ్యతను గుర్తించే అవకాశం ఏర్పడుతుందని తెలియజేయడానికే ఈ వ్యాసం.

ప్రపంచంలో కొన్ని లక్షల నదులు ప్రవహిస్తున్నాయి. కాబట్టి వాటి ఆధారంగా వందల కోట్లాది ప్రజలు జీవనం సాగిస్తున్నారు. భారతదేశంలో ప్రవహిస్తున్న నదులను, ఉపనదులను కలిపి మానవ శరీరంలో ప్రవహిస్తున్న నాడీ మండలం / నరాల వ్యవస్థతో పోల్చారు. అంటే మన శరీరంలో ఎన్ని నరాలు రక్తాన్ని సరఫరా చేస్తాయో మన దేశంలో అన్ని నదులున్నాయనమాట. ప్రపంచ ప్రసిద్ధమైన ప్రాచీన నాగరికతలన్నీ నైల్, యూఫ్రటీస్ -టైగ్రిస్ సింధు మొదలైన నదుల మైదానాల్లోనే విలసిల్లాయి. కాబట్టి ఆయా నాగరికతలను వాటి సమీప నదుల పేర్లతోనే పిలుస్తారు. మన దేశంలో సింధూ నదీ లోయ నాగరికత అనేది క్రీ.పూ. మూడు వేల సంవత్సరాల క్రితమే ప్రభావిల్లి తదనంతర భారత జీవన సంస్కృతుల వికాసానికి ఎనలేని బాటలు వేసింది. సింధూ నాగరికత క్రమంగా తూర్పున ఉన్న గంగా నదీ మైదానం వైపు, దక్షిణాన ఉన్న నర్మద, గోదావరి, కృష్ణా-తుంగభద్ర, కావేరి నదీ తీర మైదానాల వైపు విస్తరించింది.



తెలంగాణా రాష్ట్రంలో గోదావరి, కృష్ణ, వాటి ఉపనదులు ప్రవహిస్తున్నాయి. కాబట్టి వాటి నీటిని వాడుకుని ప్రజలు ఎలా వృద్ధిలోకి వచ్చారనేది తెలుసుకుంటే ఆయా నదుల పరిరక్షణ బాధ్యత ఎంత ప్రాధాన్యమైన అంశమో తలిపి వస్తుంది.

### గోదావరి గంగ

ఉత్తర తెలంగాణ ప్రజలు తమ ఇంటికి ఉత్తరం వైపున్న దర్వాజాను "గంగ దర్వాజ" అంటారు. ఎందుకంటే, తమ ఇల్లు ఉన్న ప్రాంతానికి ఉత్తరం వైపున 'గంగ' ప్రవహిస్తున్నది కాబట్టి. తెలంగాణ ప్రజలు గోదావరిని 'గంగ' అనే పిలుస్తారు. పదిహేనవ శతాబ్ది ప్రారంభ దశాబ్దాల కాలపు శ్రీనాథుడు మొదలైన కవులు గోదావరిని "వృద్ధ గంగ" అని వర్ణించారు. అంటే, ఉత్తర భారత దేశంలో ప్రవహిస్తున్న 'గంగా' నది కంటే గోదావరి నదే ప్రాచీనమైనదని దీనికి నిదర్శనాలను జియాలజీ పరిశోధనలు చూపాయి. వాటి ప్రకారం సుమారు ఆరు కోట్ల సంవత్సరాలకు పూర్వం మహారాష్ట్రలోని మహాబలేశ్వర కొండల ప్రాంతంలో పెద్ద విస్ఫోటనం జరిగి భారీ స్థాయిలో లావా తూర్పు వైపు ప్రవహించింది. అత్యంత వేడితో ప్రవహించిన లావా భూమిని కోసుకుంటూ వెళ్ళడంతో దాని ప్రవాహ మార్గమే క్రమంగా గోదావరి నదీ మార్గమైంది. అయితే లావా వేడిలో ఆనాటి అత్యంత ఎత్తైన దట్టమైన అడవులు కాలిపోయి కాలక్రమేణా శిథిలమై బొగ్గు గనులుగా మారాయి. ఆ అడవులలో జీవించిన ఆనాటి డైనోసార్లు కూడా కాలిపోగా వాటి బొక్కలు ఇప్పటికీ గోదావరిఖని - సింగరేణి బొగ్గు గనులలో దొరుకుతున్నాయి.

ఆ తరువాత కాలక్రమంలో గోదావరి, దాని ఉపనదుల సమీపాలలో, వాటి జలపాతాల కింది గుండాల దగ్గర ఆది మానవులు తొట్టతొలి నివాసాలు ఏర్పరచుకున్నారు. సుమారు 18 లక్షల సంవత్సరాల క్రితం నుంచి లావా ప్రవాహంలో కాలిపోయిన వృక్ష శిలాజాలతో రాతి పనిముట్లు చేసుకున్నారు. మంచిర్యాల జిల్లా వేమనపల్లి నస్పూరు ప్రాంతాలలో, వాటికి తూర్పున సెలబాక, ఎలబాక ప్రాంతాలలో ఇలాంటి పనిముట్లు ఎన్నో లభించాయి. ఘన్‌పూర్, పొచ్చెర, కుంటాల, కోరెటికల్-బి, గద్దలసరి, గుండాల మొదలైన ఎన్నో జలపాతాల సమీపాలలో ఆది మానవుల పనిముట్లతో పాటు వారి ఆవాసాల జాడలు కూడా లభించాయి. ఎండకాలం వాగు వంకలలోని నీరు ఎడిపోతే జలపాతాల కింద ఏర్పడిన గుండాలలో కొంత నీరైనా నిలిచి ఉంటుంది. కాబట్టి వాటి సమీప ప్రాంతాలను ఆదిమానవులు ఆవాసాలుగా ఎంపిక చేసుకున్నారు. ఏటూరు నాగారం - తాడ్వాయి అడవులలో సుమారు 40-50 కిలోమీటర్ల పరిధిలో పదుల కొద్ది అరుదైన బృహత్ శిలాయుగపు ఆవాసాలున్నాయి. మల్లూరు గుట్టపైన కోట కూడా ఉంది.

గోదావరి నదిలో వాటి ఉపనదులు కలిసే చోట లేదా గోదావరి పెద్ద మలుపు తీసుకునే చోట ఏర్పడిన పెద్ద పెద్ద చెరువుల వంటి 'మడుగుల' సమీప ప్రాంతాలలో తొట్టితొలి రాజ్యాల రాజధానులు, పవిత్ర తీర్థ క్షేత్రాలు ఏర్పడ్డాయి. రెండున్నర వేల

సంవత్సరాల నుంచి అలా తెలంగాణలో ఏర్పడిన మొట్టమొదటి నగరం బోధన్. దీనిని సుమారు రెండున్నర వేల సంవత్సరాల కిందట అశ్మకులు పసుపునది గోదావరిలో కలువడానికి కొన్ని కిలోమీటర్ల ఎగువన కట్టారు. ఆనాటి భారతదేశంలో మనుగడ సాగించిన పదహారు జనపదాలలో అశ్మక–బోధన్ (పోతన అనేది అసలు పేరు) ఒక్కటే దక్షిణ భారతదేశంలో ఉండేది.

బోధన్ తరువాత జగిత్యాల జిల్లా, వెల్గటూరు మండలంలో పెంద్దవాగు గోదావరిలో కలిసే చోట శాతవాహన రాజుల పూర్వరాజులు ఈనాటి కోటలింగాల అనే చోట 120 ఎకరాల కోట కట్టి రాజ్యపాలన చేశారు. క్రీ.పూ. ఒకటవ శతాబ్దంలో దానినే శాతవాహనులు రాజధానిగా చేసుకొని దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి సామ్రాజ్యాన్ని నిర్మించారు. కోటిలింగాల నుంచి రోమన్ రాజ్యంతో వ్యాపారం చేయగా రోమన్‌లు మన ప్రాంతీయులకు ఇచ్చిన బంగారు నాణేలు కోటిలింగాలతో పాటు ఇతర ప్రాచీన పట్టణాలలో ఇప్పటికీ బయల్పడుతున్నాయి. గోదావరి ఉత్తర దక్షిణ దిశలలో ఉన్న సారవంతమైన భూములలో అన్ని



పంటలతో పాటు పత్తి కూడా విస్తారంగా పండేది. పత్తి నుంచి అతి సన్నని దారాలు తీసి పాలెగూడు (వెబ్) వంటి పల్చటి బట్టలు నేసి కోటిలింగాల ప్రాంతం నుంచి రోమన్ సామ్రాజ్యానికి ఎగుమతులు చేయగా వాటిని కట్టుకున్న రోమన్ స్త్రీల సంఔదర్యాని చూసి పురుషులు నీటి హద్దులు దాటుతున్నారని క్రీ.శ. 2వ శతాబ్దంలో ప్లినీ అనే పరిశోధకుడు రాశాడు. రోమన్‌ల సంపద కూడా భారత్‌కు తరలిపోతున్నదని, కాబట్టి భారత్‌తో వ్యాపారాన్ని నిలిపివేయాలని సూచించాడట.

బోధన్, కోటిలింగాలతో పాటు గోదావరి ఒడ్డున పెద్ద బొంకూరు, ధూళికట్ట, మొలుమూరు మొదలైన పట్టణాలు గోదావరి గట్లపైనే నెలకొన్నాయి. క్రీ.పూ. 4వ శతాబ్దానికే ఇలాంటి కోటగోడలు ఆంధ్రులకు (తెలుగువారికి అని) ముప్పై ఉన్నాయని, మౌర్యుల తరువాత భారత్‌లో వీరే బలవంతులని మౌర్య చంద్రగుప్తుని ఆస్థానంలో గ్రీకు రాయబారిగా ఉన్న మెగస్తనీస్ తన 'ఇండికా' గ్రంథంలో రాశాడు.

పై ప్రాచీన పట్టణాలతో పాటు గోదావరి నదితో ఉపనదులు, వాగులు కలిసే సంగమ స్థలాలలో, లేదా గోదావరి వంకలు తిరిగే చోట ఏర్పడిన పెద్ద పెద్ద మడుగు ప్రాంతాలలో కందకుర్తి, బాసర, బ్రహ్మగిరి (కనకగిరి, సోన్, బాదనకుర్తి, హస్తినమడుగు, ధర్మపురి, మంథని, లండమడుగు, కాళేశ్వరం, భద్రాచలం మొదలైన తీర్థక్షేత్రాల పట్టణాలు ఏర్పడ్డాయి. గోదావరి నీటి వనరులను ఎండా కాలంలోనూ వాడుకోవడం కోసం 15వ శతాబ్దం నాటి ప్రసిద్ధ కవి బమ్మెర పోతన గోదావరి ఇసుక తిన్నెల పైనే తన తెలుగు భాగవతాన్ని ప్రారంభించి గోదావరి జలాల సౌందర్యాన్ని ఎంతగానో పొగిడాడు.

గోదావరి, కృష్ణ పరీవాహక ప్రాంతాలలో కాకతీయులు ఏడెనిమిది వందల ఏండ్ల కిందట సముద్రాలను తలపించే చెరువులు, వాటి నుంచే పారే అలుగులపై వరుసగా మరిన్ని చెరువులను... అంటే గొలుసుకట్టు చెరువులను కట్టించారు. రామప్ప, లక్నవరం, పాకాల, ధర్మవరం, కేసరి సముద్రం, గణ్‌పూర్ మొదలైన కాకతీయ చెరువులు ఇప్పటికీ వేలాది ఎకరాలకు నీరు అందించడ, మత్స్య సంపదకు ఆలవాలంగా ఉండడం చూడవచ్చు. ఆయా చెరువులను దైవ స్వరూపగా భావిస్తూ వాటి సమీపంలో కాకతీయులు ఆనాడే ప్రసిద్ధ దేవాలయాలను కట్టించారు. భారతదేశానికి స్వాతంత్ర్య వచ్చిన తరువాత నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తూ ఆనాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రాజెక్టులను 'ఆధునిక దేవాలయాల'ని సంబోధించడం గమనార్హం.

స్వాతంత్ర్య రావడానికి మూడు నాలుగు దశాబ్దాల ముందే గోదావరి ఉపనది మంజీరపై ఆనాటి హైదరాబాద్ రాష్ట్ర నిజాం ప్రభుత్వం తెలంగాణలో మొట్టమొదటి బహుళార్థ సాధక ప్రాజెక్ట్ కట్టింది. పోచారం దగ్గర మరో ప్రాజెక్టును కట్టింది. స్వాతంత్ర్య తరువాత అదే నదిపై మంజీర, సింగూరు, శ్రీరామ్‌సాగర్, ఎల్లంపల్లి, కాళేశ్వరం ప్రాజెక్టులను కట్టుకోగా ఇంకా కింది వైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం, ధవళేశ్వరం ప్రాజెక్టులను కట్టుకున్నది.

గత శతాబ్దంలో మంచిర్యాల –గోదావరిఖని, రామగుడం ప్రాంతంలో బొగ్గుబావులు, ఎరువుల కర్మాగారాలు, విద్యుదుత్పత్తి పరిశ్రమలు కూడా గోదావరి జలాల ఆధారంగానే ఏర్పడ్డాయి. కాని ఆయా పరిశ్రమలు గోదావరిలోకే వ్యర్థాలను వదలడం వలష్ల గోదావరి కలుషితమై జీవజాలానికి ప్రమాదం వాటిల్లుతున్నది.

### కృష్ణవేణి

తెలంగాణకు దక్షిణ సరిహద్దుగా కృష్ణానది భీమ, తుంగభద్ర, మాజీ నదులను కలుపుకొని పారుతున్నది. వీటి జలాలను ఆధారం చేసుకొని అత్యంత ప్రాచీన కాలం నుంచి ఈనాటి దాకా ఆదిమానవులు నివాసాలు ఏర్పరచుకున్నారు. భారతదేశంలోనే 'ఆదిమ మానవులు'గా గుర్తించబడిన చెంచు గిరిజనులు కృష్ణానదికి ఇరువైపులా విస్తరించి ఉన్న నల్లమల అడవులలో జీవిస్తున్నారు. 1940 ప్రాంతంలో వీరిపై విశేష పరిశోధన చేసిన ఆచార్య

హైమెండార్ఫ్ వీరు ఇంకా రాతి యుగపు స్థితిలోనే జీవిస్తున్నారని రాశాడు. మరో పక్క వీరికి సమాంతరంగా క్రీ.పూ. 4వ శతాబ్దం నాటికే 'నగ్నయతులు' ఈ నదీ తీరాలలో సంచరిస్తున్నారని మెగస్తనీస్ రాశాడు. చెంచు అమాయక ప్రజలు, జ్ఞానులైన యతులు కృష్ణానది ఆధారంగానే జీవించడం గమనార్హం.

వర్షా కాలంలో వచ్చే వరదలు కృష్ణానది ఒడ్డును కోయడం వల్ల బయటపడే వజ్రాలు పలు వలసలను ఆహ్వానించాయి. క్రమంగా ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా వజ్రాల పరిశ్రమ కృష్ణా లోయలోనే ఏర్పడింది. కాకతీయులు, కుతుబ్షాహీలు, నిజామ్‌ల కాలాల్లో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కోహినూర్, జాకోబ్, నిజామ్ మొదలైన వజ్రాలు ఎన్నో ఈ నది లోయలో లభించాయి. ఇప్పటికీ డిబీర్స్ వంటి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వజ్రాల కంపనీలు కృష్ణా పరీవాహక నల్లమల పర్వతాలలో వజ్రాలను వెలికి తీసే పరిశ్రమలు స్థాపించడానికి ఉవ్విళ్ళూరుతున్నాయి. మరి కొన్ని కంపెనీలు ఈ ప్రాంతంలో యురేనియం నిక్షేపాలను కొల్లగొట్టడానికి ప్రయత్నిస్తున్నాయి.

2300 సంవత్సరాల కిందట మౌర్య చంద్రగుప్తుడు పాటలీపుత్ర (పాట్నా)ను వదిలి దక్షిణాదికి వచ్చి శ్రీశైలం ప్రాంతంలో ఉన్న కృష్ణానదీతీరంలోని ఆహ్లాదకరమైన వాతావరణం నచ్చి నాగర్ కర్నూలు జిల్లాలోని అమ్రాబాద్ మండలంలో ఉన్న నల్లమల అడవులలో సుమారు ఐదు కిలోమీటర్ల చదరపు వైశాల్యంలో ఒక పట్టణాన్ని కట్టించాడు. ఆ తరువాత ఆయన భద్రబాహు అనే జైన మునితో కలిసి కర్నాటకలోని శ్రావణ బెళగొళకు వెళ్ళగా ఆ పట్టం శిథిలమైపోయింది.

అనంతరం సుమారు రెండు వేల సంవత్సరాల కిందట గౌతమీపుత్ర శాతకర్ణి అనే రాజు తన రాజధానిని కృష్ణా నదికి ఆవలి వైపు ఉన్న ధనకడ / ధరణికోట (ఈనాటి అమరావతి)కు మార్చాడు. కృష్ణానది ఒడ్డునే మరో శాతవాహన రాజైన విజయశ్రీ శాతకర్ణి తన పేర విజయపురి పట్టణాన్ని కట్టించాడు. అది శాతావాహన అనంతరీకులైన ఇక్ష్వాకులకు రాజధాని అయింది. శాతావాహనులు, ఈ నదిని వాణిజ్య సరుకులు సరఫరా చేసేందుకు వినియోగించుకోగా ఇక్ష్వాకులు దాని జలాలను వ్యవసాయ విస్తృతికి వినియోగించుకున్నారు. ఇందు కోసమై ఒక రాజు లక్ష నాగళ్ళను, ఎద్దులను పంచి పెట్టాడు. 1700 ఏండ్ల కిందట, అట్లని కృష్ణానది ఆధారిత అంతర్జాతీయ వాణిజ్యం, విద్యా ధార్మిక సంబంధాలను నిలిపివేయలేదు. శాతవాహన కాలంలో బౌద్ధ ఆచార్య నాగార్జునుడు స్థాపించిన మాధ్యమికవాదం / శూన్య వాదం, విశ్వవిద్యాలయం, రసవాదం ప్రపంచవ్యాప్తంగా బౌద్ధ శక్తులను, విద్యార్థులను, పరిశోధకులను, రసాయనికవాదులను విజయపురికి (ఈనాటి నాగార్జునసాగర్) ఆకర్షిస్తూనే ఉన్నాయి. నాటి రోమన్, వాస్తుశైలిలో కట్టిన ప్రేక్షకారాగారాన్ని నేటికీ నాగార్జున సాగర్‌లో చూడవచ్చు. శాతవాహన, ఇక్ష్వాకుల కాలంలోనే కృష్ణా ఒడ్డు మీద మొట్టమొదటి దేవాలయాలు నిర్మితమయ్యాయి.

ఇక్ష్వాకుల తరువాత క్రీ.శ.4వ శతాబ్దంలో విష్ణుకుండులు కృష్ణానది ఎడమ గట్టున నాగర్ కర్నూలు జిల్లాలో అమరగిరిని తమ తొలి రాజధానిగా చేసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా చోటు చేసుకున్న పలు పరిణామాల మూలంగా రోమన్ సామ్రాజ్యంతో వాణిజ్య సంబంధాలు ఆగిపోవడం వల్ల కాబోలు విష్ణుకుండులు క్రమంగా కృష్ణానదిని (అమరగిరిని, ఏలేశ్వరాన్ని) వదిలి దాని ఉపనది ఐన మూసీ నదివైపు వలస పోయారు. అలా వారు 5వ శతాబ్ది ప్రారంభం కాలం నుంచి హైద్రాబాద్ సమీపపు కీసరగుట్ట, చైతన్యపురి, ఇంద్రపాలనగరంలలో అనేక కట్టడాలు నిర్మించారు. కృష్ణానది సమకూర్చినంత ఎక్కువ జలాలను వాగు వంకలు సమకూర్చలేవు. కాబట్టి విష్ణుకుండులు 'వాపీ కూప తటకాదులు'



(దిగుడుబావులు, చేదబావులు, చెరువులు-కుంటలు) నిర్మించారు.

కృష్ణా-తుంగభద్ర సంగమ ప్రాంతానికి (అలంపూరుకు) సమీపంలో ఉండిన తుమ్మెయనూరులో లభించిన రాగిరేకుల శాసనంలో చాళుక్యులు తమ జన్మభూమి ఇదేనని చెప్పుకున్నారు. ఇక్కడి నుంచి పశ్చిమంగా కర్ణాటకలో ఉన్న బాదామి (వాతాపి)కి వలసపోయి అక్కడి నుంచి యావత్ దక్షిణ భారతదేశాన్ని పాలించారు. వారి వారసులు, సామంతులైన ఇతర చాళుక్య శాఖలు, రాష్ట్రకూటులు మరిన్ని వందల సంవత్సరాలు దక్కనును పాలించారు. వారు అలంపూరు దగ్గరి సోమశిల- సంగమేశ్వరం లలో అనేక దేవాలయాలు కట్టించారు.

మలి చాళుక్యపు సామంతులైన కాకతీయులు క్రీ.శ.12వ శతాబ్దంలో స్వతంత్రులైన 160 ఏళ్ళు యావత్ తెలుగు దేశాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలూరు వారిలో అత్యంత గొప్పవాడైన గణపతి దేవ చక్రవర్తి సోదరి మైలాంబ కృష్ణానది ఒడ్డునున్న జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం మల్లికార్జునస్వామి గుడిని కట్టించింది. 800 సంవత్సరాల కిందట. గణపతిదేవుని బిడ్డ రుద్రమదేవి తన పుట్టిన

రోజున పురస్కరించుకుఇ ఈనాటి అమరావతి దగ్గరి మందడం – వెలగపూడి చరిత్రలో మొదటిసారిగా ప్రసూతి ఆసుపత్రిని కట్టించి దాని నిర్వహణకై అనేక దానాలు చేసింది. గణపతిదేవుని కాలంలోనే కృష్ణానదిలో మూసీనది సంగమించే వాడపల్లిలో మేలుగుంటు సోదరులు బతుకేశ్వర ఆలయాన్ని కట్టించి పలు దానాలు చేశారు. ఆ సంగమంలో బతుకమ్మను సాగనంపే ఉత్సవం ఆనాడు పెద్ద ఎత్తున జరిగేదని భావించవచ్చు.



అదే వాడపల్లి మీద పట్టుకోసమై కాకతీయ అనంతర రాజులైన రెడ్లు, పద్మనాయకులు పలు యుద్ధాలు చేశారు. అక్కడి నుంచే బంగాళాఖాతానికి ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్యం చేసుకోవడానికి అవకాశముంటుంది కనుక. పద్మనాయకులలో తొలితరం రాజైన మాదా నాయకుడు నల్లమల అడవుల ప్రాంతంలో ఉమామహేశ్వర క్షేత్రం నుంచి అడవుల గుండా జాతర రేవు వరకు మెట్లు కట్టించాడు. శ్రీశైలం యాత్రికుల సౌకర్యం కోసం 650 ఏండ్ల కిందట.

కాకతీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ పద్మనాయకులు, వారి తరువాత గోల్కొండ కుతుబ్షాహీలు తెలంగాణలో అక్కడక్కడా కొన్ని చెరువులు కట్టించారు. ఆ తరువాత రాజ్యపాలన చేపట్టిన అసఫ్జాహీలు చెరువులతోపాటు కృష్ణానది ఉపనదులైన డిండి, మూసీ నదులపై మధ్య తరహా ప్రాజెక్టులు కట్టారు. కతుబ్షాహీలు మాత్రం కృష్ణా నదీలోయలో వజ్రాల తవ్వకం పరిశ్రమ మీదనే ఎక్కువ దృష్టి పెట్టారు. 17వ శతాబ్దంలో ఇక్కడి వజ్రాలతో వ్యాపారం చేయడం కోసం ప్రపంచవ్యాప్తంగా వ్యాపారులు గోల్కొండ రాజ్యానికి, కృష్ణానదికి వచ్చేవారు గోల్కొండ కోటలో మోతీ దర్వాజా (వజ్రాల దర్వాజా) అని ఒక ప్రత్యేక దర్వాజానే ఉది. అసఫ్జాహీలు కృష్ణానది లోయలో ముత్యాల పరిశ్రమలను నడిపారు. ఇప్పటికీ హైదరాబాద్ ముత్యాలకు పేర్గాంచింది.


స్వాతంత్ర్యానంతరం కృష్ణానది మీద జూరాల, నాగార్జునసాగర్, శ్రీశైలం మొదలైన ప్రాజెక్టులను కట్టారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నీరు హైదరాబాద్ పరిసర ప్రాంతాల వరకు వస్తున్నాయి.

మలి తెలంగాణ ఉద్యమం ప్రధానంగా గోదావరి, కృష్ణా జలాలలో వాటా కోసమే జరగడం నదుల ప్రాధాన్యం మానవ మనుగడలో అత్యత కీలకం అని తెలియజేస్తుంది.

వేల సంవత్సరాలుగా పుష్కరాల పేరుతో, పుణ్య స్నానాల పేరుతో, గణపతి, బతుకమ్మ నిమజ్జనాల పేరుతో పూజలందుకున్న నదులలోకి గత అర శతాబ్దం కాలంగా పరిశ్రమల వ్యర్థాలను, ప్లాస్టిక్ వ్యర్థాలను వదులుతూ ఉండడంతో ఆయా నదుల నీరు జీవజాలం మనుగడకు పెను సవాలును విసరుతూ ఉంది. మూసీనది ఒడ్డున ఉన్న హైదరాబాద్ నగరం వల్ల మూసీతో పాటు, అది కలిసే నది కృష్ణా కూడా కలుషితమవుతున్నది. ఇలాంటి పరిస్థితులను ప్రజలు, ప్రభుత్వాలు అత్యంత బాధ్యతాయుతంగా చక్కదిద్దుకోకపోతే మానవాళి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది. పైన వివరించినట్లు ప్రతి రంగంలో అభివృద్ధికి నదుల నీరే కారణం అనే ప్రాథమిక సత్యాన్ని గ్రహిస్తేనే మనమందరం నదుల పరిరరక్షణకు పాటుపడగలం. గోదావరి నుంచి మల్లన్న సాగర్, ఉస్మాన్‌సాగర్, హిమయాత్‌సాగర్‌ల మీదుగా రెండున్నర టీఎంసీల నీటిని తరలించి వచ్చే సంవత్సరానికల్లా మూసీ ప్రవాహాన్ని ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం ఇటీవలే నిర్ణయం తీసుకోవడం కొసమెరుపు.

– ద్యావనపల్లి సత్యనారాయణ,
m : 94909 57078
e: dyavanapalli@gmail.com








## అప్రతిహతంగా నడుస్తున్న అగ్రశ్రేణి

# మాసపత్రిక దక్కన్‌ల్యాండ్

**2012**లో ప్రారంభించబడ్డ మాసపత్రిక "దక్కన్‌ల్యాండ్" పత్రిక గత 13 ఏండ్లుగా అప్రతిహతంగా నడుపబడుతున్న అగ్రశ్రేణి పత్రిక. వేదకుమార్‌గారు సబ్బండవర్గాల-మతాల ప్రజల సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తు నిత్య శ్రామికునిగా సమన్యాయ నిఘంటువుగా మారి విద్యాధికుడై, ఈ సమాజ పోకడల మంచీ-చెడూ, కష్ట-నష్ట, ఉచితానుచితాల నెరుగుతూ, సందర్భోచితంగా సమయపాలనను పాటిస్తూ తన హృదయాన్ని మలినంలేని "శ్వేత పత్రంగా" మార్చుకొని జీవిస్తున్న సజీవసాక్ష్యపు సంఘసంస్కర్తల మాటా, బాటైన "వారసోత్తమునిగా" పత్రిక సంపాదకునిగా నిలదొక్కుకున్నటి దిట్ట మణికొండ వేదకుమార్.


వేదకుమార్ గత 15 సంవత్సరాలుగా నాకు పరిచయం. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పడాలన్న అకుంఠిత కార్యదీక్ష వారిది. ఉద్యమకాలంలో టీఆర్‌సీ (తెలంగాణ రిసోర్స్ సెంటర్) పేరుతో ప్రతి మాసం హిమయత్‌నగర్‌లోని చంద్రం బిల్డింగ్‌లో చర్చా వేదికను నిర్వహించేవారు. అనేక రంగాలకు సంబంధించిన నిపుణులను ఆహ్వానించి ఆ చర్చా వేదికలో వారి అభిప్రాయాలను విశ్లేషించేలా చేసేవారు. వాటిని దక్కన్ ల్యాండ్ పత్రికలో అక్షర రూపంలో ప్రచురించి పాఠకులకు అందించేవారు. మేధావులను, సాహితీ వేత్తలను వందలాదిమంది ఉద్యమ కారులను, సైంటిస్ట్‌లను, ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ రాష్ట్రస్థాయి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, సబ్బండ వర్గాల కులసంఘాల అధ్యక్ష, కార్యదర్శి పలుకుబడిగల ఎందరెందరో సామాజిక - రాజకీయ, సాంస్కృతిక విప్లవోద్యమ నాయకులను, ఐఏఎస్, ఐపీఎస్, ప్రభుత్వ ఉద్యోగుల నెందరినో ప్రభావితం చేస్తు, "తెలంగాణ రాష్ట్రం సిద్ధించాలని" ప్రతి నెల రెండో శనివారం 10 సంవత్సరాల పాటు, తన సొంత "దక్కన్ టివి ఛానెల్" ద్వారా మాట్లాడిస్తూ, ప్రసంగాలు చేయిస్తూ, తెలంగాణ భౌగోళిక పరిస్థితులు, సంపద, గతకాల ఉద్యమాల చరిత్రల నన్నింటిని అనుభవం గల ఒక్కొక్కరితో మాట్లాడిస్తూ "ప్రత్యేక తెలంగాణ ముద్దుబిడ్డ"గా తన విద్యుక్త ధర్మాన్ని నెరవెర్చిన స్థితప్రజ్ఞుడు వేదకుమార్. ఇలా ఉద్యమంలో దక్కన్‌ల్యాండ్ పత్రిక కీలక భూమిని పోషించింది అనడంలో ఎలాంటి సందేహం లేదు.




సబ్బండవర్గ కళాకారులను, సాహితీవేత్తలను ఎంతగానో అభిమానించే వేదకుమార్ వారికి ఆర్థిక సహాయం చేసి తెలంగాణ సంస్కృతిని, సాహిత్యాన్ని, చరిత్రను, కళలను కాపాడడంతో తనవంతు పాత్ర పోషించారు. పత్రిక ద్వారా దక్కన్ పీఠభూమిలోని వారసత్వ సంపదను, పర్యావరణాన్ని, చెరువులను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలను, సలహాలను పత్రిక ద్వారా వ్యాసాల రూపంలో తెలియజేస్తున్నారు.

145 నెలలుగా క్రమం తప్పకుండా ప్రతిమాసం వెలువడుతున్న మాసపత్రిక మన దక్కన్‌ల్యాండ్. కరోనా కాలంలో (లాక్‌డౌన్ సమయం) ఎంతో మంది నిపుణులను ఇంటర్వ్యూలు చేసి పాఠకులకు, ప్రజలకు ఆ సమయంలో ఎంతో ధైర్యాన్ని అందించిన పత్రిక మన దక్కన్‌ల్యాండ్. ఈ పత్రిక ఇలానే దిన దిన ప్రవర్తమానం చెందాలంటే మనవంతుగా సంవత్సరం 'చందా' చేసి, మన తోటి వారితోనూ చేయించి పత్రిక ఆర్థిక అభివృద్ధికి చేయూత నందించగలరని పాఠకులకు నా పిలుపు.

- సంగీతపు రాజలింగం
(సంఘ సంస్కరణల పురస్కార గ్రహీత)
m : 7569588897, 6309874728




# దక్కన్‌ల్యాండ్‌పై ప్రముఖుల అభిప్రాయాలు

## 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న దక్కన్‌ల్యాండ్

"దక్కన్‌ల్యాండ్" మాసపత్రిక పది సంవత్సరాల సందర్భంగా ప్రముఖులు అభిప్రాయలు తెలిపారు. 2024 ఆగస్టు మాసంతో 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మరికొందరి అభిప్రాయాలు ప్రచురించగలమని తెలియజేయుటకు సంతోషిస్తున్నాం.

### తెలంగాణ అస్తిత్వ ఆత్మగౌరవ పతాకం

***పత్రికొక్కటున్న పదివేల సైన్యము***
***పత్రికొక్కటున్న మిత్ర కోటి***
***ప్రజకు రక్ష లేదు పత్రిక లేకున్న.....***

అంటారు పత్రికా రంగ వైతాళికుడు నార్ల వెంకటేశ్వరరావు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే పత్రికల పాత్ర అనివార్యం. మానవజీవన వికాసంలో పత్రికలు ఎప్పటికప్పుడు తమ వంతు పాత్రను నిరంతరాయంగా పోషిస్తూ వస్తున్నాయి. ఆ క్రమంలో 10 ఏళ్ల క్రితం ఆవిర్భవించిన దక్కన్ ల్యాండ్ సామాజిక రాజకీయ మాసపత్రిక తెలంగాణ అస్తిత్వ ఆత్మగౌరవ పతాకగా నిలిచింది. మలిదశ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి ఊపిరులూదింది. తెలంగాణ రాష్ట్ర సామాజిక ఆర్థిక రాజకీయ రంగాలను ప్రతిఫలించే అద్దంగా, అన్యాయాలు అక్రమాలపై ప్రకటించిన యుద్ధంగా దక్కన్ ల్యాండ్ పాఠకులకు చేరువైంది. ఎలక్ట్రానిక్ మాధ్యమాలు, సోషల్ మీడియాలు ఉప్పెనలై సమాజాన్ని ముంచెత్తుతున్న ఈ తరుణంలో పత్రికలు నిర్వహించడం కత్తి మీద సామే. అందునా పదేళ్లపాటు నిరంతరంగా కొనసాగడం, ప్రకటనల పటాటోపాలు, వ్యాపార ధోరణులకు దూరంగా, పవిత్రంగా, పాఠకుల ప్రయోజనమే లక్ష్యంగా ఇన్నేళ్లు కొనసాగడం పత్రిక యాజమాన్యం సంపాదకవర్గం సిబ్బంది రచయితల అభిమానుల సమిష్టి కృషికి తార్కాణం.

వివిధ శీర్షికల రూపంలో దక్కన్ ల్యాండ్ ప్రకటిస్తున్న విషయాలన్నీ విస్తారమైన సమాచారంతో లోతైన విశ్లేషణ చక్కగా చిక్కగా రూపొంది అభిరుచి గల పాఠకులను ఆకర్షిస్తాయి. ఇంతవరకు వెలువడిన సంచికలను తిరగవేస్తే ఎక్కడా పొల్లు రాతలు సొల్లు కూతలు మచ్చుకి కూడా కనిపించవు. ఇటువంటి సాధికార పత్రికలు సమాజంలో అరుదుగా కనిపిస్తుంటాయి. ఆ వరుసలో తెలుగులో దక్కన్ ల్యాండ్ అగ్రభాగాన నిలుస్తుంది. పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయాల దాకా అన్నిచోట్ల వివిధ వ్యక్తులు వ్యవస్థలు నిర్వహిస్తున్న గ్రంథాలయాల్లో విశేషించి ఇంటింటా ఉండవలసిన పత్రిక దక్కన్ ల్యాండ్. పోటీ పరీక్షలకు అవసరమైన అమూల్యమైన సమాచారం దక్కన్ ల్యాండ్ అందిస్తున్నది. ప్రత్యేకించి విశ్లేషకులకు, వ్యాసకర్తలకు, పరిశోధకులకు, పరిపాలకులకు దక్కన్ ల్యాండ్ ప్రతి సంచిక ఒక కర దీపిక. వేదకుమార్ గారికి అభినందనలు.

– డా. అయాచితం శ్రీధర్, m : 9849893238

### నిబద్ధతకు నిలువుటద్దం – దక్కన్‌ల్యాండ్

దక్కన్‌ల్యాండ్ మాసపత్రిక అంటే నిబద్ధతకు, వాస్తవికతకు నిలువుటద్దం. చరిత్రను, వర్తమానాన్ని నిశ్శబ్దంగా రికార్డు చేస్తున్న సామాజిక, రాజకీయ పత్రిక. విజయవంతంగా పదకొండేళ్లు పూర్తి చేసుకుని పన్నెండవ ఏట ప్రవేశిస్తున్న సందర్భంగా దక్కన్‌ల్యాండ్ యాజమాన్యానికి, సంపాదకులు మణికొండ వేదకుమార్ గారికి హృదయపూర్వక అభినందనలు.

అనివార్యంగా డిజిటల్ యుగంలోకి ప్రవేశించిన మనం పత్రికను నిరంతరాయంగా పదకొండేళ్లు పూర్తి చేసుకొని విజయవంతంగా పన్నెండో ఏట ప్రవేశించడం ఒక గొప్ప విజయం. దక్కన్ ల్యాండ్ ఏ సంచికకు ఆ సంచిక ప్రత్యేకమైనదే. వర్తమాన రాజకీయ పోకడలు, పర్యావరణం, మన చరిత్ర, మన సంస్కృతి వంటి అనేక అంశాలను అక్షరబద్ధం చేయడంలో కఠోర నియమాలు విధించుకున్నదని దక్కన్‌ల్యాండ్ పాఠకులకు తెలుసు. మనం మరిచిపోయిన అనేక విషయాలతో పాటు ఈ ప్రాంత అనేక విషయాలపట్ల పరిశోధనలు చేసి చక్కటి వ్యాసాలతో, విశేషాలతో భావితరాలకు పనికొచ్చే విధంగా నిబద్ధతతో తీర్చిదిద్దడంలో దక్కన్ ల్యాండ్ పత్రిక విజయవంతమైందనే చెప్పాలి. ఏ విషయం మీద రాసిన వ్యాసమైన నిజాయితీతో, అతిశయోక్తులు లేకుండా విశ్లేషణాత్మకంగా, ఆలోచనాత్మకంగా ఉండటం ఒక ప్రత్యేకత తెలంగాణలో ఇంత రెగ్యులర్‌గా వస్తున్న మాసపత్రికలు లేవనే చెప్పాలి. ఈ నాటి యువతకు, విద్యార్థులకు వర్తమాన సామాజిక, రాజకీయ అంశాలపట్ల అవగాహన కలిగించడంలో దక్కన్ ల్యాండ్ పాత్ర ఎంతో ఉంది.

పత్రికలకు కొన్ని ఉద్దేశాలుంటాయి. తమ తమ ఉద్దేశాలను పాఠకుల మీద ప్రభావం చూపే ప్రయత్నమూ చేస్తాయి. కాని ఉన్నదున్నట్లు జరిగిందీ, జరుగుతున్నది ఒక చారిత్రక ప్రయాణంలా ఎప్పటికప్పుడు పొందుపరచడం కష్టమైన పనే. నిజాయితీగా, నిబద్ధతతో, ఉన్నత విలువలతో దక్కన్ ల్యాండ్ పత్రికా రంగంలో ప్రత్యేకతను నిలుపుకుంటున్నందుకు మరోసారి అభినందిస్తూ...

'పత్రికొక్కటున్న పదివేల సైన్యంబు' అన్న నార్ల మాటను గుర్తు చేసుకుంటూ ఒక నాడు గొలకొండ పత్రిక ఆత్మ గౌరవాన్ని నిలబెడితే ఇవ్వాల దక్కన్ ల్యాండ్ పత్రిక వేదకుమార్‌గారి నేతృత్వంలో తెలంగాణ మట్టి పరిమళాన్ని మూటగట్టి భావితరాలకు అందిస్తున్నందుకు అభినందిస్తూ... –కోట్ల వెంకటేశ్వరరెడ్డి, m : 9440233261

– దక్కన్‌న్యూస్

# గాలీబ్ కోర్టు ప్రస్థానం

**1837**వ సంవత్సరంలో గాలీబ్‌కి రూ. 5,000లు అప్పు ఇచ్చిన వ్యక్తి అది తిరిగి పొందడానికి గాలీబ్ మీద దావా దాఖలు చేశాడు. గాలీబ్‌కి వ్యతిరేకంగా మనీ డిక్రీ కూడా జారీ అయ్యింది. గాలీబ్ మిత్రుడెవరో ఆ డబ్బుని అతనికి చెల్లించాడని చెబుతారు. గాలీబ్ తీసుకున్న మరో లోన్ కట్టకపోవడం వల్ల 1848వ సంవత్సరంలో గాలీబ్ ఇంటి మీద దాడి జరుగుతుంది. గాలీబ్ జూదం ఆడుతున్నందుకు గానూ అతని మీద రూ॥100/- జరిమానాన్ని విధిస్తారు. గాలీబ్ జూదం ఆడటాన్ని మానుకోలేదు. ఆరు సంవత్సరాల తరువాత మళ్ళీ జూదం ఆడుతున్నందుకు అతని మీద కేసు నమోదవుతుంది. అతనికి ఆరు నెలల జైలుశిక్ష, రెండువందల రూపాయల జరిమానాన్ని విధిస్తారు.



కొత్వాల్ దురుద్దేశ్యంతో తన మీద కేసుపెట్టి శిక్ష విధించినారని ఆరోపిస్తూ కేసుని కోర్టులో కంటెస్టు చేస్తాడు. కానీ కోర్టు శిక్షని నిర్థారిస్తుంది. కఠిన కారాగార శిక్షకు బదులు సాధారణ జైలు శిక్షగా దాన్ని మార్పుచేస్తారు. చక్రవర్తి బహదూర్‌షా జాఫర్ ఈ విషయంలో జోక్యం చేసుకొని గాలీబ్ శిక్షని తగ్గించమని బ్రిటీష్ ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తాడు. కానీ ఫలితం లేకుండా పోయింది. సగం శిక్షను అనుభవించిన తరువాత బ్రిటీష్ సివిల్ సర్జన్ డాక్టర్ రాస్ గాలీబ్ శిక్షని తగ్గించమని బ్రిటీష్ ప్రభుత్వానికి సలహా ఇస్తాడు. మరో కవి మిత్రుడు మోమిన్ ఖాన్, డాక్టర్ రాస్‌ని కోరతాడు. రాస్ సలహాను బిట్రీష్ ప్రభుత్వం ఆమోదించి గాలీబ్‌ని విడుదల చేస్తుంది.

గాలీబ్, కోర్టులు, చట్టంతో వున్న సంబంధం అతని రచనలలో కొనసాగింది. అతని గజల్స్‌లలో చాలా చోట్ల న్యాయ పరిభాష కన్పిస్తుంది. దివాన్-ఎ-గాలీబ్ అదాలత్ (కోర్టు), పౌజుదారీ (క్రిమినల్ లా), షెరిష్టీదార్ (కోర్టు అధికారి), గవా(సాక్షి), తలాబ్ (సమీన్స్), హుక్మ్ (ఉత్తర్వులు), ముఖద్దమా(కేసు) వంటి పదాలు పదబంధాలు ఆయన గజల్స్‌లో కన్పిస్తాయి. అంతేకాదు ఢైమ్-ల్-హబ్స్ (జీవితఖైదు), గిరాహైర్(అరెస్టు) ముద్దాయి లాంటివి కూడా అతని గజల్స్‌లో చోటు చేసుకున్నాయి.

ఈ పదాలను మెటాఫోరికల్‌గా వాడినప్పటికి అతనికి న్యాయవ్యవస్థతతో వున్న పరిచయం కన్పిస్తుంది. ఇదే విషయాన్ని తాహిర్ మహామూద్ తన వ్యాసంలో పేర్కొన్నాడు.

ఫిర్ కుచ్ ఏక్ దిర్ కో బేఖరాల్ హై (మరోసారి హృదయం కొంత చంచలమైంది) అన్న అందమైన గాలీబ్ గజల్‌లో లీగల్ మెటఫర్స్‌ని గాలీబ్ విరివిగా వాడినాడు.

*"ఫిర్ ఖులా హైదార్-ఎ-అదాలత్-ఇ-నాజ్*
*గర్మ్ బజార్-ఎ-పౌజ్దారీ హై*
*ఫిర్ దియా పారా - ఇ - జిగర్ నెసవాల్*
*ఏక్ పార్యార్బ్-ఇ ఆహ-ఓ-జారాహై*
*ఫిర్ హుమే హైగవాహ్-ఇ-ఇష్క్*
*తలాబ్ అప్కారీ కా హుక్మ్ జారీహై*
*దిల్ -ఓ-మిజగాన్ కా జో ముఖద్ధుదూ*
*తా ఆజ్ ఫిర్ ఉస్‌కి రూబ్ కార్ హై"*

కోర్టు తలుపు మళ్ళీ తెరుచుకుంది. అక్కడ క్రిమినల్ కేసు బజార్‌లా చురుకుదనంతో వుంది. ప్రపంచం చీకటిలో కప్పబడి ఉంది. ఆమె కురులు కోర్టు రికార్డు రూమ్ కీపర్ల మాదిరిగా వున్నాయి. నా హృదయంలోని ఓ ముక్క నీ ముందు దరఖాస్తులో వుంది. ఆ ఫిర్యాదులో నా నిట్టూర్పులు, మూలుగులూ వున్నాయి. ప్రేమ సాడిని మళ్ళీ పిలిచారు. కన్నీళ్ళు పెట్టుకోవాలని ఉత్తర్వులని జారీ చేశారు. గుండె, కనురెప్పల మధ్య వున్న పాత వివాదం మరోసారి విచారణకు వచ్చింది. చట్టాల పదాలతో తయారైన ఈ పద్యాలను తీసుకొండి.

*"జాన్‌దర్ హవా-ఇయాక్ నిగాహ్-ఎ-గర్మ్*
*హై అసద్వర్వానా హై వకీల్ తేరా దాద్-ఖ్వాహ్-కా"*

మీ ఆత్మ మీ పిటీషనర్ కేసుని వాదించడానికి నిప్పు మీద నిమగ్నమై వుంది.

*"దిల్ ముద్దాయి ఓదీదా బినా ముద్దా*
*అలాహ్ నజ్జార్ కా ముఖద్దరూ ఫిర్*

రూబకార్ హై”

వాడి కన్నులు, హృదయం రెండింటిని ప్రతివాది చూపుల కేసు విచారణను పిలిచారు.

కవిని రక్షించడానికి కవిత్వం:

గాలీబ్ కోర్టు జీవితం అతని కవిత్వాన్ని ప్రభావితం చేసింది. అతని కవిత్వం అతని రాతను కూడా నిర్ణయించింది, నిర్ధారించింది. ఇది చాలా ఉత్సాహంగా అన్పిస్తుంది. వైన్ మర్చంట్ గాలీబ్ మీద డబ్బు వసూలు చేసుకోవడానికి దావా వేశాడు. 1837వ సంవత్సరంలో గాలీబ్ మీద కేసు దాఖలై 5,000/- రూపాయల డిక్రిని జారీ అయ్యింది. ఆ కేసు ఈ కేసూ ఒకటేనని కొంత గందరగోళం ఏర్పడింది. ఈ కేసు ఢిల్లీలోని అత్యున్నత స్మాల్ కాజేస్ కోర్టు ముందుకు వచ్చింది. ముఫ్తీ సదరుద్దీన్ అన్న వ్యక్తి ఆ కోర్టుకి న్యాయమూర్తి. ఆ రోజుల్లో అది అత్యున్నతమైన కోర్టు. ఓ భారతీయుడు ఆ కోర్టుని అధిష్టించడం ఓ గొప్ప విషయంగా చెప్పుకోవచ్చు.

ముఫ్తీ సాహెబ్ స్వతహాగా కవి. గాలీబ్‌కి పాత స్నేహితుడు. ఇప్పుడు తెలిసిన వ్యక్తులు కోర్టు ముందుకు వస్తే న్యాయమూర్తులు ఆ కేసులని విచారించడానికి ఇష్టపడరు. కానీ ఆ రోజుల్లో అలాంటి పరిస్థితిలేదు. తెలిసిన వ్యక్తుల కేసులు తమ ముందుకు వచ్చినా అప్పటి న్యాయమూర్తులు విరమించుకోరు. కేసుని ఎలాంటి భయం కానీ, సంకోచం గానీ లేకుండా వింటారు. కోర్టు నుంచి సమన్స్ రాగానే కోర్టు ముందు గాలీబ్ హాజరైనాడు. కేసులోని క్లెయిమ్ గురించి ముఫ్తీసాబ్ అడిగా ఒప్పుకోమ్మని గాలీబ్‌ని అడిగాడు.

తరుచూ ఉదహరించే తన కవితని గాలీబ్ కోర్టు ముందు చదివాడు.

‘ఖార్జ్‌కీ పీటే తామ్‌మే,
రెకిన్ సమజ్‌చే తామ్ మై
కి హన్‌రంగ్‌లావేగి హమారీ ఫడా మస్తీ ఏక్‌దిన్’

నేను అప్పుడు తాగేవాడిని, కష్టాల్లో ఉండటం కోసం ఏదో అద్భుతాలు చేస్తుందని అనుకుంటున్నాను’.

ముఫ్తీ సాబ్ దీన్ని మౌఖిక అంగీకారంగా పరిగణించి, దావాను డిక్రీ చేస్తాడు. హతుడు చెల్లించాల్సిన డబ్బులు అతనే చెల్లించి గాలీబ్‌ని ఇంటికి పంపించి వేస్తాడు.

ఇప్పుడు వస్తున్న తీర్పుల్లో కొంతమంది న్యాయమూర్తులు గాలీబ్‌ని తరుచూ పేర్కొంటూ వుంటారు. వాటి గురించి మరోసారి.

-మంగారి రాజేందర్ (జింబో)
m : 9440483001
e : rajenderzimbo@gmail.com

ద

## చందాదారులుగా చేరండి... చేర్పించండి...

***పాఠకులకు, రచయితలకు, పరిశోధకులకు... నమస్సులు.***

తెలంగాణ ఉద్యమ సందర్భంలో పుట్టిన తెలుగు మాసపత్రిక దక్కన్‌లాండ్. తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో ఉద్యమానికి దిశా నిర్దేశం చేసేలా ఎందరో ప్రముఖుల వ్యాసాలను అందించింది. టిఆర్‌సి ‘చర్చ’ సారాంశాలను ప్రజల్లోకి తీసుకెళ్ళింది. తెలంగాణ భావజాలాన్ని బలోపేతం చేసింది. స్వరాష్ట్ర ఆవిర్భావం తర్వాత దక్కన్‌లాండ్ తెలంగాణ పునర్ నిర్మాణంతో తనదైన పాత్రను పోషిస్తున్నది. తెలంగాణ తనదైన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి, మరింత పరిపుష్టం చేసుకునేదానికి దోహదం చేస్తున్నది.

ఈ నేపథ్యంలో సామాజిక అంశాలతోపాటు, పర్యావరణం, చరిత్ర, వివిధ చేతివృత్తుల కళారూపాలు, నైపుణ్యాలు, వారసత్వం, పర్యాటకం లాంటి అంశాలపై కథనాలను వెలువరిస్తున్నది. ప్రజా సంక్షేమం కోసం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లుతుంది. 2012 సెప్టెంబర్‌లో ప్రారంభమైన పత్రిక ఇప్పటి వరకూ మీ అందరి సహకారాలతో కొనసాగుతూ వస్తుంది. ఇప్పటికే ఎంతో మంది మిత్రులు, శ్రేయోభిలాషులు, తమ చందాలతో పాటు, చందాదారులను చేర్పించడంలో తమ సహకారాన్ని అందిస్తున్నారు. వారికి ధన్యవాదాలు.

అయినప్పటికీ పత్రిక నిర్వహణ కష్టసాధ్యంగా ఉంది. దక్కన్‌లాండ్ మనందరిది. పదికాలాల పాటు పత్రిక సజావుగా వెలువడే బాధ్యత మన అందరిదీ.

చందా పూర్తయిన వారు తమ చందాలను రెన్యూవల్ చేసుకుని కాంప్లిమెంటరీ కాపీలు అందుతున్న వారు కూడా చందాదారులుగా చేరి, మిత్రులను చేర్పించి సహకరిస్తారని ఆశిస్తూ...

ధన్యవాదాలతో... మీ
**- మణికొండ వేదకుమార్**
సంపాదకులు

**చందా వివరాలు:**

వార్షిక చందా : రూ. 300 2 సం॥లకు : రూ. 600

*‘దక్కన్ ల్యాండ్’ పేరిట ఎం.ఓ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**చిరునామా :**

**DECCAN LAND :**
**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com ww.deccanland.com

**దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరములు:**

| | |
|---|---|
| Name | : DECCAN LAND |
| Bank | : KOTAK MAHINDRA BANK |
| A/c No | : 7111218829 |
| IFSC Code | : KKBK0007463 |
| Branch Code | : 007463 |

# ఇంద్రేశం ఒక పురా చారిత్రక సందేశం


ఇంద్రదేశం గుడి

సంగారెడ్డి జిల్లా పటాన్-చెరు మండలంలో ఇంద్రేశం, ఐనోల్, కర్దనూర్, క్యాసారం, చిట్కుల్, చిన్నకంజర్ల, నందిగావ్, పాటి ఘన్‌పూర్, పాశమైలారం, పెద్దకంజర్ల, పోచారం, పటాన్‌చెరు, బచ్చుగూడ, భానూర్, ముతంగి, ఇస్నాపూర్, రామేశ్వర్‌బండ, రుద్రారం, లక్దారం గ్రామాలున్నాయి. గ్రామనామాలను విశ్లేషిస్తే ఎక్కువమట్టుకు శైవసంబంధమైన పేర్లే ఎక్కువ.

ఇంద్రేశంలో చరిత్రపూర్వయుగం నుంచి ఈ ప్రాంతంలో మానవుల ఆవాసాలుండేవని తెలిపే ఆధారాలు కొత్తరాతియుగం మానవులు తమ రాతిగొడ్డండ్లకు పదునుపెట్టుకున్న నూరుడు గుంటలు దొరికాయి.

వేల సంవత్సరాల మనిషి చరిత్ర ఇక్కడుంది. బుద్ధుని కాలంలోనే బౌద్ధం వచ్చిందిటువైపు. మౌర్యసామ్రాజ్యం, సాతవాహన, ఇక్ష్వాక, వాకాటక, విష్ణుకుండిన, బాదామీచాళుక్య, రాష్ట్రకూట, కళ్యాణీ చాళుక్య, కాకతీయ, ముసునూరు నాయక, వెలమనాయక, బహమనీ, మొఘల్, ఆజంజాహీలందరి పాలనలో ఉన్నది ఈ ప్రాంతం.


స్వచ్ఛంద భైరవుడు

ఒకప్పుడు రాష్ట్రకూటుల నుంచి చాళుక్యుల పాలనదాక రాజపోషణలో జైనమత ప్రాభవం వుండేదిక్కడ. చాళుక్య చక్రవర్తి జయసింహుని(జగదేకమల్లుడు, క్రీ.శ.1014-1044) భార్యలలో ఒకరైన సుగ్గలదేవి శైవభక్తురాలు. రాజేమో జైనమతానుయాయి. జైనులకు బసదులు కట్టించడం, జైనమునులకు, జైనశ్రావకులకు ప్రాధాన్యతనివ్వడం, వారికోసం రాజధనం వెచ్చించడంతో జైనం రాజాశ్రయ మతంగా అతిశయించడం ఇష్టంలేని శైవమతగురువులు రాణితో శైవమతాన్ని కాపాడాలని కోరారు. రాణి రాజును శైవమతానికి ఆశ్రయం కల్పించమని, శైవమతగురువులు గొప్పవారని నిరూపిస్తానన్నది. రాజు జైనులు ఓడిపోయిన పక్షంలో తాను శైవం స్వీకరిస్తానన్నాడట. శైవగురువు గెలవడంతో మాటప్రకారం రాజు జైనులను వెళ్ళగొట్టాడట. జయసింహుడు శైవుడైనాడట. శైవమతస్తులు 800మంది జైనులను హింసించి, చంపి, వారి 500 జైనబసదులను(దేవర దాసమయ్య) కూల్చారని గొప్పగా చెప్పుకున్నారు. (పండితారాధ్య చరిత్ర) కాలక్రమంలో రాష్ట్రకూటులనోడించిన పశ్చిమ/కళ్యాణీ చాళుక్యులు ఈ ప్రాంతపాలకులైనారు. వారిలో చాలామంది జైనాన్ని పోషించారు. కొందరు చాళుక్యులు మాత్రం శైవమతానికి ప్రాధాన్యతనిచ్చారు.

జయసింహుని తర్వాత రాజ్యానికి వచ్చిన త్రైలోక్యమల్లుని కాలంలో ఆరాధ్యశైవ గురువుల పేరన పంచమఠస్థాపన చేసి, పోషణకు దానాలు చేయడంతో అక్కడ శైవమత కేంద్రం ఏర్పడ్డది. అక్కడ జైనులకు, కాలాముఖులకు నిత్యసంఘర్షణలు జరుగుతుండేవి. 1034లో జగదేకమల్లుడు(జయసింహుడు) ముచ్చెనపల్లి గావుండాగా అగ్గలయ్య వినతిమేరకు యాదాద్రి-భువనగిరి జిల్లాలోని ఇక్కుర్తి, ముచ్చెనపల్లిలలోని రెండు జైనబసదులకు దానాలు చేసినట్లు సైదాపురం శాసనం చెప్తున్నది. పటాన్-చెరు ప్రాంతంలో జైనమతావలంబకులు ఎక్కువగా ఉండడం చేత గ్రామాలపేర్లలో కొన్ని జైనమత సంబంధమైన పేర్లతో గ్రామాలు ఏర్పడ్డాయి. అటువంటి గ్రామమే ఇంద్రూరు. శైవమత ప్రాభవం పెరిగిన తర్వాత అది ఇంద్రేశంగా మారింది. భట్టారక నామం జైనంతో ఎక్కువగా ముడివడివుండే పేరు.

ఇంద్రేశంలోని దేవాలయ నిర్మాణవాస్తు, శిల్పాలశైలిని పరిశీలించినపుడు అవి ఎక్కువగా బాదామీ చాళుక్యులు, రాష్ట్రకూటులు, కళ్యాణీ చాళుక్యుల కాలాలకు చెందినవిగా గుర్తించడం జరిగింది.

చిన్న పరుపురాతిబండమీద కట్టిన శివాలయానికి ముందర ప్రవేశం కొరకు నిలిపిన దేవాలయ ద్వారతోరణాలు రెండు వేర్వేరు కాలాలవి. మొదటి ద్వారతోరణం శైలిరీత్యా ఈ ద్వారతోరణం రాష్ట్రకూటులకాలానిదే. జైనదేవాలయ ప్రవేశద్వారమని చెప్పవచ్చు.

ద్వారస్తంభానికి ద్వారపాలక స్థానంలోని శిల్పం ద్విభుజి. కుడిచేతిలో తామరమొగ్గ, ఎడమచేతిలో కలశం ధరించి త్రిభంగిమలో


ఇంద్రదేశం 1వ తోరణ ద్వారం


ఇంద్రదేశం 2వ తోరణ ద్వారం


ఇంద్రదేశం ద్వారంపై యక్షిణి


ఇంద్రదేశం ద్వారంపై గణపతి


గణపతి శాసనం

నిల్చున్న ద్వారపాలికకు స్తూపపట్టకిరీటం/జటామకుటం? వుంది. మెడలో హారం వుంది. చెవులకు వేలాడుతున్న జూకాలున్నాయి. చేతులకు కంకణాలున్నాయి. కాళ్ళకు కడియాలున్నాయి. అర్ధనగ్న దేహం. ఈమె నదీదేవత అని చరిత్రకారుడు ఈమని శివనాగిరెడ్డిగారి అభిప్రాయం. ద్వారానికి రెండోవైపు గణపతి శిల్పముంది. తలపై కిరీటమకుటంతో, లలితాసనంలో కూర్చుని వున్న గణపతికి నాలుగు చేతులు. ముందర కుడిచేతిలో విరిగిన దంతం, ఎడమచేతిలోని మోదకాన్ని అందుకుంటున్న తొండంతో, ఉదరంపై నాగబంధంతో గణేశుడు అగుపిస్తున్నాడు. ఈ తోరణద్వారస్తంభం ఒకదాని మీద శాసనం వుంది. దీనిని అచ్చుతీసి పరిష్కరించవలసి వుంది.

రెండవ తోరణ ద్వారంపై అంచున చూరుకు చెక్కిన 15గూటిశిల్పాలున్నాయి. తోరణదూలానికి కిందివైపు 5మొగ్గలు (డ్రాప్స్) వున్నాయి. ఈ ఐదు బొడిపెలవలె కాక దిమ్మెలరీతి చెక్కిన వీటి నడుమ ఆరు అర్ధవలయా లున్నాయి. ఈ తోరణద్వారానికి ద్వారస్తంభాలు ఉత్తరాశిని కలిపేచోట రెండువైపుల 4సింహాల బ్రాకెట్లున్నాయి. ఈ సింహాల నోట్లోంచి బయటకు వస్తున్న నాలుకలను రెండు ముందరికాళ్ళతో పట్టుకున్నాయి. ఆ నాలుకలు లతలుగా, వైవిధ్యమైన రూపాలతో వాటి వెనుకకాళ్ళకిందదాకా సాగాయి. సింహాల తలలు పైనున్న తోరణం పై దూలాన్ని మోసే భారవాహకులుగా బ్రాకెట్లలో పెట్టబడ్డాయి. స్తంభాలపై నలువైపుల కుదులు, కీర్తిముఖాల నుంచి జారుతున్న ముత్యాల సరులు, నాలుగుకొసలకు హంసలుగా అవతరిస్తున్న లతలు, కింద హంస, పుష్పాలు, రెండు హంసలతోకలు కలిసిన శృంగం, వాటి తోకల లోపల మళ్ళీ రెండు హంసలతో కూడిన రాష్ట్రకూట చిహ్నం చెక్కబడ్డాయి. దానికిరువైపుల మళ్ళీ హంసలే. హంసలను రాష్ట్ర కూటులు దేవాలయాల ప్రస్తరాలలో, గోడల మీద, స్తంభాల మీద చెక్కించారు. ఇది వారి ప్రత్యేకమైన శైలి. కాకతీయతోరణాలకు ముందరి కాలానికి, వాటికి ఆదర్శప్రాయమైన ద్వారతోరణాలు ఈ ప్రాంతంలో నందికంది, వెల్దుర్తులలో వున్నాయి.

**ధ్వజస్తంభం:** ఈ స్తంభానికి పైన వుండవలసిన మంటపపుగూడు లేదు. స్తంభం కిందివైపు 4పలకలు, మధ్యలో 8పలకలు, పైన గుండ్రంగా వుంది. స్తంభానికి రాతివేదిక అమర్చివుంది. ఈ పద్ధతి, ఈ స్తంభశైలి మనకు జైనమానస్తంభాలలోనే కనిపిస్తుంది. జైనమానస్తంభాలు కొలనుపాకలో, అక్కడికి సమీపంలోని అమ్మనబోలులో కనిపిస్తాయి.


**నందులు:** ఇక్కడ దేవాలయ ప్రాంగణంలో మూడునందులు కనిపిస్తున్నాయి. రెండు నందులు ముక్కలుగా విరిగిపోయి వున్నాయి. ఒక నంది శిల్పంలో మూతిలేని నందితల మూపురం వరకు విరిగిన ముక్క వుంది. నంది రత్నాలంకృత ముఖపట్టం మీద కీర్తిముఖం బిళ్ళ వుంది. మెడలో వేలాడుతు కనిపిస్తున్న గంటలపట్టెడ, దానికి లోపల మెడకు కట్టిన పూసలదండ కనిపిస్తున్నాయి. రెండవ నంది కూడా సరిగ్గా మొదటి నందిలెక్కనె మూపురం వరకు విరగగొట్టబడివుంది. నంది ముఖపట్టం అలంకృతమై వుంది. పిడికెడు కొమ్ములు, చెవులు రిక్కించి వున్నాయి. మెడలో రెండు వరుసల పూసలదండ వుంది. కొంచెం గంటలపట్టెడ అంచు కనిపిస్తున్నది. నంది నడుము భాగం కొంచెం దూరంలో వుంది. నందిమూపుమీద నుంచి ముందుకు మెడకు, వెనుకకు తోకకిందుగా కట్టిన గంటల పట్టెడ శైలి చాళుక్యశైలి అనిపిస్తున్నది. మూడవ నంది దెబ్బతినకుండా సంపూర్ణంగా వున్న శిల్పం. చక్కని ముఖవర్చస్సు, ముఖంమీద కట్టిన పట్టం, పిడికెడు కొమ్ముల కిందనుంచి కట్టిన పట్టికకు గొలుసులకన్నెలు తోరణాల రీతిగా అలంకరించబడివున్నాయి. చిన్న చెవులు. నంది మెడలో ముడులు కట్టిన రెండువరుసల తాడు వుంది. చక్కటి నంది మూపురం వెనక దర్భముడి వేసిన పెద్దగంటల పట్టెడ మెడకిందనుంచి వేలాడుతున్నది. ముడిచిన వెనకకాళ్ళ మీద కూర్చుని ముందరి కాళ్ళమీద ఒరిగిన నంది. చక్కని శిల్పకళ. ఇది బాదామీ చాళుక్యుల శిల్పశైలి.

**సప్తమాతృకలు:** యజుర్వేదంలోని 16వ అధ్యాయం శతరుద్రీయ హోమమంత్రాలలో 24వ మంత్రం 'ఉత్కృష్ట సేవికలతో కూడిన బ్రాహ్మీ మొదలైన మాతృకలకు వందనం. బాధించు సామర్థ్యంగల దుర్గ మొదలైన మాతృకలకు వందనం' అంటుంది. చతుష్షష్టీ యోగినులలోని సప్తమాతృకలు అర్ధదేవతలు, యుద్ధదేవతలని తంత్రసారం చెప్తున్నది. పరిపాలకులైన బాదామీ చాళుక్యుల నుంచి కళ్యాణీచాళుక్యుల వరకు తాము సప్తమాతృకాపరిరక్షితులమని చెప్పుకున్నారు. ఇంద్రేశంలో సరస్వతి, వినాయకులతో కూడిన సప్తమాతృకల శిల్పపట్టిక వున్నది. ఈ మాతృకాశిల్పపట్టిక బాదామీచాళుక్యులు లేదా రాష్ట్రకూటులనాటిది కావచ్చు.

**భట్ట వినాయకుడు:** ఇంద్రేశంలో చెరువుకట్టమీది రాతిగుండుపై చెక్కివున్న ఒక శాసనాన్ని పురావస్తుశాఖ మెదక్ జిల్లా శాసన సంపుటిలో 104వ శాసనంగా 209వ పేజీలో ప్రచురించారు. ఈ సంస్కృతభాషా శాసనంలో "శంకరదాసి వీణాచార్య జోగీశ్వరభట్ట గణపతిని ప్రతిష్టించి"నట్లు చెప్పబడింది. (10-11వ శ.) జైనాన్ని అణిచి వేయడంలో పేరుగన్నవారు కూడా శంకరదాస పేరుతో వుండడం గమనార్హం.

**శాసనపాఠం:**

1. శ్రీసంకర, 2. దాసి వీ, 3. ణాచార్యం, 4. జోగీశ్వర, 5.

|  |  |  |  |  |  |
|---|---|---|---|---|---|
| పద్మదళం | జైనమాన స్థంభం | సప్తమాతృకా ఫలకం | జైనశిల ద్వారశాఖ | పాత శివలింగం | జోగేశ్వరభట్ట గణపతి |

భట్ట గణ, 6. పతి ప్రతి, 7.క్షితా క్రితం

**సరస్వతి శిల్పం:** సరస్వతి విగ్రహం శకలమైంది. సరస్వతిదేవి చేతుల్లో అంకుశం, పాశం, పుస్తకం కనిపిస్తున్నాయి. అక్షమాల వుండే కుడిచేయి విరిగిపోయింది. సిద్ధాసనంలో పద్మపీఠంపై కూర్చుని వుంది దేవత. జైన సరస్వతి శిల్పమిది.

**నాగశిల్పాలు:** ఇంద్రేశంలో 3తలల నాగశిల్పం, జంటనాగుల శిల్పం, 7పడగల నాగశిల్పం అగుపిస్తున్నాయి. కుడిచేతిలో పుష్పం, ఎడమచేతిలో జలపాత్రతో, రెండువైపుల నాగులతో కనిపిస్తున్న ఈ నాగదేవత యక్షిణి అనిపిస్తున్నది. చెరువుకట్ట రాతిగుండుకు కూడా నాగులబొమ్మలు చెక్కివున్నాయి.

**శివలింగం:** చతురస్రాకారపు పానవట్టం తొడిగివున్న 9అడుగుల శివలింగం బయటపడివున్నది. లింగంమీద బ్రహ్మసూత్రం వుంది. చాళుక్యశైలి శివలింగమిది.

**త్రిపురసంహారమూర్తి:** ఇంద్రేశం దేవాలయం గోడమీద కనిపిస్తున్న నటరాజ తాండవశిల్పం వుంది. శివుడు మూడుతలలతో కనిపిస్తున్నాడు. కుడిపక్క బ్రహ్మ, ఎడమపక్క విష్ణువు, శివుని కుడికాలివైపు వినాయకుడున్నారు. తాండవ భంగిమలో నిల్చున్న శివుని ఎడమవైపు ఆరుచేతులలోని ఆయుధాలలో విల్లు ప్రధానంగా కనిపిస్తున్నది. కుడివైపు ఆరు చేతులలోని ఆయుధాలలో బాణం కనిపిస్తున్నది. ఇది త్రిపురసంహారమూర్తి శిల్పమే. ఎర్లీ కాకతీయ శైలి.

**దశానన తాంత్రిక స్వచ్ఛంద భైరవుడు:**

ఇదొక అరుదైన తాంత్రికమూర్తి. 10తలలు(దశాననుడు), 20 (వింశతి హస్తుడు) చేతులు, చేతులలో ఖడ్గం, ఖేటకం, పరశువు, ముద్గరం, ఢమరుకం, గంట, వజ్రం, విల్లు, బాణం, రక్తపాత్ర, ఖట్వాంగం, త్రిశూలం, చక్రం, పాశం, అంకుశం, శిరస్సు, (వీణ)వంటి 17 ఆయుధాలున్నాయి. కుడివైపు రెండవ చేతిలో అక్షమాల ప్రత్యేకం. ముందు కుడిచేయి అభయహస్తం. ఎడమచేయి ముద్రపట్టినట్లున్నది. వీరాసనంలో కూర్చున్న శైవమూర్తి కుడికాలికింద అసుర శిరస్సు, మడిచిన ఎడమకాలికింద రెండు శిరస్సులున్నాయి. మూర్తికి ఉదరబంధం, మెడలో నాగహారం, భుజాల మీద నుంచి ముండ(కపాల)మాల కనిపిస్తున్నాయి. కుడివైపు కుడికాలిపై ఎడమకాలు వేసి కూర్చున్న కాలాముఖగురువు ఎడమ చేయెత్తి వ్యాఖ్యానముద్రపట్టి, అతని కిందవైపు కనిపిస్తున్న శిష్యునికి స్వచ్ఛందభైరవ తంత్రాన్ని ఉపదేశిస్తున్నట్లున్నాడు. భైరవమూర్తి చుట్టు తోరణం చెక్కినట్లు కనిపిస్తున్నది. చెరువుపక్క రాతిగుండుకు చెక్కివున్న ఈ దశాననభైరవుని శిల్పం స్వచ్ఛందతంత్ర భైరవమూర్తి.

**'స్వచ్ఛంద భైరవచ్ఛందః క్రోధ ఉన్మత్త భైరవః** గ్రంథాంతరాణి చత్వారి మంత్రపీఠం వరాననే' (స్వచ్ఛంద తంత్రం–212) అంటుంది తంత్రశాస్త్రం. ఇపుడీ స్వచ్ఛందతంత్ర భైరవుడు ఒక మంత్రపీఠానికి చెందినవాడని శాస్త్రార్థం చెప్పుకోవచ్చు.

**జైన దేవాలయ ద్వారస్తంభం:** ఈ దేవాలయ పరిసరాల్లో లభిస్తున్న విడివిగ్రహాలలో నాగుల శిల్పాలతో పాటు జైనాలయ ద్వారానికి ఎడమవైపున నిలిపిన స్తంభం లోపలి అంచు మీద 11మంది జైనతీర్థంకరులు వరుసగా ఒకరి కింద మరొకరి ప్రతిమలు చెక్కివున్నాయి. రెండవవైపు కూడా 11మంది తీర్థంకరులను చెక్కిన కుడి ద్వారస్తంభముండి వుంటుంది. ఇంద్రేశంలో తొలుత జైన దేవాలయం వుండేదని, కాలక్రమంలో దానిని తొలగించి, శివాలయం కట్టివుంటారని తెలుస్తున్నది.

**పద్మపీఠం:** ఒక చతురస్రాకారపు రాతిబిల్లమీద వికసిత అష్టదళపద్మం చెక్కివుంది. దీనిమీద ఒక గుండ్రని రాతితొలి లోతుగా, మరి రెండు లోతుతక్కువ 4అంచుల తొలులున్నాయి. తొలులనుబట్టి ఆసనస్థితిలో వున్న ప్రతిమను ప్రతిష్ఠించివుండాలి. జైనతీర్థంకరుని ప్రతిమ వుండేదేమో.

**వైష్ణవమూర్తి శిథిల శిల్పం:** బయట దొరుకుతున్న శిథిల, జీర్ణ శిల్పాలలో ఒక విరిగిన పాదాల జత కనిపించింది దానికింద ఉన్న రాతిపీఠం ఎదుటి అంచుమీద గరుడుని శిల్పం ఛాయగా కనిపిస్తున్నది. ఆ పాదాలకు ఎడమవైపు విరిగిన మరొక శిల్పం కాలు సగం కనిపిస్తున్నది. ఈ పీఠం వెనక ఒక స్త్రీ దేవతామూర్తిని చెక్కిన తోరణస్తంభంలోని కొంతభాగం కనిపిస్తున్నది. వీటిని కలిపి చూసినపుడు ఈ ఇది వైష్ణవమూర్తి విగ్రహమున్న పీఠమని, ఇవన్నీ ఆ శిథిల శిల్పంలోనివే నని అర్థమవుతుంది.

- ఇంద్రేశంలో పెద్ద రాతిగుండుకే ఒకచోట సూర్యచంద్రులు, పొడవైన లగుడం బొమ్మ గీసి వున్నాయి. సూర్య, చంద్రుల కింద ఒక పంక్తి లిపి కనిపిస్తున్నది. సూర్య, చంద్రులు, లిపి కనిపిస్తే శాసనం అని గట్టిగా చెప్పొచ్చు.
- వైవిధ్యభరితమైన శిల్పాలతో ఇంద్రేశం ఒక చారిత్రకక్షేత్రం. జైన, శైవమతాల ప్రాభవ, పతనాలను ఒకేచోట దాచుకున్న కాలనాళిక.

**ధన్యవాదాలు:** 'ఇంద్రేశం' మీద మోనోగ్రాఫ్ తేవడానికి సంపూర్ణ సహకారమందించిన చరిత్రకారుడు, రచయిత, భాస్కరుని వేంకట భద్రగిరీశ్ గారికి(కెమికల్ ఇంజనీర్, కాలుష్య నియంత్రణ మండలి, తెలంగాణ ప్రభుత్వం). **ఫోటో కర్టెసీ:** బీవీ భద్రగిరీశ్, చౌడం పురుషోత్తం, వేముగంటి మురళీకృష్ణ, డా. ఈమని శివనాగిరెడ్డిగార్లకు.

– శ్రీరామోజు హరగోపాల్, m : 99494 98698
e: akshara25@gmail.com

# బహుజనుల ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ

నాటి తెలంగాణ సాయుధ పోరాట వీర వనిత, చిట్యాల (చాకలి) ఐలమ్మ. బహుజన ఆత్మగౌరవానికి ఆమె ప్రతీక. ఐలమ్మ జయంతి (సెప్టెంబర్ 26) సందర్భంగా ప్రముఖులు, వివిధ సంఘాలు నివాళులు అర్పించారు. నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయి. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన తెగువ, పౌరుషం తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని చాటి చెప్పాయి. తెలంగాణ మట్టిలోనే పోరాటతత్వముందని చెప్పడానికి ఐలమ్మ జీవితమే నిదర్శనం.

## చిట్యాల ఐలమ్మ

నిజాం రాష్ట్రం ఆంధ్ర మహాసభ నాయకత్వంలో భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంగా నిలబడ్డది, పోరాటాలకు స్ఫూర్తినిచ్చింది, ఆమె చరిత్ర తెలంగాణకు గర్వకారణం. వరంగల్ జిల్లా రామపర్తి మండలం కిష్టాపూర్ గ్రామంలో ఓరుగంటి సాయిలు, మల్లమ్మ దంపతులకు చాకలి ఐలమ్మ (చిట్యాల ఐలమ్మ) 1895 సెప్టెంబర్ 26న జన్మించింది. తన 14వ ఏటనే జనగామ జిల్లా చిట్యాల గ్రామానికి చెందిన నరసయ్యతో బాల్య వివాహం జరిగింది. ఐలమ్మ సంతానం ఐదుగురు కుమారులు ఒక కుమార్తె, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం కావడంతో కులవృత్తితో పాటు వ్యవసాయం కూడా చేసేవారు.



వారికి సొంత భూమి లేకపోవడం వల్ల మల్లంపల్లి మక్తదార్ ఉత్తమ రాజు కొండలరావు దగ్గర నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకున్నారు. ఐలమ్మ చురుకైన మహిళ, ధైర్యవంతురాలు, కలుపుగోలు మనిషి. ఆమెకు ఊరి ప్రజలతో మంచి సంబంధాలు ఉండడం వల్ల ఊరి రైతులు వ్యవసాయ కూలీల సహకారంతో వ్యవసాయం చేసేవారు. తిండిగింజలు పోను మిగులు ఆదాయంతో సంతోషంగా జీవిస్తున్న వారి జీవితంలోకి పెత్తందారీ భూస్వాములు అడుగు పెట్టి వారి పంటఖు దోచుకోడానికి అరాచకం సృష్టించారు. పాలకుర్తి పోలీస్ పటేల్ శేషగిరిరావు ఐలమ్మను కుటుంబంతో వచ్చి తన పొలంలో పని చేయాలని ఒత్తిడి చేయడంతో పని చేయడానికి నిరాకరించింది. పాలకుర్తి పట్వారీ పప్పులుడకక ఐలమ్మ కుటుంబం కమ్యూనిస్టుల్లో చేరిందని విసునూర్ దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డికి ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అగ్రనాయకులతో పాటు ఐలమ్మ కుటుంబాన్ని ఇరికించారు. అయినప్పటికీ న్యాయస్థానంలో తీర్పు దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా వచ్చింది.

వంగి దండాలు పెట్టే రోజుల్లో సివంగిలా గర్జించింది ఐలమ్మ. ఆమె కొంగు నడుముకు చుడితే దొరతనం తోక ముడిచింది. ఆమె కొడవలి చేతబడితే పీడిత జనం కదలిలా తరలివచ్చారు. ఆడదని అలుసుగా చూసిన కంట్లో నలుసు అయింది. ఆమె తెగింపుతోనే వెట్టిచాకిరీ ముగింపునకు వచ్చింది. దొరను ఢీ కొన్న ధీర వనిత. నడీడులో గడీలను గడగడలాడించింది. ఎత్తిపట్టిన చేతిలో ఎర్రజెండా అయింది. ఆమె ఎవరో కాదు వీరనారి చాకలి ఐలమ్మ. ఆశయమే ఆశగా శ్వాసించింది. సాహసంతోనే సహవాసం చేసింది. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన పోరులో మమేకమైంది. భూమి లేకపోతే జిందగీ లేదని రక్తతర్పణం చేసిన బందగి దారిలో నడిచింది. పోరుదారిలో అయినవాళ్లను పోగొట్టుకొని అందరికీ అయినదానిలా నిలిచింది. సంఘముల చేరితే సంగతి చెప్తానన్న దొరకు ఏ గతీ లేకుండా చేసింది.

'బాంచెన్ నీ కాల్మొక్తా' అన్న జనం చేత బందూకు చేతబట్టించింది. వెట్టిచాకిరీ చేసేవారు అలగా జనం కాదు, సహస్ర వృత్తులు చేసే సకల జనం అని చాటి చెప్పింది. ఐలమ్మ కుటుంబాన్ని ఆర్థికంగా దెబ్బతీస్తే సంఘం పట్టు కోల్పోతుందని భావించిన రాంచంద్రరెడ్డి దేశ్‌ముఖ్, పోలీస్ పటేల్‌ను పిలిపించుకొని, ఐలమ్మ కౌలుకు తీసుకున్న భూమిని అక్రమంగా తన పేరున రాయించుకున్నాడు. భూమి తనదని, పండించిన ధాన్యం తనదేనని పంటను కోసుకు రమ్మని వంద మందిని దేశ్‌ముఖ్ పంపాడు. ఆంధ్రమహాసభ కార్యకర్తలు వరిని కోసి, వరికట్టం కొట్టి ధాన్యాన్ని ఐలమ్మ ఇంటికి చేర్చారు. భీం రెడ్డి నరసింహారెడ్డి, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, చకిలం యాదగిరిలు సైతం ధాన్యపు బస్తాలను భుజాలపై మోశారు. ధాన్యాన్ని ఎత్తుకెళ్లారు.

ఎల్లమ్మ చేతిలో రెండు సార్లు పరాజయం పాలైన రామచంద్రారెడ్డి దేశముఖ్ ఐలమ్మ ఇంట్లో ఉన్న ధనాన్ని, ధాన్యాన్ని దోచుకొని, ఇల్లు కూడా తగుల బెట్టించారు. ఐలమ్మ కూతురు సోమ నరసమ్మపై అత్యాచారం కూడా చేశారు. 'ఈ దొరగాడు ఇంతకంటే ఇంక నన్ను ఏ విధంగా నష్టపెట్టగలడు' అని తనలో తాను ప్రశ్నించుకొన్నది. ఏవీ దొరోడు ఏం చేస్తాడ్రా' అని మొక్కవోని ధైర్యంతో రోకలి బండ చేతబూని గూండాలను తరమి కొట్టింది. కాలినడకన వెళ్లి దొరకు సవాలు విసిరింది. ఐలమ్మ భూపోరాటం విజయంతో పాలకుర్తి దొర ఇంటిపై కమ్యూనిస్టులు దాడిచేసి ధాన్యాన్ని ప్రజలకు పంచారు. అలాగే 90 ఎకరాల దొర భూమిని కూడా ప్రజలకు పంచారు. ఐలమ్మ భూపోరాటంతో మొదలుకొని సాయుధ పోరాటం చివరి వరకు నాలుగు వేల మంది ఉత్పత్తి కులాల వారు అమరులయ్యారు.

ఐలమ్మ అనారోగ్యంతో 1985 సెప్టెంబర్ 10న తెలంగాణలోని పాలకుర్తిలో మరణించింది.

– దక్కన్‌న్యూస్,
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com



## సింగరేణి కార్మికులకు దసరా కానుకగా

# 33 శాతం లాభాల బోనస్

**ద**సరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కార్మికులకు తీపి కబురు తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) సింగరేణి సాధించిన 4701 కోట్ల రూపాయల లాభాలలో సంస్థ వ్యాపార విస్తరణ ప్రణాళికల కోసం రూ.2,289 కోట్ల కేటాయించగా.. మిగిలిన 2412 కోట్ల రూపాయలపై 33 శాతాన్ని లాభాల వాటా బోనస్‌గా కార్మికులకు చెల్లించనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రకటించారు. శుక్రవారం (సెప్టెంబర్ 20) రాష్ట్ర మంత్రిమండలి సభ్యులతో కలిసి సచివాలయంలో లాభాల బోనస్‌ను ప్రకటించారు. 33 శాతం వాటా కింద రూ.796 కోట్లను కార్మికులకు లాభాల వాటాగా చెల్లిస్తుండగా ఒక్కొక్క కార్మికుడు సగటున రూ.1,90,000 వరకు అందుకోనున్నాడు. సింగరేణి చరిత్రలో ఇదే అత్యధిక లాభాల వాటా బోనస్‌గా నిలువనుంది. అలాగే సింగరేణి చరిత్రలో తొలిసారిగా సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల బోనస్‌ను వర్తింపజేస్తున్నట్లు తెలిపారు.

**85 కోట్లు అధికం..**

2022-23 ఆర్థిక సంవత్సరంలో లాభాల వాటా కింద ప్రకటించిన 32 శాతంతో రూ.711 కోట్లను కార్మికులకు పంపిణీ చేయగా ఇప్పుడు 33%తో రూ.796 కోట్లు పంపిణీ చేస్తున్నారు. ఇది అప్పటి కన్నా 85 కోట్లు అధికం. అప్పుడు కార్మికులు సగటున ఒక లక్ష 70 వేల రూపాయలు లాభాల బోనస్‌గా అందుకోగా ఇప్పుడు సగటున ఒక లక్ష 90 వేల రూపాయలు అందుకోబోతున్నారు. గత ఆర్థిక సంవత్సరం సంస్థలో అత్యధికంగా 700 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా జరపడంతో ఎప్పుడూ లేనంతగా రూ.4701 కోట్ల నికర లాభాలను కంపెనీ ఆర్జించింది.

**లాభాల్లో వాటా..**

1990 దశకంలో తీవ్ర నష్టాల్లో ఉన్న సింగరేణి సంస్థను కార్మికులు, అధికారులు సమష్టిగా కృషి చేసి లాభాల బాట పట్టించారు. ఈ నేపథ్యంలో కార్మికులకు లాభాల్లో వాటా ఇచ్చి ప్రోత్సహించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. 1999 - 2000 సంవత్సరంలో తొలిసారిగా నాడు వచ్చిన 300 కోట్ల రూపాయల లాభాల్లో 10% అనగా 30 కోట్లను లాభాల వాటా బోనస్‌గా ప్రకటించారు. నాడు కంపెనీలో ఉన్న ఒక లక్ష 8 వేల మంది కార్మికులకు ఒక్కొక్కరికి సగటున 2,782 రూపాయలను లాభాల వాటాగా పంపిణీ చేశారు. ఈ సాంప్రదాయం దేశంలోని ఏ ప్రభుత్వ రంగ సంస్థలోనూ లేదు.

నాటి నుంచి సింగరేణి సంస్థ వరుసగా లాభాలు సాధిస్తూ దేశంలోనే అగ్రస్థాయి సంస్థగా నిలుస్తూ వస్తోంది. దీనితో లాభాల వాటా బోనస్ను ప్రతీ ఏడాది పెంచుతూ కార్మికులకు పంపిణీ చేస్తున్నారు. 2013-24లో లాభాల బోనస్ 20 శాతానికి పెరిగింది. అప్పుడు సగటున కార్మికుడు 13,751 రూపాయలు లాభాల వాట బోనస్ గా స్వీకరించాడు. 2021- 22 నాటికి ఇది 30 శాతానికి చేరుకోగా సగటున కార్మికుడికి సుమారు 90 వేల రూపాయల వరకు లాభాల వాటా అందింది. ఈ ఏడాది సింగరేణి చరిత్ర లోనే అత్యధికంగా 33 శాతం లాభాల వాటా బోనస్‌గా ప్రకటించడం వలన మస్టర్లు అధికంగా ఉన్న కార్మికులు 2.5 లక్షలకు పైగా బోనస్ అందుకునే అవకాశం ఉంది. అయితే సగటున మాత్రం 1,90,000 రూపాయలను కార్మికులు అందుకోనున్నారు.

**పొరుగు సేవల సిబ్బందికి కూడా బోనస్...**

సింగరేణి కాలరీస్ చరిత్రలో తొలిసారిగా ఈ ఏడాది పొరుగు సేవల కింద పని చేస్తున్న కాంట్రాక్టు, ఒప్పంద కార్మికుల కూడా లాభాల బోనస్ను చెల్లించాలని నిర్ణయించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. కంపెనీలో 25 వేల మంది వరకు కాంట్రాక్టు, పొరుగు సేవల సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో గత ఆర్థిక సంవత్సరంలో నిర్ణీత మస్టర్లు పూర్తిచేసిన వారికి నిబం ధనల ప్రకారం బోనస్ను చెల్లించనున్నారు. సగటున రూ.5వేల వరకు లాభాల బోనసును కాంట్రాక్టు కార్మికులు పొందే అవకాశంఉంది.

**బహుముఖ వ్యాపార విస్తరణ**

ఈ ఏడాది వచ్చిన 4701 కోట్ల రూపాయల లాభాలలో 2289 కోట్ల రూపాయాలను కంపెనీ విస్తరణ, అభివృద్ధి పనుల కోసం కేటాయిస్తున్నట్లు డిప్యూటీ సీఎంభట్టి విక్రమార్క తెలిపారు. కంపెనీ ఆర్థిక సుస్థిరత, భవిష్యత్ కోసం రాష్ట్ర ప్రభుత్వ మార్గ నిర్దేశంలో బహుముఖ వ్యాపార విస్తరణ చర్యలు చేపడుతున్నట్లు ప్రకటించారు.. ఇందులో భాగంగా సోలార్ విద్యుత్తు 1,000 మెగావాట్లకు పెంచాలని, రామగుండంలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ను ఏర్పాటు చేయాలని, ప్రస్తుత 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో మరో 800 మెగావాట్ల సామర్థ్యం కల సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, రామగుండంలో తెలంగాణ జెన్కో భాగస్వామ్యంలో 800 మెగావాట్ల ప్లాంటును, ఒడిశాలో 2400 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, దీనికి సంబంధించి ప్రణాళికలను రూపొందించి ముందుకెళ్తున్నట్లు తెలిపారు.

సింగరేణి సంస్థలో వీకే ఓసీ, గోలేటి ఓసీ, నైనీ ఓసీలను ఈ ఏడాది ప్రారంభించనున్నట్లు, తద్వారా ఏడాది ఉత్పత్తి లక్ష్యం 72 మిలియన్ టన్నులకు చేరుకోనుందన్నారు. అలాగే నూతన సీహెచ్పీల నిర్మాణం, కార్మికుల సౌకర్యార్థం క్వార్టర్లు, కార్మికుల పిల్లల కోసం సింగరేణి పాఠశాల ఆధునికీకరణ, రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు, ఏరియా ఆసుపత్రుల ఆధునికీకరణ, క్యాథ్ ల్యాబ్ల ఏర్పాటు, క్యాంటీన్ల ఆధునికీకరణ, హైదరాబాద్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ వ్యాపార విస్తరణ చర్యలతో కంపెనీకి ఉజ్వల భవిష్యత్ ఉందని, కాబట్టి కార్మికులు, అధికారులు సమర్థంగా పనిచేస్తూ రక్షణ, నాణ్యతతో కూడిన ఉత్పత్తికి కృషి చేసి సంస్థను ఆదర్శవంతమైన కంపెనీగా తీర్చిదిద్దాలని కోరారు.

సమావేశంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహా, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, గడ్డం వినోద్, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ప్రేంసాగర్ రావు, ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రాతినిధ్య సంఘ నాయకులు జనక్ ప్రసాద్, అధికారుల సంఘం నాయకులు లక్ష్మీపతి గౌడ్, జీఎంలు సుభానీ, రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు లాభాల వాటాను ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రికి కార్మికుల తరపున సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి సంస్థలో గల 41,500 మంది కార్మికులు, అధికారులకు ఈ బోనస్ను దసరా పండుగకు ముందు చెల్లించేందు ఏర్పాట్లు చేయాలని ఆయన సిబ్బంది, ఆర్థిక శాఖలకు ఆదేశాలు జారీ చేశారు.

**–చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్**
**ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్**


**చందా వివరాలు :**

విడి ప్రతి : రూ.40
వార్షిక చందా : రూ.400
2 సం॥లకు : రూ.750

'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్లైన్ రూపంలో చందా చెల్లించవచ్చు.

**Account Details:**
Bank Name : Canara Bank
A/c No. : 30101010003714
BracnH : Ashoknaar, Hyderabad
IFSC Code : CNRB0013010




చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో, మణికొండ వేదకుమార్ సంపాదకత్వంలో 1990 మరియు 1991 సంవత్సరములలో వెలువడిన 'బాలచెలిమి' పిల్లల వికాస పత్రిక మంచి ఆదరణ పొందినది. బాలల్లో సృజనాత్మకతను పెంచి విజ్ఞాన వినోదాలను అందించాలన్న లక్ష్యంతో 'బాలచెలిమి' జనవరి 2024 ఆకర్షణీయమైన రంగులతో, ఎక్కువ (52) పేజీలతో పత్రికను పునరుద్ధరించామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము.


**మా చిరునామా :**

**బాలచెలిమి**
'చంద్రం' 3-6-712/2,
స్ట్రీట్ నెం.12,
హిమాయత్నగర్,
హైదరాబాద్-500029,
తెలంగాణ.
Mobile : 9030626288
Email: desk.chelimi@gmail.com
website : www.balachelimi.com

ప్రకృతే సౌందర్యం! 29 ప్రకృతే ఆనందం!!

# మొదటితరం భూచరాలం!
# మానవులకు ముత్తాతలం!!

జీవుల పుట్టుక, పరిణామం ఓ వైవిధ్యభరితం! ఈ విషయంగా అనేక శాస్త్రీయ ఆవిష్కరణలు, రుజువులు మనకు అందుబాటులో వున్నా, మతాలు మాత్రం ఆధారంలేని కథనాల్ని నిరంతరం మానవుల బుర్రల్లోకి చొప్పిస్తూనే వున్నాయి. ముఖ్యంగా చదువును వెలగబెట్టిన వారు ఈ అపనమ్మక కథనాల్ని ఓ సాంస్కృతిక వారసత్వంగా తరతరాలకు అందిస్తూనే వున్నారు. ఈ భావవాదులు ఓ వైపు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూనే శాస్త్రీయ ఆలోచనలకు నిరంతరం అడ్డుకట్ట వేస్తూనే వున్నారు. అయినా, జీవపరిణామ సిద్ధాంతం నిరంతరం కొత్త ఆవిష్కరణల్ని చేస్తూనే వున్నది. ఇందులో ప్రధానంగా ముందు జలచరాలని, తర్వాతి కాలంలో ఉభయచరాలని, వీటి నుంచే భూచరాలు రూపుదిద్దుకున్నట్లు అనేక ఆధారాలు, శిలాజల గుర్తులు లభిస్తూనే వున్నాయి.




ఈ నేపథ్యంలోనే రాకాసిబల్లుల ఉనికి గూర్చిన జురాసిక్‌పార్క్, గాడ్జిల్లా లాంటి సినిమాలు నిర్మించారు. అతిపెద్ద ఆకారం వున్న కొన్ని రాకాసిబల్లులు కూడా పక్షుల్లా ఎగిరేవని తెలిసింది. అంటే సరీసృపాలకు, పక్షులకు మధ్యస్థ జీవులుగా వీటిని గుర్తిస్తారు. ఇలా జలచరాలు ఉభయచరాలుగా, ఉభయచరాలు సరీసృపాలుగా, పక్షులుగా, తర్వాతి కాలంలో సస్తనజాతి (పాలిచ్చే) జంతువులుగా రూపాంతరం చెందిన సదృశ్యాలు శాస్త్రీయంగా అనేక నిరూపణలు మనముందున్నాయి. జలచరాలు మొప్పలతో, ఊపిరితిత్తులతో శ్వాసించే శక్తిని కలిగివుంటే, ఉభయచరాలు మొదట మొప్పలతో, తర్వాత చర్మంతో, ముఖకుహరంతో అభివృద్ధి చెందిన ఊపిరితిత్తులతో శ్వాసక్రియను జరుపుకుంటే, భూచరాలు మొత్తంగా ఊపిరితిత్తులతో జరుపుకోవడం జీవుల పరిణామ క్రమాన్ని సూచిస్తుంది. అలాగే రక్తప్రసరణ వ్యవస్థ, గుండె గదులు కూడా! దీనికి కాసినేరియా (casineria) అనే మొదటితరం సరీసృపాన్ని ఉదహరిస్తారు.

300 మిలియన్ సం॥ల (carboniferous period) క్రితం జీవించినట్లుగా భావిస్తున్న కాసినేరియా, సుమారు 15 సెం.మీ. పొడవున్న బల్లిలాంటి జీవి. ఇది అమ్నియోటిస్ వర్గానికి చెందినదని దీని శిలాజాన్ని పరిశీలించిన శాస్త్రజ్ఞులు భావించారు. ఈ జీవి మొదటితరం సరీసృపంగా, ఉభయచరాలకు, పక్షులకు, సస్తనజాతికి మధ్యస్థ జీవిగా దీనిని గుర్తించారు. వీటన్నింటిని శాస్త్రీయంగా చూసినప్పుడు జీవపరిణామం ఎంత విశిష్టతను కలిగివుందో తెలుస్తున్నది.

ఈ సందర్భంగా కొన్ని రకాల సరీసృపాల జీవన విధానాన్ని, వాటి ప్రాముఖ్యతను చూద్దాం!

### మాపట్లనే వివక్షత ఎందుకు?

జంతువర్గంలో అత్యంత వివక్షతకు గురైతున్న వర్గం మాదే! మా వర్గంలో తాబేళ్లు, బల్లులు, మొసళ్ళు, పాములు వున్నాయి. ఒక్క తాబేళ్ళపై తప్ప మిగతా వాటిపట్ల మీ మానవులు అనేక అపోహల్ని, అనుమానాల్ని, కల్పించుకొని భయాల్ని ఏర్పరచుకున్నారు. వీటికి సహేతుక కారణాలు లేకున్నా, మా ఆకారం, శరీర ఆకృతితో పాటు కొన్నింటి ద్వారా జరిగే అపాయల్ని దృష్టిలో పెట్టుకొని ఈ భయం కాబోలు! కానీ, మీరు ఊహించుకున్నంత ప్రమాదకారులం కామనేది మీ మానవులే ప్రచారం చేస్తూ వుంటారు. అయినా, మాపై వ్యతిరేకత అలాగే కొనసాగడం గమనార్హం!

ఇతిహాసాల్లో, పురాణాల్లో, మాపట్ల ఆరాధన, గౌరవం కనవడినా కొన్ని సందర్భాలలో మావర్గాన్ని క్రూరంగా చిత్రీకరించారు. విష్ణు అవతారంగా కూర్మాన్ని (తాబేలు), వరాహాన్ని (పంది), మత్స్యాన్ని (చేప) ఆరాధ్య జీవులుగా గుర్తించినా, గజేంద్రమోక్షంలో ఏనుగును రక్షించే నెపంతో మా మొసళ్ళను ఓ క్రూర జంతువర్గంగా చిత్రీకరించారు. నిజానికి ఏనుగులు ఆటవికంగా వుండి (శాఖాహారులైనా) వనాల్ని ధ్వంసం చేస్తాయి. అది వాటి స్వాభావిక నైజం. కాని, మా మొసళ్ళు నీటిని శుభ్ర పర్చడంతో పాటు, చిన్నస్థాయి నీటి జంతువుల్ని, చేపల్ని తిని జీవిస్తూ ఆహారపు గొలుసులో అమోఘమైన పాత్రను నిర్వహిస్తాయి!

పోతే జంతు ప్రేమికుల సహవాసంతో, స్పందనతో ఈ మధ్యన మాపట్ల కొంత అనుకూల వాతావరణం ఏర్పడింది. కొన్ని

**సరీసృపాలు - జీవన వైవిధ్యం**

- సముద్రాల్లో, నదుల్లో, నీటి ఆవాసాల్లో, చెట్లపైన కూడా ఇవి జీవిస్తాయి.
- ఉష్ణమండలాల్లో, భూమధ్యరేఖ ప్రాంతాల్లో వీటి ఉనికి ఎక్కువ.
- ఇవి శీతలరక్తం జంతువులు. కావున శరీర ఉష్ణోగ్రతను నియంత్రించు కోలేవు.
- ఉష్ణోగ్రత పెరిగితే నీడను ఆశ్రయిస్తాయి.
- అర్కిటిక్ ప్రాంతాల్లో వేడిమికై ఎండకాగుతాయి (sunning)
- మొసళ్ల పిల్లల్ని పెంచుతే, మిగతా సరీసృపాలు, గుడ్లుపెట్టి వదిలిపెడుతాయి.
- ఇవి రోజు ఆహారపు వేటను సాగించవు
- కొన్ని రోజులు, వారాలు ఆహారం లేకుండా వుంటాయి.
- మొసళ్ళు, నాలుగు గదుల గుండెను కలిగివుంటే, మిగతా సరీసృపాలు మూడు గదుల గుండెను కలిగివుంటాయి.

**సరీసృపాలు - డైనోసార్స్ వారసులు**

- మొత్తంగా ఇవి సుమారు 10,000 వేల రకాలుగా అంచనా.
- ఇవి ప్రధానంగా నాలుగు రకాలు
  తాబేళ్ళు - (సుమారు 49 రకాలు)
  బల్లులు - (సుమారు 7,000 రకాలు)
  మొసళ్ళు - (26 రకాల్లో, 19 రకాలున్నాయి)
  పాములు (సుమారు 2,900 రకాలు)
- పాముల్లోని కొన్ని రకాలు, బల్లుల్లో మెక్సికన్ బీడెడ్ బల్లి (beaded gila monster) మాత్రమే విషపు రకాలు. మిగతా వర్గం విషరహితం.
- డైనోసార్స్, భారీ కాయపు ఉడుములు (iguana) బల్లుల జాతికి చెందినవే!
  (జురాసిక్ పార్క్, గాడ్జిలా లాంటి సినిమాలు వీటి నేపథ్యంలో నిర్మించినవే)

పాశ్చాత్య దేశాల్లో మాలోని కొన్ని రకాల జంతువుల్ని (మొసలి, ఊసరవెల్లి, పాము) పెంచుకోవడం ముదావహం! మీ రియాల్టి ప్రదర్శనల్లో పాములతో (విషరహిత) సహవాసం చేయడం అభినందనీయమే! ఇక పాముల్ని ప్రేమించేవారి సంఖ్య కూడా పెరగడం, మీరు భయపడేంత విషసర్పాలం కాము అనే నినాదాన్ని బలోపేతం చేయడం ఆహ్వానించ తగ్గదే! ఇప్పటికి భూమిని ఆదిశేషుడు మోస్తున్నాడని హిందూమతం నమ్మితే, అమెరికన్లు తాబేలే భూమిని మోస్తున్నట్లు (Aesop's fables) నమ్మడం విచిత్రం కదా! పోతే ఇవన్నీ ఓ ప్రతీకలే!

**సహజ కవచదారులం - అయినా భయంతో జీవిస్తాం!**

మహాభారతంలో కర్ణుడు సహజ కవచకుండలాలతో జన్మించినా, యుద్ధరంగంలో ఆయనకు అవి ఉపయోగం లేకుండా పోయాయి. మా (తాబేళ్ళ) పరిస్థితి అంతే! ఏ జంతువుకు లేని ఓ విశిష్ట రక్షణకవచం మా వీపు భాగాన వుండడం, ప్రకృతి ప్రసాధించిన ఓ వరమే! అయినా, మీ గొడ్డళ్ళు, కత్తులు మమ్మల్ని నరకయాతనకు గురిచేస్తాయి. మీ ఇనుపవలలు మమ్మల్ని అనునిత్యం బంధిస్తాయి. మా తలను, కాళ్ళను కుంచించి, మా కవచంలోకి లాక్కొని మేం రక్షించబడినామని భావిస్తాం. కాని ఆ సంతోషం స్వల్ప కాలమేనని, వేటగాల్ల చేతల్లోకి పోతేగాని తెలియదు. శత్రువుతో పోరాడడానికి, మా కవచాన్ని డాలుగా చేసుకొని రక్షించుకుంటారు. కాని, మా సహజ రక్షణ కవచం మీ నుండి రక్షణ కలిగించలేక పోతున్నది.

ముఖ్యమైన విషయం ఏంటంటే, జంతువర్గంలో మాజాతే అత్యంత జీవన ప్రమాణాన్ని కలిగి వున్నాయి. సగటున 80 సం॥ నుంచి 150 సం॥ వరకు జీవించినట్లు మీ రికార్డులే తెలుపుతున్నాయి. కొన్ని అనుకూల పరిస్థితుల్లో మేం 250 సం॥ వరకు జీవించినట్లుగా ఆధారాలు వున్నాయి కూడా! మొత్తం మా జాతిలో చుక్క (స్టార్) తాబేళ్ళు అందంగా వుండడంతో వీటి వేట ప్రపంచ వ్యాపితంగా కొనసాగుతున్నది. ముఖ్యంగా భారతదేశ తీర ప్రాంతాల్లో ఈ జాతి అధికంగా కనపడుతుంది. అందుకే మమ్మల్ని బంధించి, దొంగచాటుగా తూర్పు, ఆగ్నేయ ఆసియా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. దీన్ని మీరు నివారించగలిగితే, మీరు పరోక్షంగా పర్యావరణానికి దోహదపడినట్లే!

**తాబేలు నడక - అరిబడ (arribada)**

దాదాపు జంతువర్గంలో గుడ్లుపొదగబడిన తర్వాత పసిగుడ్లు (chicks) కొన్ని రోజులు తల్లి సంరక్షణలో వుంటాయి. కాని, మేం గుడ్లు పొదగబడిన వెంటనే మా దారిన మేం పోతాం. ఆ పసిగుడ్లు వెంటనే తమ దారిని తాము వెతుక్కుంటాయి. పాకడం ప్రారంభిస్తాయి. ఇవి కూడా సమూహంగా కదులుతాయి. ఈ వింతల్ని ఒరిస్సా తీరాల్లో మీరు చూడవచ్చు!

సముద్రాల్లో జీవించే తాబేళ్ళు కూడా తీర ప్రాంతానికే వచ్చి గుడ్లు పెట్టాల్సిందే! పొదగాల్సిందే! విచిత్రమేమంటే, పుట్టిన చోటు నుంచి సుదీర ప్రాంతాల్లో జీవనయానం సాగించే మేము, గుడ్లను పెట్టడానికి మాత్రం తిరిగి పుట్టిన తీరానికే వచ్చి గుడ్లు పెట్టడం ప్రకృతి వింత కాదా! అంటే సుమారు 15-18 సం॥ తర్వాత తిరిగి రావడం ఓ ప్రకృతి ప్రసాదిత లక్షణంగా మీరు చెప్పుకుంటారు. ఇలా పుట్టిన వెంటనే సాగే మా ప్రయాణం భూమధ్యరేఖ ప్రాంతానికి, శ్రీలంక, ఆస్ట్రేలియాకు, లేదా ఇతర అనుకూల ప్రాంతాలకు వెళ్ళి జీవించి, జతకడుతాం. గర్భందాల్చిన తర్వాత తిరిగి మా ప్రయాణం వెనక్కి మళ్ళుతుంది. అలా పుట్టిన చోటికి సామూహికంగా రావడం, సామూహికంగా (2-3 రోజుల్లో) గుడ్లను పెట్టడం జరుగుతుంది. ఇలా వేలుగా కదిలి గుడ్లు పెట్టడాన్ని స్పానిష్ భాషలో అరిబడా అంటారు. ఈ ప్రయాణం కొన్నిసార్లు సుమారు 9,000 కి.మీ. కూడా సాగుతుంది.

ఇంతంత దూరాల్ని మేం నడచినా, నీటిలో పయనించినా

**ఉడుములు (iguana) – ఉడుము పట్టు**

- ఇవి సుమారు 80 రకాలు
- వీటి కాళ్ళవేళ్ళ కింద దిండులాంటి భాగాలుంటాయి.
- ఈ మెత్తటి భాగాలు ఆధారాల్ని బిగుతుగా అతుకుంటాయి.
- అందుకే ఈ జాతి వెనక్కి, ముందుకి ఊగి ఊగి కదులుతాయి.
- వీటి పట్టును గుర్తించే సైనికులు ఎత్తైన కోట గోడల్ని, ప్రాకారాల్ని ఎక్కడానికి ఉడుముల్ని ఉపయోగిస్తారు.
- దీన్నే ఉడుము పట్టు అంటారు.

మా నడకను మీరు తాబేలు నడకని హేళనచేయడం బాగుందా.

ఇక ఆలివ్ రిడ్లే (olive ridley) తాబేళ్ళు భారతదేశ తీర ప్రాంతాల్లో, ఉత్తరార్ధగోళంలోని కోస్టారిగా, మెక్సికో తీర ప్రాంతాల్లో జీవిస్తాయి. గుడ్లు పెట్టడానికై ఇవి సుమారు 1,50,000 తాబేళ్ళు గుంపుగా కదిలి, పుట్టిన తీరానికి చేరి గుడ్లను పెట్టి, పొదిగి, తిరిగి తమ ఆవాస ప్రాంతాలకు వెళ్ళిపోతాయి. పోతే, మగ తాబేళ్ళు మాత్రం కేవలం సంపర్కానికే పరిమితమైతాయి.

**భూ అయస్కాంతంతో మా సంబంధం**

మా జీవన విధానం భూ అయస్కాంతముతో ముడిపడి వుంటుందని మీ శాస్త్రజ్ఞులు భావిస్తారు. కారణం $20^0$ అక్షాంశాన్ని ఆధారంగా మా సంతానోత్పత్తి జరుగుతుందని, ఈ ప్రాంతంలోనే మేం గుడ్లను పెట్టి, పొదుగుతామని తేలింది. దానికై మేం సముద్ర అలల్ని, సూర్యుడి స్థానాన్ని, ఉపరితల గాలుల్ని, రుతువుల్ని, చంద్రుడి గమనాన్ని గమనిస్తామని తేలింది. బహుషా ఈ విధానమే, మేము పుట్టిన తీరాలలోనే తిరిగివచ్చి గుడ్లు పెట్టడానికి కారణం కావచ్చు కదా!

మీ శాస్త్రజ్ఞుల అంచనా ప్రకారం, మేం గుడ్ల నుంచి బయటకు రాగానే ఇసుక రేణువులు మా పొట్టభాగాన అతుక్కోవడం, అవి ముద్రలుగా ఏర్పడడం, ఈ ఆధారంతోనే మేం తిరిగి వస్తామని, ఇచ్చటనే గుడ్లను పొదుగుతామని, దీన్నే తాబేళ్ళ అయస్కాంత గుర్తింపు (geomagnetic identification) విధానమని అంటారు. కారణాలు ఏమైనా మేం ఇలా తిరిగి వచ్చి పుట్టిన ప్రదేశంలోనే గుడ్లు పెట్టడం దాదాపు ఏ జంతువుల్లో కానరాదు కాబోలు!

**పేరుగొప్ప – ఊరు దిబ్బ :**

హిందు ఇతిహాసాల్లో అమెరికన్లలో మాపట్ల ఎనలేని గౌరవం వున్నా ఇవన్నీ కథలకే పరిమితం. మాపట్ల మీ మానవుల ఆరాధన ఎంతనో, మాపైన అఘాయిత్యాలు అంతే! మమ్మల్ని వేటాడని రోజు, వలవేసి పట్టి ఖండాంతరాలకు ఎగుమతి చేయని దినం, స్టారు హొటళ్లలో మా మాంసాన్ని రుచి చూడని దేశం, ప్రాంతం లేదంటే మీరు నమ్మకపోవచ్చు! పోతే మా పుట్టక, చావు వేల సంఖ్యల్లో వుండడంతో, మేము అభివృద్ధికర దశలో వున్నట్లుగా భావిస్తున్నారు. ముఖ్యంగా చుక్క తాబేళ్ళ వ్యాపారం ప్రపంచవ్యాపితమై పోయింది. చాలా దేశాల్లో మమ్మల్ని పెంపుడు జంతువులా పెంచుకుంటే, మీకు మంచి జరుగుతుందని భావించి మమ్మల్ని బందీ చేస్తున్నారు. మీ నమ్మకాలకు మమ్మల్ని బలి చేస్తున్నారు.

**టార్టాయిస్ × టర్టల్**

- ఇవి ప్రధానంగా రెండు ఆవాసాల్లో జీవిస్తాయి.
- టార్టాయిస్ (tortoise) అత్యధికంగా భూచరంగా వుంటుంది.
- టర్టల్ (turtle) ఎక్కువ సమయం నీటిలో వుంటుంది.
- ఇవి సుమారు 49 రకాలు
- భారత్‌లో ప్రధానంగా అయిదు రకాలున్నాయి.

**రెండు తలల తాబేలు**

- జెనివాలోని నేచురల్ హిస్టరీ మ్యూజియంలో రెండు తలల తాబేలు 1997లో జన్మించింది.
- దీని వయస్సు గత ఆగస్టు నాటికి 26 సం॥లు
- సాధారణంగా, జన్యువుల అసాధారణతో ఇలాంటివి జన్మిస్తాయి. అందుకే ఎక్కువ కాలం జీవించవు.
- కారణం– రెండు తలల్ని రక్షణకై లోనికి లాక్కోవడం కష్టం కాబట్టి.
- కాని, మ్యూజియం అధికారుల సేవలతో ఇది జీవించడం విచిత్రం!



రెండు తలల తాబేలు

మాపై వేట ఇలాగే కొనసాగితే, మా ఆవాసాల్ని దెబ్బతీస్తే, డైనోసార్స్ కాలం నుంచి జీవిస్తున్న మా జాతి ఉనికిని కోల్పోతే, నీటి ఆవాసాలన్నీ చేపలచే, ఇతర నీటి జంతువులచే నిండిపోతాయి. ఇదే జరుగుతే, ఆ జీవులకు ఆక్సిజన్ కొరత ఏర్పడి, అన్ని మరణిస్తాయి. అప్పుడు మానవులతో పాటు, ఇతర జంతువులకు ఆహారపు కొరత ఏర్పడుతుంది. అంటే, ఆహారపు గొలుసులో, పర్యావరణ రక్షణలో మాకు మేమే సాటి. కనీసం ఇప్పుడన్నా మా ఉనికి గూర్చి ఆలోచిస్తారని...

(వచ్చే సంచికలో పాముల ప్రాధాన్యతను చూద్దాం!)

– డా॥ లచ్చయ్య గాండ్ల, m : 9440116162
e : drglachaiah@gmail.com

# తెలంగాణ పారిశ్రామిక వృద్ధిలో అమెరికన్ కంపెనీలు భాగస్వాములు!

తెలంగాణ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో, ఫోర్త్ సిటీ నిర్మాణంలో, ఎదుగుదలలో పాలుపంచుకోవాలని అమెరికన్ పరిశ్రమలు, వ్యాపార సంస్థలకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 24న ఆయన అమెరికాలోని లాస్ వేగాస్‌లో ప్రారంభమైన అంతర్జాతీయ మైనెక్స్-2024 ప్రదర్శనలో పాల్గొన్న అనంతరం పలు అమెరికన్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆయనతోపాటు రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సిఎండి ఎన్.బలరామ్, స్పెషల్ సెక్రెటరీ క్రిష్ణభాస్కర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భారతదేశంలో పరిశ్రమల స్థాపనకు, పెట్టుబడులకు, వ్యాపారాలకు హైదరాబాద్ అత్యంత అనువైన ప్రాంతమని, తెలంగాణ రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో కీలకపాత్ర పోషిస్తుందని, కనుక ఇక్కడ ఖనిజ పరిశ్రమ అభివృద్ధికి దోహదపడాలని ఇందుకు అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఖనిజాలను రక్షణతో మంచి ఉత్పాదకతతో ఉత్పత్తి చేయడానికి అవసరమైన యంత్రాలను సమకూర్చవచ్చని తెలిపారు. భూగర్భంలో దాగిన విలువైన ఖనిజాలను వెలికి తీయడంలో, నిలకడగల అభివృద్ధిని సాధించడంలో అమెరికన్ కంపెనీలు భాగస్వాములు కావచ్చని సూచించారు. హైదరాబాద్‌కు అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఫోర్త్ సిటీలో కూడా భాగస్వాములు కావాలని ఆయన అమెరికన్ పారిశ్రామిక కంపెనీలకు, వాణిజ్య సంస్థలకు పిలుపునిచ్చారు. ఇప్పటికే ఇక్కడ స్థాపించిన అమెరికన్ కంపెనీలు ఎంతో సౌకర్యవంతంగా తమ వ్యాపారాలను వృద్ధి చేసుకుంటున్నాయని, ఇంకా వివిధ రంగాల పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉన్నందున దీనిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



తెలంగాణకు చెందిన ప్రభుత్వ కంపెనీ అయిన సింగరేణికి క్రిటికల్ మినరల్స్ అన్వేషణలో పూర్తి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల జరిగిన ఇరుదేశాధినేతల సమావేశంలో పరస్పరం రెండు దేశాలు ఒకరికొకరు తోడ్పడాలని అంగీకరించిన నేపథ్యంలో అమెరికన్ కంపెనీలు మరింతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

అమెరికన్ ప్రభుత్వ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్న గ్లోబల్ మార్కెట్స్ సహాయ కార్యదర్శి అరుణ్ వెంకటరామన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఇప్పటికే అమెరికాకు చెందిన పలు సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలు విజయవంతంగా నిర్వహించుకుంటున్నాయని, ఈ ఒరవడిని కొనసాగిస్తూ మరిన్ని అమెరికన్ సంస్థలు తెలంగాణలో తమ వ్యాపారాలు ప్రారంభిస్తాయని ఆయన ఆశాభావం ప్రకటించారు.

### భారీ యంత్రాలు, సేవల ప్రదర్శనలో 1900 కంపెనీలు

నాలుగేళ్లకు ఒకసారి జరిగే ఈ భారీ అంతర్జాతీయ మైనెక్స్-2024 ప్రదర్శనలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న సుమారు 1900 యంత్ర ఉత్పత్తి సంస్థలు తమ స్టాల్స్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. వీటిలో భారీ మైనింగ్ తవ్వకాల యంత్రాలు మరియు ఖనిజ రవాణా వాహనాలు, రక్షణ సేవలు, అనుబంధ యంత్ర విభాగాలను ప్రదర్శనకు ఉంచారు. 121 దేశాల నుండి సుమారు 44,000వేల మంది ప్రతినిధులు దీనిలో పాల్గొంటున్నారు. రాష్ట్రం నుంచి తొలిసారిగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కమల్లు సారథ్యంలోని రాష్ట్ర అధికారుల బృందం ప్రముఖ ఖనిజ పరిశ్రమల యంత్ర తయారీ సంస్థలైన కొమాట్సు, క్యాటర్ పిల్లర్, బి.కే.టి టైర్స్ తదితర స్టాల్స్‌ను సందర్శించారు. అధికోత్పత్తి సాధించే రక్షణ సహిత భారీ యంత్రాల గురించి ఆయా కంపెనీల వారు తమ ప్రత్యేకతలను వివరించారు. ప్రదర్శనలో ఉంచిన వాటిలో అత్యాధునిక కంటిన్యూయస్ మైనర్ యంత్రాలు, లోడ్ హాల్ డంపర్లు, మైనింగ్ డోజర్లు, బ్లాస్ట్ హోల్ డ్రిల్స్, ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్ ఇంకా అత్యాధునిక టైర్లు, స్పేర్లు, వివిధ సేవలకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ఉత్పత్తిదారులతో సమావేశాలు నిర్వహించడం జరిగింది.

అమెరికన్ ప్రతినిధి బృందంలో ఇంకా గ్లోబల్ మార్కెట్స్ సీనియర్ పాలసీ అడ్వైజర్ ఒలిమర్ రివేరానోవా, కమర్షియల్ స్పెషలిస్ట్ శాంతను సర్కార్, ఇంటర్నేషనల్ ట్రేడ్ స్పెషలిస్ట్ కార్నిలియస్ గ్యాంఫి, గ్లోబల్ ఎనర్జీ సెక్టార్ లీడర్ డేరెక్ట్ శ్లికెషన్, గ్లోబల్ డిజైన్ అండ్ కన్స్ట్రక్షన్ స్పెషలిస్ట్ జాస్మిన్ బ్రౌన్ వెల్ తదితరులు పాల్గొన్నారు.

**–చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్**
ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్

# సులభతరం వ్యాపారంకు సింగిల్ విండో కీలకం

## 'ఉద్యోగ్ సమాగమ' సమావేశంలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్

దేశంలో వ్యాపారాన్ని సులభతరం చేయడానికి నిజమైన హేతుబద్ధమైన సింగిల్ విండో కీలకమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. సెప్టెంబర్ 5న ఢిల్లీలోని ద్వారకలోని యశోభూమిలో రాష్ట్రాల పరిశ్రమలు, వాణిజ్య మంత్రుల సదస్సు 'ఉద్యోగ్ సమాగమ'కు అధ్యక్షత వహిస్తూ మంత్రి ఈ విషయం చెప్పారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఆమోదాలు, సౌకర్యాల కోసం ఒకే వేదికకు వస్తే, అది ప్రతి రాష్ట్రంలో ప్రపంచ పెట్టుబడులను ఆకర్షిస్తుందని ఆయన అన్నారు.

రాష్ట్రాలలో పరిశ్రమలకు ఆమోదాలు కాలపరిమితిలో ఉండాలని, సులభంగా ఉండాలని మంత్రి అన్నారు. ఆమోదాలు మరియు సమ్మతి కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు రాకూడని వ్యవస్థతో మేము ప్రయోగాలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. దీంతో కేంద్రం, రాష్ట్రాలు అన్ని రంగాలలో కలిసి పనిచేయగలవని, ఎక్కువ ఉపాధి అవకాశాల కల్పించ వచ్చునని ఆయన అన్నారు.




న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి పియూష్ గోయల్ నుండి అవార్డును అందుకుంటున్న డాక్టర్ జి. మాల్సూర్, డైరెక్టర్, పరిశ్రమల శాఖ తెలంగాణ

బిజినెస్ రిఫార్మ్స్ యాక్షన్ ప్లాన్ (బిఆర్ఏపి) కింద అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారిని సత్కరిస్తూ, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను పెంచడంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు చేసిన అత్యుత్తమ కృషిని గోయల్ గుర్తించారు. కేరళ, ఆంధ్రప్రదేశ్ మరియు గుజరాత్ వంటి రాష్ట్రాలు ప్రక్రియలను క్రమబద్ధీకరించడంలో, వ్యాపారాలు మరియు పౌరులకు సమర్థవంతమైన సేవలను అందించడంలో వారి అద్భుతమైన సంస్కరణలకు ప్రత్యేకమని చెప్పవచ్చును.

భారతదేశాన్ని ప్రపంచానికి పెట్టుబడి గమ్యస్థానంగా ప్రోత్సహించడానికి, వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్డిఐ) ఆకర్షించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అన్నారు. ఎఫ్డిఐని ఆకర్షించడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలు, యుటిలకు సమాన అవకాశాలను కల్పించిందని ఆయన అన్నారు. విదేశాల నుండి వచ్చే పెట్టుబడులు వివిధ రాష్ట్రాలకు వెళుతున్నాయని, ఎఫ్డిఐని ఆకర్షించడానికి మేము చేస్తున్న ప్రయత్నాలకు ప్రతి ఒక్కరూ లబ్ధిదారులని ఆయన అన్నారు.

డిపార్ట్మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇన్వెస్ట్మెంట్ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డిపిఐఐటి) 'ఉద్యోగ్ సమాగమ్' ను విజయవంతంగా నిర్వహించింది. ఈ సమావేశం పరిశ్రమలు మరియు వాణిజ్య మంత్రులు, అన్ని రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సీనియర్ అధికారులు, విశిష్ట అతిథులను పారిశ్రామిక వృద్ధిని పెంపొందించడం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను పెంచడం మరియు దేశవ్యాప్తంగా వ్యాపార–స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించడం గురించి చర్చించడానికి ఎంతో ఉపయోగపడుతుంది.

ఈ సమావేశంలో మంత్రి పీయూష్ గోయల్ రూపొందించిన రెగ్యులేటరీ కంప్లయన్స్ బర్డెన్ (ఆర్సిబి) బుక్లెట్ విడుదల చేసారు. ఇది వ్యాపార కార్యకలాపాలను సులభతరం చేయడానికి ప్రభుత్వ ప్రయత్నాలను ప్రదర్శిస్తుంది. 42,000కు పైగా సమ్మతులను తగ్గించడం, పాత నిబంధనలను సరళీకృతం చేయడం, డిజిటలైజ్ చేయడం వంటి విషయాలు ఇందులో ఉన్నాయి.

16 రాష్ట్రాలకు చెందిన మంత్రులు, ఇతర రాష్ట్రాలకు చెందిన సీనియర్ అధికారులు ఈ సదస్సుకు హాజరయ్యారు.

బిఆర్ఏపి అభినందనలు: ఈ కార్యక్రమం బిఆర్ఏపి అభినందన ద్వారా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అత్యుత్తమ కృషిని కూడా గుర్తించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను పెంచడంలో వారి విజయాలను జరుపుకుంది. సంస్కరణల విస్తృత పరిధిని పరిగణనలోకి తీసుకుని, 17 రాష్ట్రాలకు BRAP 2022 అనులేఖనాలు సమర్పించబడ్డాయి. చాలా రాష్ట్రాలు ఆశాజనక విభాగంలో ఉండగా, గుజరాత్ మాత్రమే ఫాస్ట్ మూవర్స్ విభాగంలో వచ్చింది. సైటేషన్ కోసం బ్రిఆర్ఏపి 2022లో భాగమైన మొత్తం 25 సంస్కరణలలో (15 బిజినెస్ మరియు 10 సిటిజెన్ సెంట్రిక్) ఏదైనా ఒక సంస్కరణలో అగ్రశ్రేణి సాధించిన కేటగిరీ 95% పైన సాధించిన ఏ రాష్ట్రం అయినా సైటేషన్ కోసం ఎంపిక చేయబడ్డాయి. కేరళ, గుజరాత్, రాజస్థాన్, త్రిపుర, ఉత్తర ప్రదేశ్, అండమాన్ నికోబార్ దీవులు, ఒడిశా, అస్సాం, దాద్రా నగర్ హవేలీ, డామన్ మరియు దయ్యూ, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మణిపూర్, పంజాబ్, తెలంగాణ మరియు ఉత్తరాఖండ్ రాష్ట్రాలు ఒకదానిని మరొకటి మెరుగుపరుచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన పోటీ, సహకారం దేశ ప్రగతికి కీలకమని ఆయన అన్నారు.

– దక్కన్‌న్యూస్
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com



శివమ్మ రూపొందించిన శ్రీకృష్ణ చరిత కళాఖండం

# తోలుబొమ్మల కళాకారిణికి జాతీయ పురస్కారం



తోలుబొమ్మపై పెయింటింగ్ వేస్తున్న దళవాయి శివమ్మ

**భా**రత ప్రభుత్వం అందించే 'శిల్పగురు' అవార్డు తెలుగు కళాకారిణి దళవాయి శివమ్మను వరించింది. సత్యసాయి జిల్లా, ధర్మవరం మండలం నిమ్మలకుంట గ్రామానికి చెందిన ఆమె తోలుబొమ్మల కళాకారిణి.

కేంద్ర జౌళి శాఖ నిర్వహించే శిల్పగురు, జాతీయ చేతి వృత్తుల అవార్డు-2023 పోటీలకు తోలుపై అద్భుతంగా రూపొందించిన శ్రీకృష్ణ చరిత, ఏడు అడుగుల ఎత్తైన విశ్వరూప హనుమాన్ కళాఖండాలను ఆమె పంపించారు.

వీటిని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం.. శిల్పగురు పురస్కారానికి ఎంపిక చేసింది. శివమ్మ మాట్లాడుతూ.. ఈ రెండింటినీ తయారు చేయడానికి 6 నెలల పాటు కష్టపడ్డానని చెప్పారు. తాను శిల్పగురు అవార్డుకు ఎంపిక కావడం నిమ్మలకుంట తోలుబొమ్మల కళాకారులకు దక్కిన గౌరవమని చెప్పారు. త్వరలో దిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నట్లు వెల్లడించారు.

– దక్కన్‌న్యూస్,
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

# మా ఎల్లమ్మ ఆకాశంలో - మా మాతంగి అగాధంలో

మాదిగలు చర్మకారులు. జంబూద్వీప మూలవాసులు. దక్షిణాన హిందూ మహాసముద్రం నుంచి ఉత్తరాన ఆఫ్ఘనిస్తాన్ దాకా చర్మకార సమూహాలు అతి పెద్ద జనాభాగా విస్తరించి ఉన్నాయి. మాదిగలు,చక్కిలియార్లు, మాద్గి, మాంగ్, మాతంగ, చమార్, జాతవ్, డక్కలి, చిందు, బైండ్ల, మాస్టి, మాదిగదాసు, ఆది జాంబవ, అరుంధతీయ, మోచి, సమగర - ఇలా అనేక పేర్లతో భారత దేశంలో చర్మకార కులాల వారు పిలవబడుతున్నారు.



చర్మకార మాదిగ సమూహాలు ప్రకృతి జీవులు. ప్రకృతి ఆరాధకులు. అమ్మ తల్లిని పూజించే మాతృస్వామ్యాన్ని అనుసరించేవారు. ఎల్లమ్మ, మాతంగి, మాతమ్మ, జోగులాంబ, బసవమ్మ వీరి దేవతలు. మాతృస్వామిక సంస్కృతికి ప్రతీకగా మాతంగి దేవత జనించింది. పునరుత్పత్తి సహజావసరంగా, సగౌరవంగా యోని ఆరాధన జరుగుతున్నది. ఆహార సేకరణ,వేట సమాజాలకు మహిళలు నాయకత్వం వహించారు. విపత్తులను ఎదుర్కోవడంలో, కుటుంబంలో, గుంపు జీవితంలో మహిళలు వీరోచితమైన, ప్రేమైక పాత్ర నిర్వహించి, నాటి మాతృస్వామ్య సమాజాల్లో ఆదర్శనీయులు, పూజనీయులు అయినారు.

వివిధ పురాణాల, మతాల, చరిత్ర, సంస్కృతులను పరిశీలిస్తే, మహారాష్ట్ర, గుజరాత్ లలో మాతంగ కులము ఉన్నది. మాతంగ మహర్షి ఉన్నాడు. మాతంగ కన్యా మనసా స్మరామి అని మహాకవి కాళిదాసు కాళీమాతను పూజించాడు. మాతంగి పర్యాయ పదాలుగా ఆదిశక్తి, అఖిల జనని, మహా విద్యాధరి, ఎల్లమ్మ, సుందత్తి ఎల్లమ్మ, ఏకవీర, లజ్జగౌరి, సవరేశ్వరీదేవి, దుర్గ, కాళి, కాళీమాత, పార్వతి, మాతంగిదేవి, చాముండి, చండాలిక, ఉచ్ఛిష్ట చండాలిని, రాజమాతంగి, సుముఖ మాతంగి మొదలగు అనేక పేర్లతో భరత ఖండంలో పూజలందు కొంటున్నది. దీనిని బట్టి మన సమాజంలో మాతృస్వామ్య సమాజం జాడలు ఎంతగా విస్తరించి, వ్యాపించి ఉన్నాయో విశదమౌతున్నది. బిడ్డలను, సమూహాలను, సమాజాన్ని ధీరో దాత్తంగా కాపాడి, బతికించే మానవోన్నత మాతృస్వామిక ధర్మమే మాతంగిది అని తెలుస్తున్నది.

పోశమ్మ, మైసమ్మ, మాంకాళమ్మ, ఏకవీర, కాకతమ్మ, సమ్మక్క, సారలమ్మ మొదలగు దేవతలను పరిశీలించినా, బోనాల పండుగ సందర్భంలో ఇప్పటికీ భవిష్యవాణి వినిపిస్తున్న మహిళా సాంప్రదాయాన్ని గమనించినా - మానవ విపత్తులు, అంతకు మించిన ప్రకృతి విపత్తులను ఎదుర్కొనే వేట, వ్యవసాయ, విద్య, వైద్య, వైజ్ఞానిక యుద్ధరంగం, మొదలగు రంగాల మేటి మహిళలు పూజనీయురాళ్ళు అయ్యారని, వారి వాణి సమాజ హితమైనదని మనకు అర్థమవుతుంది. మరి, ఇంత గొప్ప మాతృస్వామ్య వ్యవస్థ ఎప్పుడు ప్రమాదంలో పడింది?

ప్రాచీన భారత ఉప ఖండంలో భిన్న మానవ సమూహాలు, భిన్న సంస్కృతులే ఉన్నప్పటికీ, మాతృస్వామిక సంస్కృతీ సమాజాలే మనుగడ సాగించాయి అనేదానికి ఇలా చాలా ఆధారాలు ఉన్నాయి. గుణగణాల ఆధారంగా మనుషులను ప్లేటో వర్గీకరించిన విధానానికి, ఆర్యులు ప్రవేశ పెట్టిన వ్యవస్థీకృత వర్ణ వ్యవస్థకు దగ్గరి పోలికలు ఉన్నాయి. ఆర్యుల దండయాత్రలు, వలసలతో భారత ఖండంలో వర్ణ వ్యవస్థ,నిర్బంధ వృత్తి బానిస వ్యవస్థలూ మొదలయ్యాయి. పితృస్వామ్యం, అంచెల వారీ ఆధిపత్య కుల వ్యవస్థ ఏర్పడింది. దీంతో మాతృస్వామ్య వ్యవస్థ తీవ్ర ప్రమాదంలో పడింది. దీనితో ప్రాచీన మాతృ పాలనా సంస్కృతికి ప్రతిబింబంగా నిలిచిన మాతంగి వ్యవస్థ ఇప్పటి ఆర్య పితృస్వామ్యం కారణంగా తన దైవిక ప్రాభవం ఒకవైపు నిలుపుకునేందుకు ప్రయత్నిస్తూనే, మరోవైపు భ్రష్టత్వానికి, దోపిడికీ గురవుతున్నది నేడు.

ఆది జాంబవంతుని నివాస, నియంత్రణా ప్రాంతమే జంబూద్వీపం. ఆది జాంబవంతుని వారసులే చర్మకార సమూహాల వారు. నేడు పేదరికం, నిరక్షరాస్యత, అంటరానితనం, అత్యాచారాలు, కులహింసలు, వెట్టి చాకిరి, బాలకార్మిక వ్యవస్థ, పారిశుధ్య వృత్తి వ్యవస్థ,భూమి లేకపోవడం, ఇళ్ళు లేకపోవడం, కనీస వేతనాలు పొందలేకపోవడం, క్వాలిటీ చదువులు లేకపోవడం, నిరుద్యోగం, మార్జినలైజేషన్, మూఢనమ్మకాలు మొదలగు అనేక రూపాల్లో మాదిగలు దోపిడీ, పీడనలకు గురవుతూనే ఉన్నారు.



మాదిగ బాలికలను ఈ దేవతలకు అంకితమిచ్చి, పెళ్లిళ్లు చేసి, వారిని విద్యా, వికాసాలకు, కుటుంబ జీవనానికి దూరం చేసి, అణిచివేతలు కొనసాగించే దురాచారాలు గ్రామ సమాజంలో ఇప్పటికీ దేశంలో కొనసాగుతూనే ఉన్నాయి.

మాదిగ ఆడపిల్లలను మాతంగి, మాతమ్మ,జోగిని,బసివిని, దేవదాసీలుగా అంకితం ఇచ్చినా, ప్రోత్సహించినా, వినోదించిన, ఇలాంటి వారికి మూడేళ్ల జైలు శిక్ష, ఐదువేల రూపాయలు జరిమానా అని 1988లో వచ్చిన, ఏపీ దేవదాసి వ్యవస్థ రద్దు చట్టం చెబుతున్నది. కానీ, ఇంతవరకు ఈ చట్టం అమలుకు ప్రభుత్వాలు నిబంధనలు రూపొందించక పోవడం వల్ల, ఈ చట్టం ఇంతవరకూ అమలు కానేలేదు. ఇదొక చారిత్రిక వ్యవస్థీకృత విషాదం.

ఏ సమాజంలోనైనా స్త్రీల విద్య,అభివృద్ధిల స్థాయిలను ఆ సమాజం యొక్క సామాజిక అభివృద్ధికి కొలమానంగా తీసుకోవాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అంటారు. అణగారిన సమూహాల మహిళల విద్య, ఉద్యోగ, ఆర్థిక, సాంస్కృతిక, నాయకత్వ పరిస్థితులను పెంపొందించు కోవలసిన అవసరం మరింత ఏర్పడింది. వివక్షలకు తావు లేని, సాధికారాన్ని, మెరుగైన జీవనాన్ని అణగారిన మహిళల హక్కుగా దాఖలు చెయ్యాల్సిన అవసరం, బాధ్యత, సమాజంపై, ప్రభుత్వ వ్యవస్థలపై ఉన్నది.

ఈ నేపథ్యంలో, బాధిత సమాజం నుంచి వచ్చి, కాకతీయ విశ్వ విద్యాలయంలో, చరిత్ర విభాగంలో విశేష పరిశోధన చేసిన విద్యార్థిని డాక్టర్ ఇ.వసంత "తెలుగు మాట్లాడే ప్రాంతాల్లో మాతంగి సాంప్రదాయం ఒక పరిశీలన" అను అంశంపై పిహెచ్‌డి కోసం పరిశోధన చేశారు. ఈ పరిశోధన కోసం ఆమె మారుమూల గ్రామాల్లో ఉన్న మాతంగి క్షేత్రాలను, చారిత్రిక కట్టడాలను, మాజీ మాతంగి మహిళలను, మాతంగి పురా గాథలను గురించి వివరించే బైండ్ల కళాకారులను, సంబంధిత కమ్యూనిటీ ప్రజలను కలిసి ఎన్నో ఆధారాలను, విశేష అంశాలను యీ పరిశోధనలో సేకరించారు. పుస్తక భాండాగారాలను దర్శించి, ఎన్నో విలువైన చరిత్ర గ్రంథాలను, పరిశోధనా గ్రంథాలను పరిశీలించారు. యీ గ్రంథంలో దక్షిణ భారతదేశ మాదిగల్లో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో, తెలుగు మాట్లాడే ప్రాంతాల్లో వున్న చర్మకార సమూహాల్లో మాతంగి వ్యవస్థ ఎంత ప్రాచీన కాలం నుంచి, ఎలా వేళ్ళూనుకొని ఉన్నదో విస్తృతమైన, లోతైన అధ్యయనం, ఆంతరిక విశ్లేషణతో తన పరిశోధనా గ్రంథంలో వెల్లడించారు. మాతంగి ఒకనాటి మాతృ స్వామిక వ్యవస్థ సంస్కృతికి ఎలా ప్రతీకగా నిలిచిందో యీ పరిశోధకురాలు చక్కగా విశ్లేషించారు. అలాగే,ప్రస్తుత పితృస్వామిక వ్యవస్థ ఒకప్పటి ఉన్నత, సదాచారమైన మాతంగి వ్యవస్థను వ్యవస్థీకృత దురాచారంగా ఎలా మార్చివేసిందో విశ్లేషించారు. చారిత్రిక ఆచారాల్లో మహిళల నిమ్నోన్నతాలను తెలుసు కోవాలనుకునే ప్రతి ఒక్కరూ ఈ పరిశోధక గ్రంధాన్ని తప్పక చదివి తీరాలి. తాను చేసిన కృషికి డాక్టర్ వసంత చాలా అభినందనీయురాలు.

– కృపాకర్ మాదిగ
సామాజిక ఉద్యమాల కార్యకర్త,
m : 9948311667
e: krupakarponugoti@gmail.com

## పరిశోధకులకు శుభవార్త దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com **- ఎడిటర్**

# సామలు - ఆరోగ్య ప్రయోజనాలు





సామలు (Little Millets) చిరు ధాన్యాలలో ప్రత్యేకమైనవి. ఎందుకంటే అవి పోషకమైనవి. గ్లూటెన్ ఫ్రీ, మరియు నాన్ స్టిక్కీ, నాన్ యాసిడ్-ఫార్మింగ్. ఆరోగ్య నియమాలు పాటించే వారికి సామలను రోజువారి ఆహార దినచర్యలో భాగం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి ఆహార నిపుణుడు, పోషకాహార నిపుణులు చిరు ధాన్యాలు మానవ ఆరోగ్యంపై కలిగించే విశేషమైన ప్రయోజనాల గురించి ప్రచారం చేస్తున్నారు.

సామలు తక్కువ కార్బోహైడ్రేట్ ఉండడం వల్ల, నెమ్మదిగా జీర్ణం అయ్యి, తక్కువ నీటిలో కరిగే గమ్ కంటెంట్ గ్లూకోజ్ జీవక్రియను మెరుగుపరిచేందుకు ఉపయోగపడతాయి. సామలు రక్తంలో చక్కెరను నెమ్మదిగా విడుదల చేస్తాయి.

**ఒక 100 గ్రాముల సాములలో పోషక విలువలు కింది విధంగా ఉంటాయి.**


| | |
|---|---|
| ప్రోటీన్స్ : Protein (g%) | 9.7 గ్రాములు |
| కార్బోహైడ్రేట్లు : Carbohydrate (g%) | 60.9 గ్రాములు |
| ఫ్యాట్ : Fat (g%) | 5.2 గ్రాములు |
| ఐరన్ : Iron (mg%) | 9.3 గ్రాములు |
| Phosphorus (mg%) | 220 గ్రాములు |
| కాల్షియం : Calcium (mg%) | 17 గ్రాములు |
| మెగ్నీషియం : Magnesium (mg%) | 114 గ్రాములు |
| ఎనర్జీ : Energy (Kcal%) | 329 గ్రాములు |
| ఫైబర్ : Crude Fibre (g%) | 7.6 గ్రాములు |
| Ash (g%) | 5.4 గ్రాములు |
| Thiamin (mg%) | 0.30 గ్రాములు |
| Riboflavin (mg%) | 0.09 గ్రాములు |
| నైసిన్: Niacin (mg%) | 3.2 గ్రాములు |

**ఆరోగ్య ప్రయోజనాలు:**

- సామలు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఆహారం. ఇందులో డైటరీ ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటుంది. రక్తంలో గ్లూకోస్ స్థాయినీ వేగవంతంగా పంప్ చేయకుండా స్లోగా గ్లూకోస్‌నీ విడుదల చేస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది.
- సామలులో మెగ్నీషియం ఎక్కువగా ఉంటుంది. ఇది గుండె యొక్క ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడే నియాసిన్ కూడా ఇందులో ఎక్కువగా ఉంటుంది.
- సామలు మిల్లెట్‌లో చాలా ఫాస్ఫరస్ ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి, కణాల పునరుత్పత్తికి మరియు వ్యాయామం చేసిన తర్వాత శక్తి ఉత్పత్తికి ప్రభావవంతంగా ఉంటుంది. ఇది శరీరం యొక్క నిర్విషీకరణలో కూడా సహాయపడుతుంది.
- ఆస్తమా వంటి శ్వాసకోశ పరిస్థితులకు చికిత్స చేయడానికి సామలు ఉపయోగపడతాయి.
- సామలు మిల్లెట్‌లో గ్లూటెన్ ఉండదు. సామల్లో పుష్కలంగా యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి.
- శరీరంలో ఎక్కువ వేడితో బాధపడేవారు సామలను తీసుకోవడం వలన ఉపశమనం పొందవచ్చు. సామలు మన శరీరంలో వేడిని తగ్గిస్తుంది.

- దక్కన్‌న్యూస్
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# మార్పు





పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు.,కథల పుస్తకాలే. పాఠ్య పుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. భాషకు సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించేవి కథలే. కొత్త కొత్త పదాలను పరిచయం చేసేది కథల పుస్తకాలే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి.

పిల్లలలో నైతికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను ఉమ్మడి కుటుంబాల్లో నాయనమ్మలు, అమ్మమ్మలు చెప్పే కథలు నెరవేర్చేవి. మారిన పరిస్థితులలో ఆ బాధ్యతను బాల సాహిత్యమే నెరవేర్చగలదు.

బాలచెలిమి పర్యావరణ కథల పోటీలు - 2023 నిర్వహించింది. తక్కువ సమయంలోనే, వేసవి సెలవులు అయినప్పటికీ విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. మొత్తం 51 కథలు వచ్చాయి. కథలన్నీ చాలా బావున్నాయి. బాల సాహిత్య నిపుణులు ఈ కథలను చదివి, చర్చించి ప్రచురణకు 24 కథలు ఎంపిక చేశారు. ఈ కథల పోటీలు నిర్వహించి మరియు పుస్తక రూపాన్నిచ్చింది బాలచెలిమి. **- వేదకుమార్ మణికొండ**

కులాయి నీరు వృధాగా పోతుంది" అంటూ రమణమ్మ పక్కింటి రాధమ్మతో చెప్పింది అయినా నీటి వృధాను అరికట్టలేదు. సరి కదా వినిపించనట్టు ఊరకుండేది రాధమ్మ. ప్రతిరోజు ఇదే తంతు. రమణమ్మ చెప్పడం రాధమ్మ వినిపించుకోకపోవడం. కానీ రమణమ్మకు నీరు వృధాగా పోయేసరికి బాధనిపించింది ఎందుకంటే రమణమ్మ పర్యావరణ కార్యకర్త. ప్రతి నీటి చుక్క ఎంతో మందికి జీవనాధారమని, వృధా నీటిని అరికడితే ఎంతో పొదుపు చేసిన వారం అవుతామని చెబుతుండేది. రమణమ్మ ఉపన్యాసానికి అందరిలో మార్పు వచ్చి నీటిని పొదుపు చేసేవారు.




కానీ, రాధమ్మలో మార్పు రాలేదు. దెయ్యాల గంగమ్మగా పేరు ఉన్న రాధమ్మ జోలికి ఎవరు పోయేవారు కాదు. ఏ విధంగానైనా సరే రాధమ్మకు తగిన గుణపాఠం చెప్పాలని నిర్ణయించుకున్నది రమణమ్మ.

ఒక రోజు ఇరుగు పొరుగు వారి సహకారంతో రాధమ్మ ఇంటికి కుళాయి నీళ్ళు రాకుండా బంద్ చేయించింది. ఇది తమకు తెలియనట్టు అందరూఊరుకున్నారు. అందరికీ కులాయి ద్వారా నీరు వస్తుంది. కానీ రాధమ్మకు రాకపోయే సరికి మల్ల గుల్లాలు పడింది. కానీ ఎవరిని ఏమి అడగడం లేదు. ఇంట్లో ఉన్న నీటితో సరిపెట్టుకుంది. రాధమ్మకు తాగడానికి మంచినీరు కూడా లేదు. కులాయి రావడం లేదు. ఇరుగుపొరుగును అడుగుదామంటే అహం అడ్డుపడింది.

పర్యావరణ కార్యకర్త అయిన పక్కింటి రమణమ్మతో కూడా ఏమి చెప్పలేదు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బోర్ నుండి నీరు తెచ్చుకోవడం ప్రారంభించింది. ఒకరోజు బిందెలతో నీరు తెస్తుండగా కాలుజారి కింద పడింది. కాలికి స్వల్ప గాయాలయ్యాయి ప్రమాదమేమీ లేదు, కట్టుకట్టారు కాలికి విశ్రాంతి తీసుకోమని డాక్టర్ గారు చెప్పారు.

రాధమ్మ పరిస్థితి ఇప్పుడు "ముందు నుయ్యి వెనక గొయ్యి" అన్నట్లు తయారయింది. ఇరుగుపొరుగు వారందరూ మానవతాదృక్పథంతో రాధమ్మ ఇంటికి వచ్చి ఆమెకు సేవలు చేశారు. తమ ఇంటికి వచ్చే కుళాయి నీళ్లను కూడా రాధమ్మకు ఇచ్చారు. రాధమ్మ ఇరుగు పొరుగు వారితో నేను మీతో మాట్లాడకపోయినా నాకు నీరు అందించి మీ సహృదయత చాటారు. ఇన్ని రోజులు కుళాయి ద్వారా నీరు వృధాగా పోయినా నేను పట్టించుకోలేదు. ఇప్పుడు నీటి విలువ నాకు తెలిసి వచ్చింది.

ఇంకెప్పుడు కూడా నీటిని వృధా చేయనని పర్యావరణ కార్యకర్త పక్కింటి రమణమ్మతో చెప్పి పశ్చాత్తాప పడింది. రాధమ్మలో మార్పు చూసి మరుసటి రోజు నుండి నీరు వచ్చే ఏర్పాటు చేసింది రమణమ్మ.

**- యాడవరం సహస్ర గౌడ్,** ఏడవ తరగతి
శ్రీ చైతన్య, సిద్దిపేట.
ఫోన్ : 9441762105, 9491175965

KNOWLEDGE IS POWER

# Oxford Grammar High School

ogs JUNIORS — grow naturally —

43rd YEARS OF MERITORIOUS PERFORMANCE



## We make school time the best time for your kids

At OGS Juniors, all the children are given a warm, safe, and stimulating environment so that they can grow to become individuals while exploring, imagining, creating, and playing.

- Loving atmosphere & play ground
- CCTV surveillance
- Certified teachers & caring staff
- Kids zone & play area
- Interactive & Value based Learning

**CARING TEACHERS & STAFF**
Your child will get the best care and attention

**ECO-FRIENDLY PRACTICES**
We let the children play with nature friendly material

**HUGE PLAYGROUND**
Your child will get lots of fresh air and playtime

**INTERACTIVE LEARNING**
Our trusted method helps your child communicate and learn with ease.

**Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512**

DECCAN LAND, Telugu Monthly Magazine Date of Publication 28th - September 2024
ISSN 2581-3188
Postal Dates: 28th & 29th Every Month

PRGI Regn. No. TELTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2024-2026

VOL 13వ వసంతంలో
146 ISSUES నూట నలభై ఆరవ సంచిక
పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్





## పన్నెండు వసంతాల ప్రస్థానం...

తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2024 అక్టోబర్ సంచికతో 146 నెలలు పూర్తి చేసుకుంది. ఈ కాల వ్యవధిలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' ఇప్పటి వరకు వెలువడిన సంచికలను (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020, 2021, 2022, 2023) సంకలనాలుగా (12 నెలలకు ఒక సంకలనంగా) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో కూడా వచ్చే సంచికలను సంకలనాలుగా తీసుకు వస్తామని తెలియ జేస్తున్నాం. ఆసక్తి కలవారు ఒక్కో సంకలనాన్ని రూ.400-లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం).



**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
"చంద్రం" 3-6-712/2, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288
Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAK MAHINDRA BANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar